సాక్షి 24|7
నాగర్‌కర్నూల్
శనివారం 6-1-2018



“

నష్టపరిహారం ఇవ్వాలి

కేఎల్‌ఐ నీళ్లు వస్తాయని ఐదు ఎకరాలలో వేరుశనగ పంట వేసుకున్నా. నా పొలం పక్కనుంచి వెళ్లే కేఎల్‌ఐ కాల్వ తెగి పొలం మొత్తం నీటితో మునిగిపోయింది. వేలకు వేలు పెట్టుబడి పెట్టి చాలా నష్టపోయాం. ఈ విషయమై కలెక్టర్‌కు కూడా వినతి పత్రం ఇచ్చాం. తహసీల్దార్‌కు రాసినా.. ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు. ప్రభుత్వం స్పందించి మాకు తగిన నష్టపరిహారం వచ్చేలా చేయాలి.

– వెంకట్‌రెడ్డి,
రైతు, చర్ల ఇటిక్యాల



తాడూరు మండలం చర్ల ఇటిక్యాల వద్ద తెగిపోయిన కాల్వ(ఫైల్)

తెంచారా..
తెగిందా..?



ఊర్కొండ మండలం గుడిగాన్‌పల్లి వద్ద తెగిన కాల్వ

- కేఎల్‌ఐ కాల్వలకు గండిపడి 215ఎకరాల్లో పంట నష్టం
- నాసిరకం పనులతో కాల్వలు తెగుతున్నాయని రైతులు ఆరోపణ
- చెరువులు నింపేందుకే గండికొట్టామంటున్న అధికారులు
- ఆదుకోవాలని కలెక్టర్‌కు బాధితుల వేడుకోలు

నాగర్‌కర్నూల్: జిల్లాకు వరప్రదాయనిగా ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా కాల్వల వెంట నీరు నిండుగా ప్రవహిస్తోంది. దీంతో జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ.. కొందరికి ఈ కాల్వలే కడగండ్లను మిగిలిస్తోంది. కేఎల్‌ఐ కాల్వలు నాసిరకంగా

మిగతా 2వ పేజీలో ▶

- కల్వకుర్తి కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమవ్యాపారం
- అనుమానం ఉన్న రైస్ మిల్లుల్లో రికార్డులు సీజ్
- దాడులు ముమ్మరం చేసిన పౌర సరఫరాల శాఖ అధికారులు
- పట్టణ శివారులోని మిల్లులే అక్రమ వ్యాపారానికి అడ్డాలు
- అక్రమ వ్యాపారం వెనుక ఓ బడా వ్యాపారి హస్తం?

రీసైక్లింగ్ దందా!



కల్వకుర్తి సమీపంలో ఓ రైస్ మిల్లులో సోదాలు నిర్వహిస్తున్న పౌర సరఫరాల అధికారులు

“

విచారణ జరుగుతోంది

పేదలకు చేరవేయాల్సిన బియ్యం పంపిణీలో అక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. మిల్లర్లు పేదల నుంచే తీసుకుని తిరిగి ప్రభుత్వానికి రీసైక్లింగ్ ద్వారా అందజేస్తున్నారని తెలియడంతో ఈ దాడులు నిర్వహించాం. పూర్తి ఆధారాలు సేకరించే పనిలో ఉన్నాం. ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం రెండు రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించగా వారు అందుబాటులో లేరు. అక్కడ కొన్ని వివరాలు సేకరించాం.

– మోహన్‌బాబు,
పౌర సరఫరాల అధికారి

సాక్షి, నాగర్‌కర్నూల్/ నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్: కల్వకుర్తి కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతుందన్న ఫిర్యాదులపై రాష్ట్ర పౌర సరఫరాల అధికారులు శుక్రవారం విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈసందర్భంగా అనుమానం ఉన్న మూడు రైస్ మిల్లుల్లో రికార్డులను సీజ్ చేశారు. ఆ శాఖ ప్రత్యేకాధికారి విశ్వనాథం ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ స్పెషల్ అధికారి రాజేశం, నాగర్‌కర్నూల్ జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్‌బాబు శుక్రవారం పలు మిల్లులలో తనిఖీలు నిర్వహించి అక్రమాలు జరిగినట్లుగా నిర్ధారణకు వచ్చారు. ఉప్పునుంతల మండలం వెల్టూరులోని శ్రీనివాస రైస్ మిల్, తిప్పారెడ్డిపల్లి సమీపంలోని

మిగతా 2వ పేజీలో ▶

చదువుతోనే సంస్కారం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి జూపల్లి, కలెక్టర్ శ్రీధర్

- మనిషి తలచుకుంటే ఏదైనా సాధ్యమే
- చదువు ఎన్నో అవకాశాలకు నిలయం
- విద్యా ప్రేరణ సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు
- విజయానికి తొలి అడుగు పదో తరగతే: కలెక్టర్ శ్రీధర్

– కొల్లాపూర్ రూరల్

వివరాలు 16లో ▶

మార్చినాటికి 3వేల ఎకరాల సేకరణ

– కొల్లాపూర్

- కార్పొరేషన్ రుణాలకు బ్యాంకర్లు సెక్యూరిటీ, డిపాజిట్లు కోరితే ఫిర్యాదు చేయండి
- నిరుద్యోగ యువతకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి శిక్షణ కేంద్రాలు
- ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం

10లో

కటాకటాల్లోకి జ్యోతి

7లో

- ★ భర్త హత్య కేసులో అరెస్ట్
- ★ స్నేహితులతో కలిసి ప్రియుడే హత్య చేసినట్లు పోలీసుల వెల్లడి
- ★ పెళ్లికి ముందు నుంచే జ్యోతి ప్రేమాయణం

– అడ్డాకుల (దేవరకద్ర)

ఆపరేషన్ స్మైల్–4

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన స్పెషల్ డ్రైవ్
- బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు పకడ్బందీ ప్రణాళిక
- 9 నుంచి జిల్లాలో జల్లెడ పట్టనున్న రెస్క్యూ బృందాలు



మహబూబ్‌నగర్ న్యూటౌన్: చిరునవ్వులు చిందించాల్సిన బాలబాలికలు చాలాచోట్ల వివిధ రకాల పనుల్లో మగ్గిపోతున్నారు. హోటళ్లు, ఇతరత్రా పనులే కాకుండా పత్తి చేన్లలో బాల్యం కరిగిపోతుండగా.. మరికొందరు యాచిస్తూ గడుపుతున్నారు. ఈ మేరకు బాలకార్మికులు, తప్పిపోయిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పజెప్పడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన రెవెన్యూ, పోలీసు, కార్మిక, వైద్య, యువజన క్రీడలు, విద్యా శాఖలే కాకుండా చైల్డ్‌లైన్, ఎన్‌జీఓల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్–4 కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా రెస్క్యూ ఆపరేషన్లు చేపట్టి పిల్లలను గుర్తించాక స్టేట్ హోం, చైల్డ్‌హోం, బ్రిడ్జి స్కూళ్లలో చేర్పించాలనేది లక్ష్యం.

బృందాలుగా... స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నోడల్ ఏజెన్సీగా మిగతా శాఖలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆపరేషన్ స్మైల్ చేపడుతారు. ఈనెల 1వ తేదీన ప్రారంభమైన కార్యక్రమంలో భాగంగా 8వ తేదీ వరకు పిల్లలను చేర్పించేందుకు అనువైన వాతావరణం ఉందా, లేదా అని స్టేట్ హోం, చైల్డ్ హోం, బ్రిడ్జి స్కూళ్లను పరిశీలిస్తారు. ఒకవేళ అలా లేకపోతే ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత ఈనెల ఆఖరు వరకు రెస్క్యూ చేపట్టి పనుల్లో మగ్గుతున్న పిల్లలు, తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన వారిని గుర్తిస్తారు. ఆ తర్వాత పోలీసుల సాయంతో తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించనున్నారు. అలాగే, బాలకార్మికులుగా వివిధ రకాల పనుల్లో ఉన్న వారిని గుర్తిస్తూ, పనిలో పెట్టుకున్న యాజమానులపై కేసులు నమోదు చేయడమే కాకుండా జరిమానా రూపంలో వచ్చిన నగదును పిల్లలు పేరిట బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తారు. ఆ తర్వాత తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిని స్కూళ్లలో చేర్పించనున్నారు. తద్వారా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించవచ్చన్నది ప్రభుత్వ భావన.

షెడ్యూల్ ఇలా...

- 8వ తేదీ వరకు పిల్లలకు ఆశ్రయం కల్పించేందుకు జిల్లా కేంద్రంలోని మూడు కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు చేస్తారు.
- ఈనెల 9 నుంచి 31 వరకు రెస్క్యూ టీమ్‌ల ఆధ్వర్యాన తప్పిపోయిన పిల్లలు, యాచనలో గడుపుతున్న పిల్లలు, వీధి బాలలు, ఇటుక బట్టీలు, పత్తి చేన్లలో పనిచేస్తున్న బాలబాలికలను గుర్తించి పోలీస్‌స్టేషన్లలో ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తారు. ఆ తర్వాత పిల్లల పూర్తి వివరాలను ట్రాకింగ్ సిస్టంలో నమోదు చేస్తారు.
- ఆపరేషన్ స్మైల్ ద్వారా గుర్తించిన పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు ప్రవేశపెట్టి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారి సంరక్షణకు అప్పగిస్తారు. అలా కుదరకపోతే బాలసదన్, స్టేట్‌హోంల్లో చేర్పించి వారి సంరక్షణకు చర్యలు తీసుకుంటారు.

గత మూడేళ్లలో..

- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 2015, 2016, జిల్లాల విభజన అనంతరం మహబూబ్‌నగర్ జిల్లాలో 2017లో జనవరి, జూలై మాసాల్లో ఆపరేషన్ స్మైల్–1, 2, 3, ఆపరేషన్ ముస్తాన్–1, 2, 3 కార్యక్రమాలు నిర్వహించారు.
- 2015 జనవరిలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్–1 ద్వారా 25 మంది పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పజెప్పారు.
- 2015 జూలైలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్–1 ద్వారా జిల్లాలో పనుల్లో ఉన్న, అనాథలు, యాచిస్తున్న 307 మంది పిల్లలను గుర్తించారు. ఇందులో 253 మంది పిల్లలు మన రాష్ట్రానికి చెందిన వారు కాగా, 33 మంది ఇతర రాష్ట్రాల వారని అధికారులు గుర్తించారు. మిగతా వారు అనాథలుగా తేలింది.
- 2016 జనవరిలో ఆపరేషన్ స్మైల్–2 ద్వారా 549 మంది పిల్లలను గుర్తించారు. ఇందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 145 మంది పిల్లలను బడిలో చేర్పించారు.
- 2016 జూలైలో ఆపరేషన్ ముస్కాన్–2 కార్యక్రమం ద్వారా 375 మంది పిల్లలను గుర్తించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 120 మందిని బడిలో చేర్పించారు.
- జిల్లాల పునర్విభజన అనంతరం 2017 ఆపరేషన్ స్మైల్–3 ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాలో 180 మంది వివిధ పనుల్లో ఉండగా రెస్క్యూ బృందాలు గుర్తించాయి. 180 మంది బాల, బాలికలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు ప్రవేశపెట్టి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి 157 మంది పిల్లలను బడిలో చేర్పించారు. మిగతా వారు ఇతర రాష్ట్రాలకు వారు కాగా తల్లిదండ్రులకు అప్పగించారు.
- 2017 జూలైలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్–3 ద్వారా 127 మంది పిల్లలను గుర్తించారు. అందరినీ చైల్డ్ వెల్ఫేర్ కమిటి ముందు ప్రవేశపెట్టి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి బడిలో చేర్పించారు.

తెంచారా.. తెగిందా..?



చర్ల ఇటిక్యాల వద్ద నీట మునిగిన పత్తి పంట

▶ మొదటి పేజీ తరువాయి

నిర్మించడంతో కొన్ని చోట్ల వాటికి గండిపడి, రైతుల పొలాలను నాశనం చేస్తున్నాయి. జిల్లాలో కల్వకుర్తి, తిమ్మాజిపేట, బిజనేపల్లి, తాడూరు మండలాల్లో ఇలా 215 ఎకరాలు నీటి మునిగింది. అయితే అధికారులు మాత్రం తామే కావాలని మరిన్ని చెరువులు నింపేందుకు కాల్వలకు గండి కొడుతున్నామని సమర్థించుకుంటున్నారు. నాసిరకంగా పనులు చేయడం వల్లే కాల్వలు తెగుతున్నాయని కొందరు రైతులు ఆందోళనలు చేయడంతో అధికారులు సంబంధింత పంట పొలాలను పరిశీలించి, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నారు. మరోవైపు నీటి పారుదల శాఖ మాత్రం కట్టలకు ఎప్పటికప్పుడు చేయిస్తున్నా.. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలకు వెనుకాడుతున్నారు.

కొన్ని సంఘటనలు ఇవీ..

వట్టెం శివారులోని ప్రధాన కాలువకు నవంబర్‌లో పెద్దగండి పడి దాదాపు శివారు ప్రాంతంలోని 40ఎకరాల పత్తిపంట నీట మునిగింది. తిమ్మాజిపేట మండలం మారేపల్లిలో రెండు నెలల కిందట కాల్వ కట్టకు గండిపడడంతో 70ఎకరాలలో పత్తి పంటను రైతులు నష్టపోయారు. తాడూరులో గతనెల చర్ల ఇటిక్యాల వద్ద కాల్వ కట్ట తెగిపోవడంతో దాదాపు 60ఎకరాలు పంటలు నీట మునిగిపోయాయాయి. ఇదే మండలంలో బలాన్‌పల్లి, కొమ్ముగుట్ట వద్ద కూడా కాల్వలకు గండిపడి పెద్ద నష్టమే వాటిల్లింది. కల్వకుర్తి నియోజకవర్గం ఊరుకొండ మండలం గుడిగానిపల్లి, కల్వకుర్తి మండలం కుర్మిద్ద వద్ద ప్రధాన కాలువ తెగిపోవడంతో మరో 20ఎకరాలు నీట మునిగింది.

జిల్లాలో జరిగిన ఈ సంఘటనలు కేవలం నాణ్యత లేని కాలువ పనులతోనే నష్టం జరిగిందని చెబుతుండగా అధికారులు మాత్రం చెరువు నింపేందుకే కట్టలు తెంపామని చెబుతున్నారు.

గండికొట్టే ముందు సమాచారం ఇవ్వరా?

తాము చెరువులు నింపేందుకే కాల్వలకు గండికొట్టామని చెబుతున్న అధికారులు.. నీళ్ల ప్రవహించే ప్రాంతంలో ఉన్న పొలాలకు సంబంధించి రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు ఒక్క రైతులకు కూడా సమాచారం ఇచ్చిన దాఖలాలు లేవు. ఇదిలా ఉండగా పంటలు కోల్పోయిన తాడూరుకు చెందిన రైతులు గతనెల 19న కలెక్టర్ శ్రీధర్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన బాధితులకు న్యాయం చేయాలని తాడూరు తహసీల్దార్‌ను ఆదేశించగా.. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బిజినేపల్లి మండలం షట్టెం గ్రామానికి చెందిన రైతులు కాలువ పనులు చేసిన కంపెనీ ముందు ఆందోళన చేపట్టగా రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇంత జరగుతున్నా నాసిరకం పనులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తామే కట్టలు తెంచామని చెప్పడం కొంత అయోమయానికి గురిచేస్తోంది.

కాల్వలు పరిశీలిస్తున్నాం..



29 ప్యాకేజీకి సంబంధించిన కాలువను మరోసారి పరిశీలిస్తున్నాం. ఎక్కడైనా సమస్యాత్మకంగా ఉంటే వాటికి మరమ్మతులు చేపడుతున్నాం. కాలువలు తెగిపోయాయనేది అవాస్తం. కొన్ని చోట్ల చెరువులు నింపేందుకు కాలువలకు గండి కొట్టాం. దీంతో కొన్ని చొట్ల పంట పొలాల్లోకి నీరు వచ్చాయి.

– రమేష్ జాదవ్, ఈఈ, కేఎల్ఐ

రీసైక్లింగ్ దందా!



అక్రమాలు జరుగుతున్నట్లుగా భావిస్తున్న ఉప్పునుంతల మండలం వెల్టూరులోని రైస్ మిల్లు

▶ మొదటి పేజీ తరువాయి

సాయి వెంకటేశ్వర ఇండస్ట్రీస్‌లో సోదాలు నిర్వహించగా రేషన్ బియ్యాన్ని ఇక్కడి నుంచి తిరిగి ప్రభుత్వానికి ఇచ్చినట్లు సృష్టించారని ప్రాథమికంగా తేలింది. వాస్తవానికి ఈ మిల్లులో సదరు అధికారులు వడ్లు ఆడించకుండానే రేషన్ బియ్యాన్ని ఇక్కడికి తరలించి మళ్లీ ఇక్కడి నుంచి రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి వాటిని అమ్మినట్లుగా ప్రాథమిక అంచనాకు అధికారులు వచ్చారు. ఈ రెండు రైస్ మిల్లులకు సంబంధించిన రికార్డులను, మిల్లుల ఎలక్ట్రిసిటీ బిల్లులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రూ.4కి కొని.. రూ.24కు విక్రయం..

ప్రస్తుతం ప్రభుత్వం జిల్లా అవసరాలకు 20 రైస్ మిల్లుల నుంచి రేషన్ బియ్యం సేకరిస్తోంది. వీటిని గ్రామాల్లోని రేషన్ బియ్యం, పాఠశాలలకు సన్నబియ్యం చేరవేస్తోంది. రేషన్ దుకాణాల్లో రూ.1కి కిలో అందజేస్తుండగా రైస్ మిల్లర్లకు రూ.24 చెల్లిస్తోంది. రైతుల నుంచి వడ్లను కొనుగోలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన కొందరు మిల్లర్లు పేదలకు ఇచ్చిన రేషన్ బియ్యాన్ని వారి నుంచి రూ.4 నుంచి రూ.5కు కొనుగోలు చేసి అవే బియ్యాన్ని రూ.24కి ప్రభుత్వానికి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగం జిల్లాలో గత కొద్దికాలంగా జోరుగా సాగుతోంది. జిల్లాలోని 20మండలాల పరిధిలోని రేషన్ దుకాణాలు, 4,777క్వింటాళ్ల బియ్యం ప్రతి నెలా అవసరమవుతుంది. జిల్లాలో మొత్తం ఏడు స్టాక్ పాయింట్లు ఉన్నాయి. నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, తెలకపల్లి, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి స్టాక్ పాయింట్ల ద్వారా జిల్లాలోని అన్ని ప్రాంతాలకు బియ్యం పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం సీజ్ అయిన రైస్ మిల్లుల నుంచి ఇటీవల కాలంలో ప్రభుత్వం ఇప్పటి వరకు 2,700 క్వింటాళ్ల బియ్యాన్ని కొనుగోలు చేసింది.

అంతా బడా వ్యాపారి కనుసన్నల్లోనే..?

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా రేషన్ బియ్యాన్ని సేకరించి, వాటిని తిరిగి ప్రభుత్వానికి అమ్మి రూ.కోట్లకు పడగలెత్తిన కల్వకుర్తికి చెందిన ఓ బడా వ్యాపారి హస్తంఉందని జిల్లా పౌర సరఫరాల శాఖకు ఇటీవల ఫిర్యాదు వచ్చింది. ఈ నేపథ్యంలో ఈయనపై దృష్టి సారించారు. తాను తన మిల్లులో అక్రమ దందా చేస్తే దొరికిపోతానని భావించిన సదరు వ్యాపారి శివారు ప్రాంతాల్లోని రైస్ మిల్లులను లీజ్‌కు తీసుకుని ఇతరుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆయా మిల్లుల్లో భద్రపర్చి అటు నుంచి తిరిగి ప్రభుత్వానికి అమ్ముతూ వస్తున్నారు. వాస్తవానికి రైస్ మిల్లులు సరిగా నడవని మిల్లుల యజమానులు ఈ తతంగమంతా తెలియక సదరు వ్యాపారికి మిల్లులను లీజుకిచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రైస్ మిల్లులు సీజ్ కావడంతో వాటి యజమానులపై పౌర సరఫరాల శాఖ కేసు నమోదు చేయనుంది. లీజుకు తీసుకున్న వ్యాపారి మాత్రం అధికారుల చర్యలను తప్పించుకునేందుకు ఈ కుట్రపన్నినట్లు తెలుస్తోంది. కల్వకుర్తి సమీపంలోని వెల్టూరు, తిప్పారెడ్డిపల్లి, తాండ్ర శివారులో కొంతకాలంగా అక్రమ బియ్యం వ్యాపారం యథేచ్ఛగా సాగుతూ వస్తోంది. వీరికి స్టాక్‌పాయింట్ అధికారులు, సివిల్ సప్లయి శాఖలోని పలువురు ఉద్యోగులు సహకరిస్తుండంతో ఈ తతంగం అడ్డు అదుపు లేకుండా సాగింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర సివిల్‌సప్లయి కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన రహస్యంగా దీనిపై నిఘా పెట్టారు. దీంతో బండారం బయటపడినట్లయింది.

అధికారులపై వేటుకు రంగం సిద్ధం?

జిల్లాలోని సివిల్ సప్లయి శాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులు రేషన్ బియ్యం రీసైక్లింగ్‌కు సహకరిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో వారిపై చర్యలు తీసుకునేందుకు సివిల్ సప్లయి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ సీవీ ఆనంద్ ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు తీసుకున్నారని అంటున్నారు. అలాగే ప్రభుత్వానికి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్న మిల్లర్లపై కూడా చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న మిల్లుల రికార్డులను, వారి డెయిలీ రిజిస్ట్రర్లను, ఆడిట్ రిజిష్ట్రర్లను, ఆడిట్ వినియోగానికి సంబంధించిన సమాచారం తెలుసుకుంటున్నారు. ప్రభుత్వానికి ఇస్తున్న బియ్యానికి, మిల్లులో ఆడిన వడ్లకు, వాడిన కరెంట్‌కు సంబంధం ఉందా లేదా అన్న కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. ఇవన్నీ సరిపోలితేనే రైస్ మిల్లులపై చర్యలు ఉండవని, ఏమాత్రం తేడా వచ్చినా క్రిమినల్ కేసులు ఉంటాయని అంటున్నారు.

అక్రమార్కుల గుండెల్లో దడ

- రెండోరోజు కొనసాగిన ఐటీ అధికారుల విస్తృత తనిఖీలు
- జిన్నింగ్ మిల్లులు, యజమానుల ఇళ్లలోనూ పరిశీలన
- రైతులు, సబ్ఆర్గనైజర్లను విచారించిన అధికారులు
- కీలక రికార్డులు స్వాధీనం.. మీడియాను అనుమతించని వైనం
- తనిఖీల్లో గోప్యతపై అనుమానాలు



ఓ మిల్లులో తనిఖీలు చేస్తున్న ఐటీ అధికారులు

సాక్షి, గద్వాల: కాటన్ సీడ్‌పై కంపెనీలు పన్నుల చెల్లింపుల్లో వ్యవహరిస్తున్న తీరుతో ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రెండు ప్రధాన సీడ్ కంపెనీలు కాటన్ సీడ్ ప్యాకెట్‌కు రూ.600 చెల్లిస్తున్నట్లుగా లెక్కల్లో చూపడం, రైతుకు కేవలం రూ.450 మాత్రమే చెల్లిస్తుండటం, ఇటీవల ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వ ఆదేశానుసారం ఐటీశాఖ దాడులకు ఉపక్రమించినట్లు సమాచారం. గురువారం జిన్నింగ్ మిల్లులు, మిల్లుల యజమానుల ఇళ్లపై ప్రారంభించిన తనిఖీలు.. శుక్రవారం రెండో రోజు సైతం కొనసాగాయి. ఇటీవల జిల్లా అధికారులు జిన్నింగ్ మిల్లులపై మూకుమ్మడిగా దాడులు చేసి 60మందికిపైగా బాలకార్మికులకు విముక్తి కల్పించగా.. మూడు రోజుల క్రితం జిల్లా వ్యవసాయాధికారులు దాడులు చేసి రూ. 7 కోట్ల విలువ చేసే అనుమతిలేకుండా నిల్వ ఉంచిన పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా వరుసగా జిన్నింగ్ మిల్లులపై దాడుల పరంపర కొనసాగుతుంది. ఐటీ అధికారుల దాడులు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే ఐటీ దాడి సమాచారం తెలుసుకున్న కొంతమంది ఆర్గనైజర్లు, మిల్లుల యజమానులు అజ్ఞాతంలోకి వెళ్లారు. మీడియాను అనుమతించకపోవడం, ఎలాంటి వివరాలు తెలపకుండా ఐటీ అధికారులు గోప్యత పాటించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

11 కంపెనీలకు పైగా వ్యాపారం..

జోగుళాంబ గద్వాల జిల్లాలో 45 వేల ఎకరాల్లో కాటన్‌సీడ్ సాగు అవుతుంది. ప్రతిఏటా రూ.వెయ్యి కోట్ల వరకు టర్నోవర్ అవుతుంది. కాటన్ సీడ్ పండించడం మొదలుకొని, పత్తి విత్తనాలు వేరు చేసే వరకు అనేక అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో 11 విత్తన కంపెనీలు పత్తి విత్తనాల ఉత్పత్తి చేస్తున్నాయి. ఆర్గనైజర్లను మధ్యవర్తులుగా చేసుకుని రైతుల ద్వారా సీడ్‌పత్తిని పండిస్తున్నారు. ఏ కంపెనీకి సంబంధించిన విత్తనాలు ఎంతమంది రైతులు సాగు చేస్తున్నారు.. ఎన్ని ఎకరాల్లో సాగవుతుందనేది.. వ్యవసాయ శాఖ అధికారులకు కూడా తెలియని పరిస్థితి. ఇటీవల పట్టుబడిన పత్తి విత్తనాలకు ఎలాంటి లెక్కాపత్రం లేకపోవడమే ఇందుకు నిదర్శనం.

ఇళ్లకు తాళాలు.. ఫోన్లు స్విచ్ఛాఫ్

ఐటీ శాఖ దాడులతో జిన్నింగ్ మిల్లుల యజమానుల్లో గుబులు మొదలైంది. చాలా మంది అజ్ఞాతంలోకి వెళ్లారు. అధికారులు ఇళ్ల వద్దకు వెళ్తే ఇళ్లకు తాళాలు వేసి ఉండటం, ఫోన్లు సైతం స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. నిబంధలకు అనుగుణంగా నిర్వహిస్తే ఐటీశాఖ అధికారులు దాడులు నిర్వహిస్తే మిల్లుల యజమానులు ఎందుకు అజ్ఞాతంలోకి వెళ్లారని పలు ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కీలక రికార్డులు స్వాధీనం చేసుకుంటున్న భవిష్యత్‌లో మరింత తోతుగా విచారించడం తోపాటు, కంపెనీలపై కూడా రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహించే అవకాశాలున్నాయని తెలిసింది.

ఎలాంటి నిబంధనలు పాటించకుండా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న సీడ్ కంపెనీలపై ప్రభుత్వం దృష్టి సారించడంలో భాగంగానే ఎక్కడెక్కడ విత్తన ఉత్పత్తి చేస్తున్నారనే కోణంలో దాడులు కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

ఆరు బృందాలు..

ఐటీశాఖ అధికారులు సుమారు ఆరు బృందాలుగా విడిపోయి విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. జిన్నింగ్ మిల్లులపై దాడులు చేసి రికార్డులు స్వాధీనం చేసుకున్న అధికారులు శుక్రవారం ఆర్గనైజర్ల ఇళ్లలోనూ తనిఖీలు చేశారు. సబ్ ఆర్గనైజర్లు, రైతుల వారిగా అక్కడికి పిలిపించుకుని వివరాలు సేకరించినట్లు సమాచారం. రైతులకు వడ్డీకి ఇస్తున్న సొమ్ముకు, పత్తి కొనుగోళ్లు, కాటన్ బేళ్లు, రైతు పండించిన పంటలు, జిన్నింగ్ వచ్చిన పత్తి, కంపెనీలు స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాలు, ప్యాకెట్‌పై ఆర్గనైజర్లకు కంపెనీలు చెల్లిస్తున్న ధర, ఆర్గనైజర్లు ప్యాకెట్‌పై రైతుకు చెల్లిస్తున్న ధర ఇలా అన్ని కోణాల్లో ఐటీ అధికారులు తనిఖీలు జరిపారు. తనిఖీల అనంతరం పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకుంటున్నారు.

ప్రాణం తీసిన మరుగుదొడ్డి గుంత

- గుంతలో నీరు ఎత్తిపోస్తుండగా విద్యుదాఘాతం
- యువకుడి దుర్మరణం
- వీధినపడిన కుటుంబం



విష్ణు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి శాంతమ్మ

చిన్నంబావి (వనపర్తి): ఇంటి ముందు తవ్విన మరుగుదొడ్డి గుంత ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన మండలంలోని బెక్కెంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లం విష్ణు(32) ఇంటి ముందు తవ్వన మరుగుదొడ్డి గుంతలోకి నీరు చేరడంతో ఎత్తిపోసేందుకు విద్యుత్ మోటారు బిగించాడు. ఈ క్రమంలో నీళ్లకు ఎర్త్ అయ్యి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విష్ణు మరణ వార్త తెలిసిన వెంటనే ఆయన భార్య స్పృహ కోల్పోవడంతో కొల్లాపూర్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. విష్ణుకు తల్లిదండ్రులతో పాటు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న విష్ణు మృతితో కుటుంబం వీధినపడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గుట్కా ప్యాకెట్లు, బొలేరో స్వాధీనం



గుట్కా ప్యాకెట్లతో సీజ్ చేసిన బొలేరో

మహబూబ్‌నగర్ క్రైం: కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ నుంచి మహబూబ్‌నగర్‌కు అక్రమంగా గుట్కా ప్యాకెట్లు సరఫరా చేస్తున్న ఓ బొలేరోను వన్‌టౌన్ పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. వన్‌టౌన్ సీఐ రామకృష్ణ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని హనుమాన్‌పురకు చెందిన మహ్మద్ ఖాజామైనొద్దీన్ అనే వ్యక్తి తన బొలేరోలో ఉదయం వేళలో ఓ దినపత్రిక పేపర్లు సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం తిరిగి వస్తుండగా కారులో రాయిచూర్ నుంచి మహబూబ్‌నగర్‌కు అక్రమంగా గుట్కా ప్యాకెట్లు తీసుకువస్తుంటే స్థానిక పాలిటెక్నిక్ గేట్ దగ్గర చేసిన తనిఖీల్లో పట్టుబడ్డాయి. ఈ సందర్భంగా దాదాపు రూ.80 వేల విలువ గల గుట్కాలు స్వాధీనం చేసుకుని కారును పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అయితే మహ్మద్ ఖాజామైనొద్దీన్‌కు షాద్‌నగర్‌కు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి ఫోన్ చేసి గుట్కా ప్యాకెట్లు తీసుకురావాలని చెబితే తీసుకువెళ్తున్నానని చెప్పాడన్నారు. అయితే ప్రవీణ్ ఆచూకీ ఇంకా లభించలేదని సీఐ వెల్లడించారు. ప్రవీణ్ అనే వ్యక్తి గురించి ఆరా తీస్తున్నామని, ఈ మేరకు ప్రస్తుతం కారు సీజ్ చేయడంతోపాటు ఖాజామైనొద్దీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

శ్రీశైలం జలాశయంలో 869.3 అడుగుల నీటిమట్టం

దోమలపెంట (అచ్చంపేట): శ్రీశైలం జలాశయంలో శుక్రవారం సాయంత్రం వరకు 869.3 అడుగుల వద్ద 138.9520 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జలాశయం ఎగువన పోతిరెడ్డిపాడు ద్వారా బానకచర్లకు 2 వేలు, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 2,363, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 440, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి జరగలేదు.

సోనామసూరి ధర రూ.2,101


దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం జరిగిన ఈనామ్ వేలంలో సోనామసూరి ధర గరిష్టంగా రూ.2,101 ఒకే ధర వచ్చింది. హంస ధర రూ.1,809గా వచ్చింది. ఆముదాలకు గరిష్టంగా రూ.3,966, కనిష్టంగా రూ.3,956 ధరలు నమోదయ్యాయి. అలాగే కందులు గరిష్టంగా రూ.4,650, కనిష్టంగా రూ.4,250 వచ్చాయి. కందులు వంద క్వింటాళ్ల వరకు రాగా.. ఆముదాలు 20 క్వింటాళ్ల వరకు అమ్మకానికి వచ్చింది. గత మూడు రోజులుగా రాని వరి ధాన్యం శుక్రవారం మాత్రమే మళ్లీ వచ్చింది.

వనపర్తి జిల్లాలో మళ్లీ చోరీ

వనపర్తి విద్యావిభాగం: వనపర్తి జిల్లాకేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. పెబ్బేరు, కొత్తకోట దోపిడీ సంఘటనల నుంచి తేరుకోకముందే మరోసారి వనపర్తి పట్టణంలో విజృంభించారు. మూసి ఉన్న నాలుగు ఇళ్లను టార్గెట్ చేసి 27.5 తులాల బంగారం, 35 తులాల వెండి, రూ.65 వేల నగదును దోచుకెళ్లారు. రాంనగర్‌కాలనీ, బ్రహ్మంగారి వీధిలో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు విరుచుకుపడ్డారు. కాలనీలో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి కనీసం పక్కింటి వారికి కూడా తెలియనంత నైపుణ్యంతో దొంగలు ఇళ్ల తాళాలను విరగ్గొట్టి విలువైన బంగారు, వెండి నగలు, నగదును దోచుకెళ్లారు. రాంనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ చెన్నయ్య హైదరాబాద్‌లో వృత్తిపరమైన శిక్షణకు వెళ్లాడు. ఇంట్లో ఇతర కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఇతర పనుల మీద ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం వచ్చి చూడగానే ఇంటి తాళం విరగ్గొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 12.5 తులాల బంగారు, 35 తులాల వెండి, రూ.65 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఇటీవల ఇంట్లో చిన్నారి డోలాహరణం జరగడంతో బంధువులు పెట్టిన బంగారు, వెండి అభరణాలు మొత్తం దొంగలు దోచుకెళ్లడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. బ్రహ్మంగారి గుడి సమీపంలో నివసిస్తున్న ప్రవీణ్ వృత్తిరీత్యా స్వర్ణకారుడు. ఇంట్లోనే బంగారు ఆభరణాల పనులు చేస్తున్న ప్రవీణ్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రాత్రి ఇంటికి తాళం వేసి సవాయిగూడెంలో పని నిమిత్తం వెళ్లారు. శుక్రవారం ఉదయం రాగా ఇంటి తాళం విరగ్గొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా మూడు బీరువాలను తెరిచి 15 తులాల బంగారు నగలు దోచుకెళ్లారు. విలువైన పత్రాలు, దుస్తులను చిందరవందరగా పడేశారు. రాంనగర్‌కాలనీలో మరో ఇంట్లో తాళం వేసి గతం కొంత కాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఇంటిని తెరిచి ఇంట్లోని సామగ్రిని చిందరవందర చేశారు. ఇంట్లో యజమానులు లేకపోవడంతో విలువైన సామగ్రి అపహరణకు గురైందా.. లేదా అన్న విషయం తెలియలేదు. ఇదే కాలనీలో మరో ఇంట్లో తాళం పగులగొట్టి ఇంట్లోని సామగ్రిని చిందరవందరగా వేసి వెళ్లారు.

పరిశీలించిన పోలీసులు..

విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్ఐ నాగశేఖరరెడ్డిలు దొంగతనం జరిగిన ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ప్రస్తుతం నాలుగు ఇళ్లలో చోరి జరగగా అందుబాటులో ఉన్న ఇద్దరు బాధితుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఇంట్లోని విలువైన సామగ్రి, ఆభరణాల వివరాలు, తాళం వేసిన ఇంటి పరిసరాలను పరిశీలించారు. అనంతరం క్లూస్ టీంను రప్పించి ఆధారాల కోసం తనిఖీలు నిర్వహించారు. దొంగలు పగులగొట్టిన బీరువాలు, ఇంటి తలుపులు, ఇతర ప్రదేశాల్లో వేలిముద్రలు, ఇతర ఆధారాల కోసం తనిఖీలు చేపట్టారు. సంఘటనా స్థలంలో నిందితుల ఆనవాళ్లు, ఇతర ఆధారాలను సేకరించారు.



చిందరవందరగా పడిన బీరువాలోని వస్తువులు

ఇరగదీసిన ఎస్ఈఎం సీసీ జట్టు

అచ్చంపేటలో కొనసాగుతున్న అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలు

స్పోర్ట్స్



సంకేత్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీలో భారీ స్కోరు నమోదైంది. శుక్రవారం మధ్యాహ్నం సెషన్‌లో అమ్మ హాస్పిటల్– ఎస్ఈఎం సీసీ హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. టాస్‌గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న అమ్మ హాస్పిటల్ జట్టుకు ఎస్ఈఎం సీసీ జట్టు చుక్కలు చూపించింది. అబీబ్‌అహ్మద్ (94) పరుగులు చేశాడు. నిర్ణీత 18 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేశారు. టోర్నీలో ఇప్పటికి ఇదే భారీ స్కోర్. అమ్మ హాస్పిటల్ బౌలర్ రశీద్ 4–50–3 వికెట్లు తీశాడు. అనంతరం బరిలోకి దిగిన అమ్మ హాస్పిటల్ సీసీ జట్టు 17.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటయ్యింది. బ్యాట్‌మెన్ రశీద్ 53 పరుగులు చేసి జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఎస్ఈఎం బౌలర్ ఇలియాజ్ 3.1–18–4 వికెట్లు తీశాడు. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌ను అబీబ్‌అహ్మద్ అందుకున్నాడు. ఉదయం సెషన్‌లో డెక్కన్ వర్సెస్ జీసీసీ జట్లు తలపడగా టాస్‌గెలిచి డెక్కన్ సీసీ బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. వాజిద్ 18, మక్బూల్ 11 పరుగులు చేశారు. జీసీసీ బౌలింగ్ యశ్వంత్ 4–20–3 వికెట్లు తీశాడు. అనంతరం 141 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జీసీసీ జట్టు 18.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. సంకేత్ 50, అశ్రత్ 29 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. డెక్కన్ సీసీ బౌలింగ్ వాజిద్ 4–29–2 వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను సంకేత్ అందుకున్నాడు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తదితరులు మ్యాచ్‌లను తిలకించి.. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డులను అందించారు.

కరాటేలో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ



పతకాలు చూపుతున్న విద్యార్థినులు

అమ్రాబాద్ (అచ్చంపేట): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఇటీవల కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో స్థానిక కస్తూర్బా విద్యార్థినులు ప్రతిభచాటి పతకాలు సాధించారు. అండర్–14 కటాస్ 40 కిలోల బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థిని రత్నాంజలి ప్రతిభకనబర్చి బ్రౌంజ్ రజత పతకం సాధించినట్లు కస్తూర్బా ప్రత్యేకాధికారి ఉమాదేవి తెలిపారు. అండర్–12 విభాగంలో విద్యార్థిని గాయిత్రి, అండర్–14 కటాస్‌లో విద్యార్థినులు ప్రియాంక, వసుంధర జట్టుగా ఏర్పడి తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ఆయా విభాగాల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థినులను ప్రత్యేకాధికారితోపాటు కరాటే గ్రాండ్ మాస్టర్ లవకుమార్, మాస్టర్లు బాల్ నారాయణ, మల్లేష్, పీఈటీ వెన్నెల, ఉపాధ్యాయురాళ్లు అభినందించారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు నాగచరణ్



క్రీడాకారుడితో ప్రిన్సిపాల్, పీఈటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: కర్ణాటక రాష్ట్రం విజయ్‌పూర్‌లో సోమవారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే అండర్–14 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు స్థానిక మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ విద్యార్థి నాగచరణ్‌తేజ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థిని గ్రామర్ స్కూల్ ఆవరణలో కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత అభినందించారు. జాతీయ స్థాయిలో మెరుగైన ప్రతిభకనబరిచి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీలు మహ్మద్ జియావుద్దీన్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీలకు పాన్‌గల్ విద్యార్థినులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాన్‌గల్ (వనపర్తి): మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారని ఇన్‌చార్జ్ హెచ్ఎం సరస్వతి, పీఈటీ రామచంద్రమ్మ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్–14 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెం పోటీలకు 9వ తరగతి విద్యార్థిని అనూష, షాట్‌పుట్, లాంగ్‌జంప్ పోటీలకు 9వ తరగతి విద్యార్థిని మౌనిక ఎంపియ్యారన్నారు. వీరు సోమ, మంగళవారాల్లో హైదరాబాద్ గచ్చిబౌలీలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

అండర్–12 విభాగంలో..



అశోక్

గద్వాల రూరల్: గత డిసెంబర్‌లో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలో ని అనంతపురం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి అశోక్ ప్రతిభచాటి అండర్–12 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం హన్మంతు, పీఈటీ రజనీకాంత్ తెలిపారు. విద్యార్థి అశోక్ సోమవారం నుంచి హైదరాబాద్‌లోని గచిచ్చబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని గ్రామ సర్పంచ్ చిన్న రంగన్న, ఎంపీటీసీ మణెమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ హనీఫ్, ఉపాధ్యాయులు నల్లారెడ్డి తదితరులు అభినందించారు.

నేడు కస్తూర్బా క్రీడా అకాడమీ చాంపియన్‌షిప్

మహబూబ్‌నగర్ క్రీడలు: కస్తూర్బా బాలికల విద్యాలయం క్రీడా అకాడమీల చాంపియన్‌షిప్ పోటీలను శనివారం స్థానిక జిల్లా పరిషత్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారిణి టీవీఎల్ సత్యవాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాడమీల్లో బాలికలకు గత నవంబర్ 20 నుంచి నెల రోజులపాటు మొదటి విడత శిక్షణ ఇచ్చామన్నారు. బాలికల్లో క్రీడా నైపుణ్యాన్ని గుర్తించడానికి చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదు క్రీడా అకాడమీలకు చెందిన 150 మంది బాలికలు పాల్గొంటారని, చాంపియన్‌షిప్‌లో 100 మీ, 200 మీ, 800 మీ, ఫ్లెక్సిబిలిటీ, వర్టికల్ జంప్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, మెడిసిన్ బాల్, 30 మీ. ఫ్లయింగ్ స్టార్ట్, 6 గీ10 మీటర్ల షటిల్ రన్ అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆయా పోటీల్లో గెలుపొందిన క్రీడా అకాడమీకి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను ప్రదానం చేస్తామన్నారు.

12 నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

గోపాల్‌పేట (వనపర్తి): మండలంలోని ఏదుట్ల హైస్కూల్ మైదానంలో సంక్రాంతి పండగను పుస్కరించుకుని నాగం తిరుపతిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.20,016, రెండో విజేతకు రూ.10,016 నగదుతోపాటు షీల్డ్‌లను ట్రస్టు చైర్మన్ నాగం తిరుపతిరెడ్డి స్పాన్సర్ చేస్తున్నారన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సెల్ నంబర్లు 9701345463, 9160052102, 9160787009లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని, 11న డ్రా తీస్తామన్నారు.

16, 17న అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి సాంకేతిక నిపుణుల పరీక్షలు

కందనూలు: అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఫెడరేషన్ స్టేట్ టెక్నికల్ ఆఫీసర్ (ఎఫ్ఎస్‌టీఓ) రాష్ట్రస్థాయి సాంకేతిక నిపుణుల పరీక్షలు వరంగల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 16, 17 తేదీల్లో ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ సాంకేతిక నిపుణుల విభాగంలో విధులు నిర్వహించవచ్చన్నారు. యువతీ, యువకులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, అథ్లెటిక్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న వారు కూడా అర్హులని చెప్పారు. ఎఫ్ఎస్‌టీఓ పరీక్ష రాసే వారు ఈ నెల 10వ తేదీలోగా రూ.వెయ్యి నగదు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి స్వాములు సంప్రదించాలన్నారు. సెల్ నం.9866469054 ఫోన్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్



సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం | జనవరి | 6 | 2018

కర్ర స్తంభాలపై ఎన్నాళ్లు..?



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని బీసీ కాలనీలో పది సంవత్సరాలుగా కర్ర స్తంభాలతో కాలనీవాసులు సతమతమవుతున్నారు. అధికారులకు సూచించిన ఫలితం లేదని వాపోతున్నారు. దాదాపు కాలనీలోని అన్ని వీధుల్లోనూ కర్రలు ఏర్పాటు చేసుకుని వైర్లు లాగుకుని కాలం వెళ్లదిస్తున్నారు. ఈ దురుగాలులు వీస్తే వైర్లు తెగిపడి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9493080108

జోరందుకున్న వరి నాట్లు

- కేఎల్ఐ నీటితో నిండిన చెరువులు
- పెరిగిన భూగర్భ జలాలు
- మండలంలో 12వేల ఎకరాల్లో వరి నాట్లు
- కేసరి సముద్రం చెరువు ఆయకట్టుదారులకు నిరాశ



కరిగేట చేసేందుకు నాగలితో దున్నుతున్న రైతు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఖరీఫ్‌లో తీవ్రంగా నష్ట పోయిన రైతులకు రబీ కాస్తా ఊరటనిస్తుంది. గత రెండు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేఎల్ఐ నీటితో చెరువులను నింపుతుండడంతో కాస్తా కుదుట పడుతున్నారు. ఒక్కపుడు వర్షాదారంపై అధారపడిన చెరువులకు వరద వస్తేనే నిండి ఆయకట్టు సాగులోకి వచ్చేది. వరద రాకపోతే కంప చెట్లతో దర్శనమిచ్చేది. ఇప్పుడు కేఎల్ఐ నీటి పుణ్యమా అంటూ చెరువులు నిండి ఆయకట్టు రెండేళ్లుగా కోనసీమను తలపిస్తూ కనిపిస్తుంది. మండలంలో ఇప్పటికే అధికారులు మండలంలోని మూడు పెద్ద చెరువులను, 116చిన్న చెరువులను కేఎల్ఐ నీటితో నింపేశారు. అత్తి పెద్ద చెరువైన కేసరి సముద్రం చెరువును మినీ ట్యాంక్‌బాండ్‌గా అభివృద్ధి చేస్తుండడంతో నింపలేదు. దీంతో ఆ చెరువుకింద ఉన్న 1594ఎకరాల ఆయకట్టు పొలం సాగుకు రాకా రైతులకు నిరాశ మిగిలింది. అంతేకాకుండా మలాక్పూర్, పుల్జాల రైతులకు కేఎల్ఐ నీటిని వినియోగించుకునే ఆవకాశం దక్కలేదు.

సాగులోకి రానున్న 12వేల ఎకరాలు

మండలంలో రబీ వరినాట్లలో భాగంగా 12వేల ఎకరాలు సాగులోకి రానుంది, మూడు పెద్ద చెరువుల కింద 830ఎకరాలు సాగవుతుండగా, వంద ఎకరాల లోపు కుంటల కిందా, బోరు బావుల కిందా కలిపి మరో 11వేల ఎకరాల ఆయకట్టులో వరినాట్లు నాటుకోనున్నారు. మండలంలోని పెద్ద చెరువులైన ఈదుల చెరువు కిందా 105ఎకరాలు, నాగసముద్రం చెరువు కిందా 396 ఎకరాలు, సత్యసముద్రం చెరువు కిందా 329ఎకరాల ఆయకట్టు సాగు చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం చెరువు కింద 1594ఎకరాలు మాత్రం సాగుకు నోచుకోకా రైతులకు నిరాశ మిగులుతుంది. ప్రస్తుతం చెరువు పనులు జరుగుతుండడంతో చెరువులోకి వచ్చిన నీటిని అధికారులు కిందికి వదిలేస్తున్నారు. దీంతో రైతులు బోరు, బావుల కింద కూడా వరి సాగుకు సిద్ధపడుతున్నారు.

జోరందుకున్న వరి నాట్లు

మండలంలో వరి నాట్లు జోరందుకున్నాయి. ఇప్పటికే స్వాతి కార్తిలో బోరు బావుల కిందా, చెరువుల కిందా నార్లు పోసుకున్న రైతులు పొలాలను దుమ్ము చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. సత్యసముద్రం, నాగసముద్రం, ఈదుల చెరువులను అధికారులు నీటిని నింపడంతో ఆయా చెరువుల కింద గల ఆయకట్టు పొలాలకు సాగు నిమిత్తం నీటిని విడుదల చేశారు. చెరువుల కింద వరి నాట్లు ఊపందుకున్నాయి.


తుకాలు పోసుకున్నాం...



మాకు బోరు ఉండడంతో పాటు ఊర చెరువు కింద కొంత పొలం ఉంది. వరి నాట్లు వేసుకునేందుకు స్వాతిలోనే తుకం పోసుకున్నాం. కరిగేటను దున్నుకుంటున్నాం. కరిగేట పూర్తయితే

– నాగయ్య, రైతు, నెల్లికుదురు

90శాతం చెరువులు నింపాం



మండలంలోని చిన్న, పెద్ద చెరువులు 90శాతం నీటిని నింపాం. ఇంకా కొంత కాలం నీరు వచ్చే అవకాశం ఉంది. కేఎల్ఐ నీరు వచ్చినన్ని రోజులు చెరువులోకి నీరు వస్తుంటాయి. సాగుకు ఎలాంటి డోకా ఉండదు.

– బాబు చంద్, ఎఈ ఐబీ అధికారి

న్యూస్ బాక్స్

మురుగు తొలగించాలి



నిల్వ ఉంచిన నీటిని తొలగిస్తున్న హెచ్ఈఓ

బిజినేపల్లిరూరల్: ఇంటి ఎదుట నిల్వ ఉంచిన మురుగు నీటిని తొలగించుకోవాలని హెచ్ఈఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం డ్రై డేను పురస్కరించుకుని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మండల పరిధిలోని వెల్గొండ లో డ్రై డేలో భాగంగా గ్రామంలోని ఆయా ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కొబ్బరి బోండాలు, హౌజ్‌లలో నిల్వ ఉన్న నీటిలో చిన్నపాటి దోమలు గుడ్లు పెట్టి అంటువ్యాధులు వ్యాపిస్తుందని, మురుగు నీరుతొలగించి అంటువ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

తెలకపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ కాళిందిని అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నడిగడ్డ, తాళ్లపల్లి, చిన్నముద్దనూర్ గ్రామాలను ఆమె సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి వద్ద మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చిన్నముద్దనూర్‌లో వృద్ధులకు పింఛన్లు అందజేశారు. కారువంగ, నడిగడ్డ, తాళ్లపల్లి గ్రామాల్లో గ్రామ పరిశుభ్రత, స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కారువంగ సర్పంచ్‌కట్టా శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బిజినేపల్లిరూరల్: పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాల బారి నుంచి కాపాడుకున్న వారవుతారని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాలెం పీహెచ్‌సీ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని సిబ్బందితో తొలగించి శుభ్రపరిచారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన స్వచ్ఛభారత్‌లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటదాసు, వైద్యులు సంధ్యా కిరణ్మయి, సాయినాథ్‌రెడ్డి, దశరథం, కుమార్‌ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

తాడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడుకున్న విద్య అవసరమని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ఐతోల్‌లో గ్రామానికి చెందిన సింగిరెడ్డి పర్వత్‌రెడ్డి స్మారకార్థం నిర్వహించిన రెండు రోజుల ఆటల పోటీలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్య అలవర్చుకుంటేనే జీవితంలో పైకి వస్తారని అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని అన్నారు. రెండు రోజులపాటు చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వివిధ క్రీడలలో ప్రతిభ కనబర్చడం హర్షించదగ్గ విషయమన్నారు. క్రీడల నిర్వహణ చేపట్టిన సింగిరెడ్డి పర్వత్‌రెడ్డి కుటుంబ సభ్యులను అభినందించారు. అదేవిధంగా వివిధ క్రీడలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జెడ్పీటీసీ మణెమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్, సింగి రెడ్డి పర్వత్ రెడ్డి కుటుంబ సభ్యులు నర్సింహ్మారెడ్డి, ఎంఈఓ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సీతారాం, ఎస్‌జీఎఫ్ చైర్మన్ డి.ప్రసాద్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

సావిత్రీబాయి ఆశయాలను కొనసాగించాలి

తాడూరు: కులమతాలకతీతంగా స మాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వ రూపులు చదువుల తల్లి సావి త్రీబాయి పూలే ఆశయాలను కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంతారంలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రా హ్మణ సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించిన భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలని అన్నారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. కా ర్యక్రమంలో నాయకులు కుర్మయ్య, ఠాగూర్, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న చిన్నచింతకుంట మండలం అల్లీపూర్‌కి చెందిన తెలుగు పెద్ద నర్సింహ్మ(50) గత సంవత్సరం ఆగస్ట్ 24న రోజులాగే కార్యాలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లలేదని కుమారుడు తెలుగు బాల్‌రాజు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్ఐ పురుషోత్తం కేసు నమోదు చేసి దర్యాప్తుకు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

గ్రామా అభివృద్ధికి సహకరించాలి

తెలకపల్లి: గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని సర్పంచ్ బిరుదు సాయిలీల అన్నారు. శుక్రవారం గౌరారం పంచాయతీలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, నీటి సంపులను శుభ్రం చేయాలని సూచించారు. ఎంపీటీసీ కువలేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి మధుమోహన్, వార్డు సభ్యులు జమ్ములు పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

శనివారం జనవరి | 6 | 2018 సాక్షి

వాతావరణం

రానున్న 24 గంటల్లో పంజాబ్ నుంచి పశ్చిమబెంగాల్ మధ్య ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుని ఉంటుంది. అండమాన్, నికోబార్ దీవుల్లో మోస్తరు వర్షం కురుస్తుంది. కేరళలో చెదురుమదురు వాన పడే అవకాశం ఉంది. రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో చల్లని ఈదురు గాలు వీసే అవకాశం ఉంది.

హైదరాబాద్ / మహబూబ్‌నగర్ వాతావరణం

గరిష్టం కనిష్టం

30.0°/16.2°

32.1/16.6

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	18.1	07.2
కోల్‌కతా	22.3	11.1
బెంగళూరు	27.2	15.5
ముంబై	29.6	16.8
చెన్నై	29.5	20.5

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
ఒంగోలు	31.3/20.1	తిరుపతి	29.9/14.2
కర్నూలు	31.2/18.1	విజయవాడ	29.7/17.0
మహబూబ్‌నగర్	31.2/16.6	ఏలూరు	29.6/19.0
కడప	31.1/15.5	రాజమండ్రి	29.6/19.0
ఖమ్మం	31.0/10.4	తాడేపల్లిగూడెం	29.6/19.0
ఆదిలాబాద్	31.0/06.0	నల్లగొండ	29.6/15.2
అనంతపురం	30.7/16.2	కరీంనగర్	29.6/10.7
నెల్లూరు	30.6/20.8	హైదరాబాద్	29.4/13.3
నిజామాబాద్	30.5/15.5	రంగారెడ్డి	29.4/13.3
మెదక్	30.5/11.0	కాకినాడ	29.0/18.4
వరంగల్	30.2/14.0	విశాఖపట్నం	28.2/19.2
గుంటూరు	30.0/16.2	శ్రీకాకుళం	27.7/15.5
చిత్తూరు	29.9/14.2	విజయనగరం	27.7/15.5

బుల్లితెర


W

SAKSHI TV సాక్షి


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్‌ఆర్ లైవ్ షో
ఉ.08.00 న్యూస్ ఫీచర్
ఉ.08.30 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.30 న్యూస్ ఫీచర్
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.12.00 మూవీ మ్యాటర్స్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.00 రీజనల్ న్యూస్
రా.08.00 సాక్షి న్యూస్
రా.08.30 బతుకు చిత్రం
రా.09.00 న్యూస్ 360
రా.09.30 జ్యూక్ బాక్స్
రా.10.30 మూవీ మ్యాటర్స్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 సిరి సిరి మువ్వ
ఉ.09.30 సీతాకోకచిలుక
మ.12.00 రణధీర
సా.06.00 పెళ్లాంతో పనేంటి
రా.09.00 అదృష్టం



మూవీస్ నౌ
ఉ.10.20 శాన్ ఆండ్రియాస్
మ.12.35 క్యాసినో రాయల్
మ.03.30 ద యాక్సిడెంటల్ స్పై
సా.05.15 ఎపిక్ మూవీ
రా.09.00 జర్నీ 2



హెచ్‌బీవో
ఉ.07.28 ఆల్మోస్ట్ హీరోస్
ఉ.10.41 కొల్లాటరల్ బ్యూటీ
మ.12.27 ద డార్క్ నైట్ రైజెస్
సా.05.16 పుస్ ఇన్ బూట్స్
రా.09.00 ద కంజ్యూరింగ్



స్టార్ మూవీస్
ఉ.06.08 హోటల్ ట్రాన్సిల్వేనియా
ఉ.07.55 బేబీస్ డే ఔట్
మ.01.52 డాక్టర్ స్ట్రేంజ్
సా.04.11 చైనీస్ జోడియాక్
రా.09.00 థోర్ 2: ద డార్క్ వరల్డ్



మా మూవీస్
ఉ.09.30 దడ
మ.12.00 సాహసం
మ.03.00 రక్షణ
సా.06.00 మన్మథుడు
రా.09.00 ఊకొడతారా ఉలిక్కిపడతారా



జీ సినిమా
ఉ.04.45 బాంబే టు బ్యాంకాక్
ఉ.08.14 శివలింగ
ఉ.11.08 తారే జమీన్ పర్
మ.02.28 బాఘీ
రా.11.44 ఖేల్ పవర్ కా



కలుపు మందుల వాడకంలో జాగ్రత్త

- మార్కెట్‌లో ఎన్నో రకాల మందులు
- పైర్ల వారీగా ఏ మోతాదులో వాడాలో అవగాహన అవసరం
- టెక్నికల్ ఏడీఏ నూతన్‌కుమార్ సలహాలు, సూచనలు



పత్తి పంటకు కలుపు నివారణ మందు పిచికారీ చేస్తున్న రైతు

గోపాల్‌పేట(వనపర్తి): ప్రస్తుతం మార్కెట్‌లో ఆనేక రకాల కలుపు నివారణ మందులు లభిస్తున్నాయి. అయితే ఏ పైరుకు, ఏ మందు, ఎంత మోతాదులో, ఏ సమయంలో వాడాలో రైతులు అవగాహన కలిగి ఉండాలి. లేనిపక్షంలో దుబారా ఖర్చుతో పాటు పంటలకు నష్టం వాటిల్లే అవకాశముంటుంది. ఈ మేరకు కలుపు నివారణ మందులు, వాడకం విధానంపై వనపర్తి జిల్లా సాంకేతిక వ్యవసాయ సహాయ సంచాలకులు(టెక్నికల్ ఏడీఏ) కె.నూతన్‌కుమార్ రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

అధికారి సలహా



కె.నూతన్‌కుమార్, టెక్నికల్ ఏడీఏ, వనపర్తి జిల్లా

వివరాలు తెలియకుంటే వద్దు..

సిఫారసు చేయని, పూర్తి వివరాలు తెలియని కలుపు మందులను ఎట్టి పరిస్థితుల్లో వాడొద్దు. అలా వాడితే కలుపు నిర్మూలన సరిగా జరగకపోగా, కొన్ని సందర్భాల్లో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. కొన్ని రకాల మందులు పంట విత్తిన రెండు రోజుల్లోపు అంటే పంట మొలకెత్తక ముందే పిచికారీ చేయాల్సి ఉంటుంది. కొన్ని మందులు అసలు మొక్కలను కూడా నిర్మిలిస్తాయి. కాబట్టి ఇలాంటి వాటిని పైర్లలో వాడొద్దు. మందు పిచికారీ చేసేటప్పుడు పక్కన ఉండే పొలంలోని పైరుకు మనం పిచికారీ చేసే మందుతో నష్టం కలగుతుందో తెలుసుకోవాలి. ప్రత్యేకించి వరిలో 2, 4–డీ సంబంధిత మందులు వాడేటప్పుడు ఈ వివరాలు తెలుసుకోవడం చాలా అవసరం. పక్క పొలంలో వెడల్పాకు పంటలైన పత్తి, మిరప మొదలైనవి ఉంటే.. వరిలో ఈ మందు వాడాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి. పైర్లలో కలుపు మందులు వాడినపుడు ఆ మందు అవశేషాలు ఆ పంట తర్వాత వేసే పంటపై ఏదైనా దుష్ప్రభావం చూపించే అవకాశమున్నందున ఆ వివరాలు తెలుసుకోవాలి. మొండి జాతి మొక్కలైన తుంగ, గరిక, దర్భ మొదలగు కలుపు నిర్మూలనకు గ్లెఫోసెట్ వంటి మందులు 4–6 ఆకుల దశలో పూత రాక ముందే పిచికారీ చేశాక 6–8గంటల వ్యవధిలో వర్షం కురిస్తే మందు ప్రభావం తగ్గుతుంది. ఇక నీటిలో కరిగే పొడి రూపంలో నున్న మందులను ఇసుకలో కలిపి వెదజల్లరాదు. నిర్దిష్టమైన సూచనలు లేనిచో కలుపు మందులను పురుగు, తెగుళ్ల మందులతో కలపొద్దు. అలాగే, కాల పరిమితి దాటిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడరాదు.



హ్యాండ్ స్ప్రేయర్ మేలు

సాధ్యమైనంత వరకు కలుపు మందులను హ్యాండ్ స్ప్రేయర్‌తోనే పిచికారీ చేయాలి. పవర్ స్ప్రేయర్ వాడాల్సి వస్తే నిపుణుల సలహా తీసుకోవాలి. కలుపు మందు పిచికారీకి ఉపయోగించే స్ప్రేయర్లను విడిగా ఉంచాలి. అలా వీలు కాకపోతే ఏ మాత్రం అవశేషాలు లేకుండా మంచినీటితో శుభ్రం చేయాలి. పిచికారీ సమయంలో సరైన నాజిల్‌ను వాడడంతో పాటు మందు సమానంగా పడేలా చూడాలి. వెంటవెంటనే రెండు సార్లు మందు పిచికారీ చేస్తే మోతాదు ఎక్కువై పైరుకు నష్టం కలుగుతుందని గుర్తించాలి. ఎకరా విస్తీర్ణంలో కలుపు మందు పిచికారీకి 200 లీటర్ల నీరు, మాగాణి వరిలో అయితే కలుపు మందును 20 కిలోల ఇసుకలో కలిపి పలుచగా నీరు పెట్టి పొలంలో వెదజల్లాలి. పొలంలో నీటిని బయటికి తీసి వేయొద్దు. అలాగే, 24–48 గంటల లోపు నీరు పెట్టాలి. ఎండ మరీ ఎక్కువగా ఉన్నప్పుడు, గాలి ఎక్కువగా, ఎదురుగా వీస్తున్నప్పుడు కాకుండా ఉదయం లేదా సాయంత్రం వేళల్లో గాలి తక్కువగా ఉన్నప్పుడు పిచికారీ చేయడమే మేలు. మందుల ప్రభావం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆహార పంటలు, పశువుల మేతకు వాడే పైర్లపై కలుపు మందులు వాడితే సూచించిన కాల పరిమితి తర్వాతనే కోయాలి. అలాగే, మోతాదు, రకంపై నిపుణులు లేదా వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలి.

మరికొన్ని సూచనలు

పంటకు సిఫారసు చేసిన కలుపు మందులు, సరైన మోతాదులో సరైన సమయంలోనే వాడాలి. కలుపు మందులు వాడినా పంట వేసి న 25–30 రోజుల తర్వాత పరికరాల ద్వారా అంతర కృషి చేయడం మంచిది. మెట్ట సాగు లేదా ఆరుతడి పైరులో కలుపు మందులు పిచికారీ చేసుకోవాలి. వరిలో కలుపు మందు లు ఇసుకతో కలిపి చల్లుకోవచ్చు. కలుపు మందులు పిచికారి చేసినప్పుడు విష ప్రభావానికి లోనైతే వాడిన మందు డబ్బా తీసుకుని వైద్యులను సంప్రదిస్తే మంచిది. ప్రతీ 10 లీ. ట్యాంకుకు కలుపు మందుతో పాటు అమ్మోనియం సల్ఫేట్ లేదా 200 గ్రా. యూరియాను కలిపి పిచికారీ చేస్తే ఫలితం త్వరగా కనిపిస్తుంది. ఎల్లప్పుడు ఒకే మందు వాడితే కలుపు మొక్కలు ఆ మందును తట్టుకునే శక్తిని పెంపొందించుకుంటాయి.

తిరుమల సమాచారం

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	–ఖాళీగా లేవు
రూ.50 గదులు	–ఖాళీగా లేవు
రూ.100 గదులు	–ఖాళీగా లేవు
రూ.500 గదులు	–లేవు

సేవలు

సహస్ర దీపాలంకరణ	–ఖాళీగా లేవు
వసంతోత్సవం	–ఖాళీగా లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం	–ఖాళీగా లేవు



చికెన్ (సుగుణ)

స్కిన్	స్కిన్‌లెస్
154	180



భవిష్యం

మేషం: ముఖ్య నిర్ణయాలలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. అనుకోని ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.

వృషభం: పనుల్లో స్వల్ప అవరోధాలు. ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఆరోగ్య భంగం. రుణాలు చేయాల్సి వస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరాశ.



మిథునం: బాకీలు వసూలు అవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. పరిచయాలు పెరుగుతాయి. ఇంటాబయటా అనుకూలం. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు హోదాలు.

కర్కాటకం: కుటుంబ సమస్యలు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు.

సింహం: అప్రయత్న కార్యసిద్ధి. పోటీపరీక్షల్లో విజయం. ఆప్తుల నుంచి ఆహ్వానాలు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం. వృత్తి, వ్యాపారాలలో అనుకూల పరిస్థితులు.

కన్య: కొత్త రుణాలు చేస్తారు. దూర ప్రయాణాలు చేసే అవకాశం ఉంది. ఆరోగ్య భంగం. బంధువులతో మాటపట్టింపులు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిళ్లు.

తుల: ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. సంఘంలో గౌరవం. కుటుంబంలో శుభకార్యాలు. ఆర్థికాభివృద్ధి. వృత్తి, వ్యాపారాలు సజావుగా కొనసాగుతాయి.

వృశ్చికం: నూతన ఉద్యోగ యోగం. ముఖ్య నిర్ణయాలు. మీ ఆశయాలు నెరవేరతాయి. స్థిరాస్తి లాభం. వ్యాపారులకు ఊహించని లాభాలు. ఉద్యోగులకు ప్రమోషన్లు.

ధనుస్సు: శ్రమకు ఫలితం కనిపించదు. ఉద్యోగ యత్నాలు నిరాశ కలిగిస్తాయి. ముఖ్యమైన పనులు ముందుకు సాగవు. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

మకరం: బంధువుల నుంచి సమస్యలు. ఆర్థిక ఇబ్బందులు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపారాలలో గందరగోళం. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి.

కుంభం: కొత్త మిత్రులు పరిచయం అవుతారు. శుభవార్తలు అందుతాయి. వ్యవహారాలలో అనుకూలత. సంఘంలో గౌరవం పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు.

మీనం: విద్యార్థులు శుభవార్తలు అందుకునే అవకాశం ఉంది. వ్యవహార విజయం. ఆహ్వానాలు, గ్రీటింగ్‌లు అందుతాయి. దైవ దర్శనాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

– సింహంభట్ల సుబ్బారావు

జ్యోతికి కటకటాలు!

- నాగరాజు హత్య కేసులో నిందితులను కోర్టులో హాజరుపరిచిన చౌటుప్పల్ పోలీసులు
- భార్య జ్యోతి, ప్రియుడు కార్తీక్ సహా నిందితులు నల్లగొండ జైలుకు తరలింపు
- ప్రశ్నార్థకంగా మారిన ఇద్దరు చిన్నారుల భవిష్యత్


వివరాలు వెల్లడిస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా డీసీపీ రామచంద్రారెడ్డి

అడ్డాకుల (దేవరకద్ర): జీవితాంతం కలిసుంటానని భర్తతో ఏడడుగులు నడిచింది.. కానీ ఏడేళ్లు కూడా కాపురం చేయకుండానే ప్రియుడి మోజులో పడి.. కట్టుకున్నోడిని కర్కశంగా కడతేర్చి.. కన్నపిల్లలను వీధిన పడేసింది.. చివరికి తాను తవ్వుకున్న గోతిలో తానే పడినట్టు పోలీసులకు చిక్కి కటకటాల పాలైంది.. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన స్వాతిరెడ్డి కేసు మాదిరిగానే నాగరాజు హత్యకు గురవడం గమనార్హం. ఈ కేసులో నిందితులైన భార్య జ్యోతి, ఆమె ప్రియుడు కార్తీక్‌తోపాటు మరో ముగ్గురిని చౌటుప్పల్ పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. ఈ సంఘటనతో నాగరాజు, జ్యోతి దంపతుల ఇద్దరు పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

పెళ్లికి ముందే పరిచయం..

2012 డిసెంబర్‌లో రాచాలకు చెందిన కమ్మరి నాగరాజు(33)కు కోయిలకొండ మండలం అవంగపట్నం గ్రామానికి చెందిన జ్యోతి(24)తో పెళ్లి జరిపించారు. ఇద్దరూ కలిసి హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో నివాసముంటుండగా నాగరాజు వడ్రంగి పనిచేస్తున్నాడు. వారికి జీవిత(3), విక్కీ (10 నెలలు) పిల్లలున్నారు. అయితే పెళ్లికి ముందే జ్యోతికి హైదరాబాద్‌లో ఉండే కార్తీక్‌తో పరిచయం ఏర్పడగా ప్రేమాయణం సాగించింది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నా జ్యోతి తల్లిదండ్రులు అందుకు అంగీకరించలేదు. ఇద్దరి కులాలు వేరు కావడంతో చివరికి జ్యోతిని నాగరాజుకు ఇచ్చి వివాహం చేశారు. ఇటీవల ప్రియుడు కార్తీక్‌తో జ్యోతి మళ్లీ వివాహేతర సంబంధం నెరిపింది. ప్రియుడి మోజులో పడిన జ్యోతి అడ్డుగా ఉన్న భర్త నాగరాజును అంతమొందించాలని పక్కా పథకం రచించి కనికరం లేకుండా హత్య చేయించింది. తన భర్త కనిపించడం లేదని బంధువులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినా జ్యోతి కాల్‌డేటా, నాగరాజు శవపరీక్ష నివేదిక ఆధారంగా చౌటుప్పల్ పోలీసులు చాకచక్యంగా హత్య కేసును ఛేదించారు.

తల్లి జైలుకు.. పిల్లలు రాచాలకు!

భర్త నాగరాజు హత్య కేసులో నిందితులైన భార్య జ్యోతి, ఆమె ప్రియుడు కార్తీక్, మరో ముగ్గురిని శుక్రవారం చౌటుప్పల్ పోలీసులు కోర్టులో హాజరుపరిచి న్యాయమూర్తి ఆదేశం మేరకు నల్లగొండ జైలుకు తరలించారు. నాగరాజు పిల్లలిద్దరూ రెండు రోజులుగా ఠాణా వద్దే ఉన్నారు. తల్లిని జైలుకు తీసుకెళ్లడంతో నాగరాజు సోదరుడు శ్రీనివాసులు పిల్లలిద్దరిని తీసుకుని రాత్రి రాచాలకు బయలుదేరారు. తల్లిదండ్రులిద్దరూ లేకపోవడం.. పిల్లలిద్దరు రోదిస్తుండటంతో ఏం చేయాలో తోచడం లేదని శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే తల్లి చేసిన నేరం పిల్లలిద్దరూ తండ్రిని కోల్పోవడంతోపాటు వారి భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చింది. నిందితులను కఠినంగా శిక్షించాలని నాగరాజు కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

డీఆర్‌వీ ప్రసాద్‌రావుకు మంత్రి అభినందన


మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రసాదరావు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన కరెన్సీ, నాణేల సేకరణకర్త, విద్యుత్ ఉద్యోగి డీఆర్‌వీ ప్రసాద్‌రావును గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా డీఆర్‌వీ ప్రసాదరావు సీఎం కేసీఆర్ జన్మదినం తేదీ, మాసం, ఏడాది వచ్చే కరెన్సీనోట్లతో తయారుచేసిన మెమోంటోను మంత్రికి అందజేశారు.

కేసీఆర్ కిట్ నమోదులో నిర్లక్ష్యం వద్దు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్

కల్వకుర్తి రూరల్: సాధారణ పేద మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకంలో నిర్లక్ష్యం వద్దు అని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుధాకర్‌లాల్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కేసీఆర్ కిట్‌పై ఆస్పత్రి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో అర్హులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేసీఆర్ కిట్‌లో నమోదు చేయించడం వల్ల గర్భంతో ఉన్న తల్లికి రెండుసార్లు పరీక్షల అనంతరం రూ.3వేలు, ప్రసవం అనంతరం మగపిల్లవాడు పుడితే రూ.4వేలు, ఆడపిల్ల పుడితే రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వ్యాధి నిరోధక టీకాలు పూర్తయ్యే క్రమంలో రూ.3వేలు సహాయం అందుతుందని చెప్పారు. సకాలంలో మొత్తం లబ్ధిదారులకు అందేందుకు నమోదులో నిర్లక్ష్యం చేయద్దన్నారు. సిబ్బంది విధులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా నిరంతరం పర్యవేక్షణ జరపాలని సూచించా రు. కార్యక్రమంలో జిల్లా, మలేరియా అధికారి శ్రీనివాసులు, వైద్యాధికారి బాబర్, జిల్లా అధికారి ఓ.శ్రీను, ఆర్.శ్రీను, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈయూ ఆధ్వర్యంలో గేట్ ధర్నా

కందనూలు: కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న మోటార్ వాహన చట్టం రాజ్యాంగ విరుద్ధం అని దీని వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ నారాయణ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఈయూ ఆధ్వర్యంలో గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఏప్రిల్ నుంచి నూతన పేస్కేల్‌కు సంబంధించిన జీతభత్యాలు రాకపోవడం వల్ల కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆరోపించారు. వెంటనే యాజమాన్యం స్పందించి జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం, స్వామి, హరి, కేకే గౌడ్, మల్లేష్, మాధవి, ఆంజనేయులు, బాల్‌రాజు, శేఖర్, ఎన్ఎస్ గౌడ్, ఆయూబ్, తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలే దేశాభివృద్ధికి సూచిక



సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగారెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నేటితరం యువత చేసే నూతన ఆవిష్కరణలే దేశాభివృద్ధికి సూచికలుగా నిలుస్తాయని పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ పాండురంగారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ కళాశాలలో 'ఆవిష్కరణలు- సుస్థిరత' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక సదస్సులో చివరిరోజు శుక్రవారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో ఇమిడి ఉన్న వినూత్నమైన ఆలోచనలు, ఉద్యోగావకాశాలు సృష్టించడం ద్వారా ఉద్యోగ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగ వేటలో భాగంగా ఎంతో మంది విద్యార్థులు విదేశాలు పట్టుకుని వెళ్తున్నారని, అలా కాకుండా తోటి విద్యార్థులకు ఉద్యోగావకాశాలు సృష్టించే వారిగా ఎదగాలనే ఆలోచనకు సృజనాత్మకత దోహదపడుతుందన్నారు. ఈ మేరకు సదస్సులో పాల్గొన్న విద్యార్థుల్లో కనీసం 10శాతం మంది అయినా వ్యవస్థాపకులుగా మారి ఉద్యోగాలు సృష్టించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఆర్ కాటన్స్ యజమాని అనంతరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ యాదగిరి, సదస్సు కన్వీనర్ విజయ్‌కుమార్, అధ్యాపకులు సురేష్, శంకర్, అనిత రాణి, వైష్ణవి, సుజాత్ ఆలీ, మరియమ్, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న కందుల కొనుగోళ్లు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మార్కెట్‌లోని కందుల కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఈ మేరకు శుక్రవారం 1,051 క్వింటాళ్ల కందులను మార్కెట్‌కు రైతులు తీసుకురాగా పీఏసీఎస్ బాదేపల్లి అధికారులు కొనుగోలు చేశారు. ఇక్కడ క్వింటాకు రూ.5,450గా ధర చెల్లిస్తున్నారు. నాణ్యత లేదని కందులనుయార్డులోనే జల్లెడ పట్టిస్తుండడంతో రైతులు సులువుగా అమ్ముకుని తిరుగుముఖంపడుతున్నారు. కాగా, నాఫెడ్ కేంద్రంలో బినామీలు తమ కందులను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బాదేపల్లి మార్కెట్ యార్డులో వ్యాపారులు రైతుల నుంచి కందులను తక్కువ ధరకు కొనుగోలు చేసి పెద్ద ఎత్తున నిల్వ చేసుకున్నట్లుగా తెలుస్తుంది. ప్రస్తుతం నాఫెడ్ అధిక ధర ఇస్తుండటంతో తమకు అనుకూలంగా ఉన్న రైతుల నుంచి పాస్‌బుక్ జిరాక్స్‌లు తెప్పించి నాఫెడ్‌కు అమ్ముతున్నారని సమాచారం.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


బాల్‌రెడ్డి (ఫైల్)

మాగనూర్(మక్తల్): నమ్ముకున్న వరి పంటకు దోమ తెగులుతో నష్టం కలగగా.. అప్పులు ఎలా తీర్చాలోననే మనోవేదనతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా మాగనూర్ మండలం వైగెడబండ గ్రామానికి చెందిన పెద్ద బాల్‌రెడ్డి(46) కొన్నేళ్లుగా పంటలు సరిగ్గా పండకపోగా, ఈ ఏడాది వరి వేస్తే తెగులుకారణంగా దిగుబడి రాకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. వీటికి ఆరు నెలల క్రితం భార్య అనారోగానికి గురికాగా ఆమె చికిత్స కోసం చేసిన అప్పులు జత కలిశాయి. ఇక నలుగురు కుమార్తెల్లో ఇద్దరికి పెళ్లి చేయగా, ఇంకా ఇద్దరు పెళ్లికి ఉన్నారు. ఈ మేరకు మొత్తంగా రూ.6లక్షలకు చేరిన అప్పులను ఎలా తీర్చాలా అని ఆవేదన ఉన్న ఆయన శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమార్తెలు మధ్యాహ్నం భోజనం తీసుకువెళ్లగా ఉరి వేసుకున్న తండ్రిని గుర్తించి కిందకు దింపి చూసే సరికి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మహిభూషణ్‌రెడ్డి తెలిపారు. కాగా, మృతుడి కుటుంబాన్ని సర్పంచ్ నారాయణరెడ్డి, టీఆర్ఎస్ నాయకులు శివరాంరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పరామర్శించారు.

304 సబ్సిడీ గొర్రెల పట్టివేత


మద్దూరు : పోలీస్‌స్టేషన్‌లో సబ్సిడీ గొర్రెలు

మానవపాడు (అలంపూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకం కొందరి స్వార్థపరుల ఆలోచనతో పక్కదారి పడుతుంది. పేదలు ఆర్థికంగా ఎదుగాలనే లక్ష్యం నీరుగారి ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన చోటుకే మళ్లీ అదే వరుసలో రీసైక్లింగ్‌కు తరలిస్తున్నారు. ప్రభుత్వం అం దించిన మరుక్షణమే వాటిని దళారులు కొని.. తిరిగి ప్రభుత్వానికి విక్రయిస్తూ అక్రమార్జ నకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారి గుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాకు రాయితీ గొర్రెలను నాలుగు వాహనాల్లో తరలిస్తుండుగా మానవపాడు సరిహద్దు చెక్‌పోస్టు దగ్గర పోలీసులు, ఆర్టీఏ అధికారులు పట్టుకున్నారు. ఇందులో రాయితీ గొర్రెలు ఉన్నాయని గుర్తించి మానవపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ వేమన్న ఆ వాహ నాల్లో ఒక్కో గొర్రెను క్షుణ్ణంగా పరిశీలించగా 244 రాయితీ గొర్రెలు ఉన్నట్లు గుర్తించారు. రీసైక్లింగ్‌కు పాల్పడిన యజమానులు అప్పలయ్య, ఈశ్వరయ్య, ఓబులేష్, నరేష్, డీసీఎం డ్రైవర్లు రాజేష్, అజయ్, మాధవయ్య, శ్రీనివాసులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఏఎస్ఐ వేమన్న తెలిపారు. వీటిని ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు.. తదితర వాటిపై పూర్తిచారణ చేపట్టిన తర్వాత వివరాలు వెలుతామన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని తిరుమలగిరి, భువనగిరి ప్రాంతాల నుంచి తరలిస్తున్నట్లు తెలిసింది.

మద్దూరు మండలంలో..

మద్దూరు (మక్తల్): మండలంలోని భూనీడ్‌లో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన గొర్రెలను రీసైక్లింగ్ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్ఐ ఆంజనేయులు కథనం ప్రకారం.. భూనీడ్ గ్రామానికి చెందిన ఎన్.గోపాల్, గొల్ల సాయప్ప, ఎన్.బాలప్పలకు గత 15 రోజుల క్రితం సబ్సిడీపై గొర్రెలు అందజేశారు. అయితే వారు వీటిని మేపలేక కర్ణాటక రాష్ట్రంలోని యాద్గీర్ జిల్లా కద్లేమూర్‌కు చెందిన మహ్మద్ మీరాన్‌కు విక్రయించారు. ఈ మేరకు మహ్మద్ మీరాన్ తన బొలేరో వాహనాన్ని డ్రైవర్ మహిమూద్‌కు ఇచ్చి బుధవారం తెల్లవారుజామున భూనీడ్‌కు పంపించారు. వాహనంలో గొర్రెలను తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో గ్రామానికి వెళ్లి బొలేరో వాహనంతోపాటు 60 గొర్రెలను, 2 పిల్లలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం పశువైద్యాధికారి రాఘవేందర్‌గౌడ్ వచ్చి ప్రభుత్వం సరఫరా చేసిన సబ్సిడీ గొర్రెలుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

- వనపర్తి జిల్లాలో 10అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు
- 'స్వేరోస్' ఆధ్వర్యాన ఏర్పాటు
- కేంద్రాల ద్వారా విజ్ఞానం, విద్య, ఆరోగ్యం

జ్ఞాన కేంద్రాలు



పాల్వెపహాడ్‌లో అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో పుస్తకాలను పరిశీలిస్తున్న గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

గోపాల్‌పేట(వనపర్తి): ఎక్కడ విజ్ఞానం వెల్లి విరుస్తుందో అక్కడ ప్రజల ఆలోచనలు, ఆచరణ, ఆశయాలు గొప్పగా ఉంటాయి. సమాజ పరిణామం కూడా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది. అనుభవ జ్ఞానంతో పాటు పుస్తక పఠనం మనిషిని మానసిక వికాసం వైపు నడిపిస్తుంది. అందుకు అనువైన స్థలాలు గ్రంథాలయాలు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు(ఏవీఎం) పేరుతో వనపర్తి జిల్లాలో మొత్తం 10మందిరాలను ప్రారంభించారు. వీటి ద్వారా నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంచడమే కాకుండా విద్యార్థులకు పరీక్షల సమయంలో ప్రత్యేక తరగతులు, కరాటే వంటి శిక్షణ ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

లక్ష్యం

ప్రతి విజ్ఞాన మందిరంలో ఉదయం వేళ స్వేరో ఆంథమ్ పాడటం ద్వారా తమ కార్యక్రమాలను ప్రారంభిస్తారు. మహనీయుల త్యాగాలను స్మరిస్తూ భవిష్యత్‌లో జ్ఞానం యొక్క ప్రాధాన్యతను వివరించే ఈ పాట విద్యార్థులలో నూతనోత్తేజాన్ని కలిగిస్తుంది.

ఎక్కడెక్కడ..

గోపాల్‌పేట మండలంలోని పొల్కెపహాడ్, చెన్నూరు, తాడిపర్తి, నర్సింగాయపల్లి, రేవల్లి మండలంలోని తల్పునూరు, చెన్నారం, పెద్దమందడి మండల కేంద్రం, పాన్‌గల్ మండలంలోని కొత్తపేట, వనపర్తి పట్టణం, బుద్దారం గురుకుల పాఠశాలలో ఈ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో 8అంబేద్కర్ విజ్ఞాన మందిరాలను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గురుకులాల కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించగా, వనపర్తి గ్రంథాలయాన్ని కలెక్టర్ శ్వేతామహంతి ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో సుమారు రూ.10వేల విలువైన పుస్తకాలతో పాటు తెలుగు, ఇంగ్లిష్ దినపత్రికలు రెండే కాకుండా మాసపత్రికలు కూడా అందుబాటులో ఉంటాయి.



వనపర్తిలో అంబేద్కర్ విజ్ఞాన మందిరాన్ని ప్రారంభించాక రికార్డులో సంతకం చేస్తున్న కలెక్టర్ శ్వేతామహంతి (ఫైల్)

నిత్య నియమావళి

ప్రతి విజ్ఞాన మందిరంలో స్వేరోస్ నిత్య నియమావళి(10 కమాండ్‌మెంట్స్) బ్యానర్ ప్రదర్శించబడి ఉంటుంది. ప్రతి నియమం కూడా విద్యార్థులను లక్ష్యం వైపు సాగే విధంగా ఉంటుంది. ప్రతిరోజూ కమాండ్‌మెంట్స్ చదవడం ద్వారా ఏదైనా సాధించగలమన్న విశ్వాసం ఇక్కడి పిల్లలలో పెంపొందుతుంది. మొత్తం తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు 235అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు ప్రారంభించారు. అంబేద్కర్ విజ్ఞాన మందిరం లేని చోట కూడా స్వేరోస్ సర్కిల్ కేంద్రాన్ని ప్రారంభించి విద్యార్థులకు శారీరక వ్యాయామం, చదువుపై ఆసక్తి కలిగిస్తున్నారు.

యువత కోసం..

2012లో స్వేరోస్ ఇంటర్నేషనల్ పేరుతో పూర్వ విద్యార్థులు నెట్‌వర్క్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు, యువత చెడు ప్రభావాల వైపునకు లోనుకాకుండా ఉండేందుకు నెట్‌వర్క్ తీసుకుంటున్న కార్యక్రమాల్లో భాగంగా అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు ఏర్పాటుచేస్తున్నారు. ప్రతి విజ్ఞాన మందిరాన్ని స్వేరోస్ సర్కిల్‌గా మార్చారు. ప్రతి సర్కిల్‌లో కమాండర్ పేరు మీద ఒక ఇన్‌చార్జ్‌ని నియమించారు. ఉదయం, సాయంత్రం విజ్ఞాన మందిరం తెరవడం పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంచడం, రికార్డు నిర్వహించడం మొదలైన పనులను చూస్తారు. వీటితో పాటుగా ఉదయం 6 నుంచి 7గంటల వరకు వ్యాయామం, యోగా, కరాటే వంటివి శారీరక దారుఢ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు నిత్యం ఓ సబ్జెక్టుపై(ఆంగ్లం, గణితము, సైన్స్) తరగతులు నిర్వహిస్తారు. అలాగే, ప్రతి ఆదివారం వివిధ అంశాలపై ఆటల పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం జరుగుతుంది. గ్రామంలోని బడి ఈడు పిల్లలంతా ఉత్సాహంగా స్వేరోస్ సర్కిల్‌లో పాల్గొంటుండటంతో తల్లిదండ్రులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం విజ్ఞాన మందిరానికి వెళ్తా..



అంబేద్కర్ విజ్ఞాన మందిరానికి ప్రతిరోజూ రావడం వల్ల పఠన శక్తి బాగా పెరిగింది. మహనీయుల చరిత్రలు చదవడం వల్ల వారి నుంచి స్ఫూర్తిని పొందడం జరిగింది. స్వేరో 10 కమాండ్‌మెంట్స్ నాకు మంచి ప్రేరణను కలిగించాయి. – **పార్వతయ్య, నర్సింగాయపల్లి, గోపాల్‌పేట మండలం**

మహనీయుల చరిత్ర తెలుసుకుకున్నా..



అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు చక్కని జ్ఞాన సంపదకు నిలయాలు. ఇందులో నేను అంబేద్కర్, రమాబాయి, జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే జీవిత చరిత్రలు చదివి స్ఫూర్తిని పొందుతున్నాను. రోజు విజ్ఞాన మందిరానికి వెళ్లి కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నాను. – **ఆర్.మహేష్, తాడిపర్తి, గోపాల్‌పేట మండలం**



ఆధ్యాత్మికతతోనే జన్మ సార్థకం

- హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి
- మక్తల్‌లో అయ్యప్ప మహాపడిపూజ

మక్తల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ఉన్నప్పుడే జన్మసార్థకం అవుతుందని జగద్గురు హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి అన్నారు. మక్తల్‌లో శుక్రవారం జరిగిన 35వ అయ్యప్పస్వామి మహాపూజ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అభిషేకం, పాలాభిషేకం, హోమం చేశారు. అంతకుముందు పట్టణంలో ఉమామహేశ్వర ఆలయం నుంచి అయ్యప్పస్వామిని భక్తులు ఊరేగింపుతో ఆలయం వరకు చేరుకున్నారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. దైవభక్తి అలవర్చుకుంటే మనిషి సన్మార్గంలో పయనిస్తాడన్నారు. మంచి కోరే భక్తులకు దేవుడు మంచే చేస్తాడన్నారు. ఆలయ నిర్మాణానికి నగదు, విగ్రహాలు అందజేసిన దాతలను సన్మానించారు. అయ్యప్ప పూజా కార్యక్రమంలో అయ్యప్ప కనకవర్షంలో రూ.లక్ష విరాళంగా మార్కెట్ చైర్మన్ నర్సింహ అందజేయగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నేరడగం పీఠాధిపతి పంచమ సిద్ధిలింగ మహాస్వామి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కె.దయాకర్‌రెడ్డి, సీతమ్మ, ఎమ్మెల్యే సతీమణి సుచరిత, జెడ్పీటీసీ వి.శ్రీహరితో పాటు శ్రీనివాస్, కొండయ్య, వర్కటం జగన్నాథ్‌రెడ్డి, ఓంప్రకాష్, వెంకట్, వెంకటేశ్వర్లు, బాల్చేడ్ మల్లికార్జున్, మక్తల్ కట్ట సురేష్‌కుమార్, చంద్రకాంత్, రాజేష్ పాండే, నర్సింహరెడ్డి, రాజుల ఆశిరెడ్డి, గోపాలరెడ్డి, గురుస్వాములు అశోక్, అనిల్‌కుమార్, గణేష్, శ్రీధర్‌గౌడ్, లక్ష్మణ్, విష్ణువర్ధన్‌రెడ్డి, నిరంజన్, జగదీష్, ఆనంద్, భీంరెడ్డి, గొవర్ధన్‌రెడ్డి, భాగ్యమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి



అయ్యప్పస్వామి విగ్రహానికి పాలాభిషేకం





మార్కెట్ చైర్మన్ నర్సింహను ఆలయ కమిటీ సభ్యులు

విజ్ఞాన మందిరాలది కీలకపాత్ర



జ్ఞానవంతమైన సమాజ నిర్మాణంలో అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు కీలక పాత్ర పోషిస్తాయి. గ్రామాలలో విద్యా ప్రాధాన్యత తెలియక సమయాన్ని వృథా చేసుకుంటున్న యువతకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజకరంగా ఉన్నాయి. ప్రారంభంలో వీటిపై అవగాహన లేకపోయినా సర్కిల్స్ ప్రారంభించాక నిత్యం కనీసం 30మంది విద్యార్థులు ప్రతి విజ్ఞాన మందిరంలో పాలు పంచుకుంటున్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా కమాండర్స్ రోజుకు రెండు పూటల తమ సేవలను వినియోగిస్తున్నారు. రాబోయే తరాలకు అత్యున్నతమైన విద్యను అందించడమే విజ్ఞాన మందిరాల ప్రధాన లక్ష్యం.

– సి.కిరణ్‌కుమార్, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు

ఆధునిక టెక్నాలజీకి హబ్ వంటివి



అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు ఆధునిక టెక్నాలజీకి హబ్ వంటివి. భవిష్యత్ సమాజం మొత్తం సాంకేతిక పరిజ్ఞానం మీద ఆధారపడే మనుగడ సాగిస్తుంది. మాతృభాష మీద మమకారం కొనసాగిస్తునే ప్రపంచ భాషను రాబోయే తరం పిల్లలకు అందించడం కూడా అంబేద్కర్ విజ్ఞాన మందిరాల ప్రధాన లక్ష్యం. పిల్లలకు చరిత్రను పరిచయం చేస్తూనే భవిష్యత్‌పై నమ్మకం, విశ్వాసం కల్పించడం ఈ మందిరాల ఏర్పాటులో మరో ముఖ్య ఉద్దేశం. ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన వల్ల భవిష్యత్ స్వేరోస్ సర్కిల్స్ అన్ని గ్రామాలలో ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ గురుకులాల కార్యదర్శి



నర్సింగాయపల్లి కేంద్రం వద్ద కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)



రగ్బీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు (ఫైల్)

- రగ్బీలో రాణిస్తున్న ఆత్మకూర్ ఆణిముత్యాలు
- ఉమ్మడి జిల్లాల బాలురు, బాలికల జట్లలో ఇక్కడివారే..
- జాతీయస్థాయిలో సత్తా చాటుతున్న క్రీడాకారులు

A CHALLENGE

ఆత్మకూర్(కొత్తకోట): పంతం నీదా నాదా సై.. సొంతం నీకా నాకా సై.. భగభగా మరిగిన రక్తం మాదే మాదే సై.. తెగతెగ పైకెగిరిన పందెం మాదే మాదే సై.. లేపేస్తాం బంతి చూపిస్తాం సత్తా పోటాపోటీ నిలిచామంటే బాడీ ఫట్ ఫట్ ఫట్ సై..సై. అంటు మేము సైతం సిద్ధం అంటు రాజమౌళి తీసిన సై చిత్రాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు గ్రామీణ క్రీడాకారులు.

యూరప్ దేశాలకే పరిమితమైన రగ్బీ క్రీడకు ఇటీవల కాలంలో గ్రామస్థాయిలోనూ ప్రత్యేక ఆదరణ లభిస్తుంది. ఆత్మకూర్ మండలంలోని తిప్డంపల్లి, కురుమూర్తి, పిన్నంచర్ల, ఆత్మకూర్‌కు చెందిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ ప్రతిభను చాటుకుంటున్నారు. తిప్డంపల్లికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పరమేష్, రవికుమార్ ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉమ్మడి జిల్లాలకు బాలురు, బాలికల జట్లను సిద్ధం చేసి జాతీయస్థాయిలో సైతం ఆడుతూ ఆత్మకూర్ ఆణిముత్యాలుగా నిలుస్తున్నారు. అండర్–17, అండర్–19 రగ్బీ పోటీలకు గాను ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి మూడేళ్లుగా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

ఆత్మకూర్ నుంచే జిల్లా జట్టు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రగ్బీ పోటీలకు జట్టు లేకపోవడంతో ఆత్మకూర్‌కు చెందిన జట్లనే జిల్లా జట్లుగా ఎంపికచేసి 2015లో కరీంనగర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీపోటీలకు వెళ్లడం జరిగింది. అక్కడ సత్తా చాటి రాష్ట్రస్థాయిలో అండర్–17లో ప్రథమ బహుమతి, అండర్ –19లో ద్వితీయ బహుమతి సాధించి ఆదర్శంగా నిలిచారు.

➡ 2016 జనవరిలో అదిలాబాద్ జిల్లాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో అండర్ –19 మొదటి బహుమతి, అండర్ –17లో రెండో బహుమతిని కైవసం చేసుకున్నారు.

➡ 2016 నవంబర్‌లో రంగారెడ్డిలో రాష్ట్రస్థాయి పోటీల్లో మెదటి స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీల ఎంపికలో అండర్ –17జట్టులో ఐదుగురు, అండర్ –19జట్టులో ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు.

➡ గతేడాది చివరిలో ఒడిస్సాలోని భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. అదేవిధంగా 18 డిసెంబర్ 2017న హైదరాబాద్‌లోని దోమలగూడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో బహుమతిని సాధించారు. ఈ క్రీడాకారులంతా పేదింటికి చెందిన వారే కావడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం రగ్బీ క్రీడను ప్రోత్సహించి ఆదరిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తామని కోచ్‌లు, విద్యార్థులు అంటున్నారు.





జాతీయక్రీడల్లో రాష్ట్ర బాలికల జట్టు, ఎస్‌జీఎఫ్ స్టేట్ సెక్రటరీ రాంరెడ్డి చేతులమీదుగా ట్రోఫీ అందుకుంటున్న చాంపియన్లు (ఫైల్)



జాతీయక్రీడల్లో పాల్గొన్న అండర్-19 రాష్ట్ర జట్టు (ఫైల్)

మొదట్లో భయపడ్డా..



రగ్బీ కోచ్ పరమేష్ ఆటపట్ల నాతోపాటు తోటి విద్యార్థులకు వివరించడంతో మొదట్లో చాలా భయపడ్డాం. ఎలాగైనా సరే ఆడితీరాలని నిర్ణయించుకొని శారీరకంగా సిద్ధమై ఆటలపోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడి నేనేమిటో నిరూపించుకున్నాను.

– నందిని, విద్యార్థిని, ఆత్మకూర్

కఠోర సాధనతో వెళ్లాను



గతంలో పాఠశాలస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్నప్పటికీ రగ్బీ క్రీడపై ఎలాంటి అవగాహన లేదు. ప్రస్తుతం కఠోర సాధనతో జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభను చాటుతున్నాను. జాతీయస్థాయి రగ్బీలో అందివచ్చే అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లున్నాను. అంతర్జాతీయ రగ్బీ పోటీల్లో పాల్గొనే లక్ష్యం ఉంది.

– ప్రవీణ్, అండర్–17, రాష్ట్రజట్టు కెప్టెన్, ఆత్మకూర్

అంతర్జాతీయ స్థాయి పోటీలే లక్ష్యం



తెలంగాణ రాష్ట్రం నుంచి అంతర్జాతీయ రగ్బీ క్రీడాకారులను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. దీనికిగాను అమేచ్యూర్ రగ్బీ అసోసియేషన్ వారితో సంప్రదించి వారి సహకారంతో గ్రామీణ ప్రాంతంలోని బాలబాలికలకు ఉచితంగా శిక్షణలు ఇచ్చి క్రీడాకారులను ఎంపిక చేసుకొని శిక్షణలు ఇచ్చి సత్ఫలితాలు పొందుతున్నాం.

– పరమేష్, రాష్ట్ర జట్టు కోచ్, ఆత్మకూర్



పూజకు హాజరైన భక్తులు , అయ్యప్పస్వామి ఊరేగింపులో భజన చేస్తున్న భక్తలు





డ్కు సన్మానిస్తున్న

రగ్బీని ప్రోత్సహించాలి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమెథ్యూర్ రగ్బీ ఆటను ప్రోత్సహించాలి. నాలాంటి క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఆడి తెలంగాణ సత్తాను చాటుతాం. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టి సారించాలి.

– భానుప్రకాష్, అండర్–19, రాష్ట్ర జట్టు కెప్టెన్, ఆత్మకూర్

సంతోషానికి అవధుల్లేవ్



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూర్ నుంచి అండర్–17, అండర్–19 రగ్బీ జట్లను ఏర్పాటు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాం. ప్రతిఒక్కరూ అభినందనలతో ముంచెత్తుతున్నారు. బాలబాలికలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారు.

– రవికుమార్, జిల్లా కోచ్, ఆత్మకూర్

శ్రమకు ఫలితం



రగ్బీ శిక్షణ కాలంలో పడ్డ శ్రమకు జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించడంతో ఫలితం దక్కడం సంతోషం కలిగించింది. రగ్బీ సాదన సందర్భంగా అనేకసార్లు బాధపడ్డాం. చికిత్స పొందుతూనే పట్టుదలతో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నాం.

– నిఖిత, విద్యార్థిని, ఆత్మకూర్

శనివారం జనవరి | 6 | 2018 సాక్షి

మార్చినాటికి 3వేల ఎకరాల సేకరణ

- ✦ కార్పొరేషన్ రుణాలకు బ్యాంకర్లు సెక్యూరిటీ, డిపాజిట్లు కోరితే ఫిర్యాదు చేయండి
- ✦ నిరుద్యోగ యువత కోరితే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి శిక్షణ కేంద్రాలు
- ✦ ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం


మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం

కొల్లాపూర్: దళితులకు పంపిణీ చేసేందుకు ఫిబ్రవరి నెలాఖరులోగా రాష్ట్ర వ్యాప్తంగా 3వేల ఎకరాల వ్యవసాయ భూములు కొనుగోలు చేయనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం వెల్లడించారు. దళితులకు పంపిణీ చేసేందుకు కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో 18.36 ఎకరాలు, చింతలపల్లిలో 25ఎకరాల భూములను రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ స్థలాన్ని శుక్రవారం డీఆర్ఓ మధుసూదన్‌నాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కొల్లాపూర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు.

భూముల కొనుగోళ్లకు రూ.400కోట్లు

2017–18 సంవత్సరంలో ఎస్సీకార్పొరేషన్‌కు కేటాయించిన రూ.1,400కోట్ల బడ్జెట్‌లో భూముల కొనుగోళ్లకు 4వందల కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంవత్సరం 5వేల ఎకరాల భూమిని కొనుగోలు చేయాలని నిర్ణయించగా, ఇప్పటి వరకూ 2,200 ఎకరాల భూమిని కొనుగోలు చేసి దళితులకు పంపిణీ చేశామన్నారు. మార్చి నెలాఖరులోగా పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భూప్రక్షాళన కారణంగా భూ కొనగోళ్లలో కొంత ఆలస్యం జరిగిందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటివరకూ 7వందల ఎకరాల భూమిని కొనుగోలు చేశామని, మరో వెయ్యి ఎకరాల భూమిని కొనుగోలు చేయబోతున్నట్లు వివరించారు. ఉమ్మడి జిల్లాలో దళితుల్లో భూపంపిణీకి అర్హులైన వారు పెద్దసంఖ్యలో ఉన్నారని తెలిపారు. చాలాగ్రామాల్లో భూములు తక్కువ, లబ్ధిదారులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారని, అటువంటి చోట్ల గ్రామసభలో లాటరీ పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి కల్పన కోసం నిరుద్యోగులకు ఇస్తున్న సబ్సిడీ రుణాల మంజూరుకు బ్యాంకర్లు సెక్యూరిటీ, డిపాజిట్లు అడిగితే కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అటువంటి బ్యాంకుల వివరాలను ప్రభుత్వానికి నివేదించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళిత నిరుద్యోగుల కోసం అపోలో, న్యాక్ వంటి సంస్థలతో కలిసి ఉపాధి శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత కోరితే స్థానికంగానే ఉపాధి శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

అంకితభావంతో పనిచేయాలి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


వీఓఏకు వేతనాలు అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధినిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల పరిధిలో పనిచేస్తున్న వీఓఏలకు ఆర్నెళ్లుగా పెండింగ్‌లో వేతనాలు రూ.1.68కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. శుక్రవారం కొల్లాపూర్‌లోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని 590మందికి రూ.కోటి4లక్షల 36వేలు, వనపర్తి జిల్లా పరిధిలోని 371మందికి రూ.66లక్షల 78వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమంపై టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో వనపర్తి డీఆర్‌డీఓ గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, జెడ్పీటీసీ హన్మంతునాయక్, డీపీఎంలు భాషానాయక్, ప్రభాకర్, శ్రీను, ఏపీఎంలు గౌసోద్దీన్, సైదులు, పార్వతి, అరుణ, వెంకటేష్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనం ప్రారంభం

కొల్లాపూర్ పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో రూ.కోటి ఖర్చుతో నూతనంగా నిర్మించిన ఎస్టీ బాలికల హాస్టల్‌ను మంత్రి జూపల్లి ప్రారంభించారు. భవనంలోని తరగతి గదులను మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, జెడ్పీటీసీ హన్మంతునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గిరిజన బాలికలతో భోజనాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.50లక్షలతో ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు.

నిర్దేశిత సమయానికి నాణ్యతగా పూర్తిచేయాలి


శ్యాసన్‌పల్లిలో పనులు పరిశీలిస్తున్న కృపాకర్‌రెడ్డి తదితరులు

నారాయణపేట రూరల్: మిషన్ భగీరథ పనులను వేగవంతంగా పూర్తిచేసి నిర్ణయించిన సమయానికి సిద్ధంచేయాలని చీఫ్ ఇంజనీర్ కృపాకర్‌రెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం నారాయణపేట మండలంలో జరుగుతున్న మిషన్ భగీరథ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్యాసన్‌పల్లిలో 19లక్షల లీటర్లు, పేరపళ్ల మీదితండా 19లక్షల లీటర్లు, దామరగిద్ద మండలం ఉడ్మల్‌గిద్ద 600 కిలో లీటర్లు, వత్తుగుండ్లలో 150 ఓహెచ్‌బీఆర్, ఉలిగుండంలో 40 కిలో లీటర్ల ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనుల పురోగతిపై కాంట్రాక్టర్లతో చర్చించారు. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. ఆయన వెంట ఏజీఎం వెంకటేష్, ఎస్ఈ చెన్నారెడ్డి, ఈఈ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ ఇంజనీయర్ రాఘవేంద్రప్రసాద్, ఏఈలు రాము, అభిలాష్, మెఘా అసోసియేషన్ ఇంజనీయర్ బాషా, నాగార్జున్‌రెడ్డి, సంపత్, నవీన్ ఉన్నారు.

ఆర్టీసీ కార్మికులకు పే స్కేల్ అమలు చేయాలి

టీఎంయూ నాయకుల గేట్‌ధర్నా


మాట్లాడుతున్న రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జీఎల్ గౌడ్


స్టేషన్ మహబూబ్‌నగర్: ఏప్రిల్ 1 2017 నుంచి ఆర్టీసీ కార్మికుల పేస్కేల్‌ను వెంటనే అమలు చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జీఎల్‌గౌడ్ డిమాండ్ చేశారు. టీఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఎంవీయాక్ట్‌కు వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట గేటుధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎల్ గౌడ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం మొండివైఖరి ప్రదర్శిస్తుండడం సరికాదన్నారు. పేస్కేల్ సాధన కోసం కార్మికులు సమ్మెకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. పేస్కేల్ కమిటీలో జీఎల్‌గౌడ్ సభ్యుడిగా ఎంపికకావడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ధర్నాలో టీఎంయూ నేతలు బసప్ప, భాస్కరాచారి, శ్రీనివాసులు, వెంకటయ్యయాదవ్, అరవింద్, భానుప్రకాశ్‌రెడ్డి, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీయూ అభివృద్ధికి రూ.175కోట్ల ప్రతిపాదనలు: వీసీ


క్యాలెండర్లు విడుదల చేస్తున్న వీసీ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని వీసీ రాజరత్నం అన్నారు. శుక్రవారం పీయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం యూనివర్సిటీలో అన్ని అభివృద్ధి పనులు, విద్యార్థుల అవసరాలకు సంబంధించి పూర్తి వివరాలను అందించనున్నామన్నారు. రూ.175కోట్లుతో కూడుకున్న ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. వీటిలో 300 మంది విద్యార్థులు ఉండేందుకు హాస్టల్ నిర్మాణం, రూ.5కోట్లతో మినీ స్టేడియం, రీసెర్చ్ స్కాల ర్స్ కోసం ఫెసిలిటీ సెంటర్‌తోపాటు కంప్యూటర్ ల్యాబ్, పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు అంబేద్కర్ స్టడీసెంటర్, యూనివర్సిటీలోని భవనాలకు సమీకృత నీటిసరఫరాకు ట్యాంక్, అన్ని భవనాలకు అంతర్గతం రోడ్డు, అధ్యాపకులు, ఉద్యోగులకు నివాసగృహాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, వీటి నిర్మాణానికి భూమి విషయంలో కలెక్టర్ చొరవవల్ల యూనివర్సిటీకి చెందిన 173 ఎకరాల భూమి అందుబాటులో ఉందన్నారు. న్యాక్ గుర్తింపునకు ఫిబ్రవరీ చివరి నాటికి దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ ప్రభుత్వం, నాన్ టీచింగ్ సిబ్బంది నియామానికి ఫిబ్రవరీలో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ పాండురంగారెడ్డి, అధికారులు మధుసూదన్‌రెడ్డి, పవన్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ గిరిజ, నూర్జాహన్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పరిశీలన పూర్తి


రికార్డులు పరిశీలిస్తున్న కార్వీ సంస్థ సభ్యుడు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి నగర పంచాయతీలో కేంద్రం బృందం పరిశీలన శుక్రవారంతో పూర్తయింది. కార్వీ సంస్థకు చెందిన ప్రశాంత్‌కుమార్ నగర పంచాయతీ పరిధిలో స్వచ్ఛ కార్యక్రమాలపై రెండు రోజులపాటు పరిశీలన చేశారు. రికార్డులు తనిఖీ చేయడంతోపాటు మొబైల్‌లో అప్‌లోడ్ చేసుకున్నారు. ఆర్నెళ్లుగా చెత్తసేకరణ, సిబ్బంది పనితీరు, ఐఎస్ఎల్, ఇంకుడుగుంతల నిర్మాణాలకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. రికార్డుల్లో వాస్తవ పరిస్థితులను ఫీల్డ్ విజిట్‌లో సందర్శించారు. డంపింగ్‌యార్డు, వర్మి కంపోస్టులు లేకపోవడాన్ని గుర్తించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కొందరు సభ్యులు శుక్రవారం రహస్యంగానే కాలనీల్లో నేరుగా ప్రజలతో మమేకమై విచారించారు. కమిషనర్ సునిత రికార్డులు చూయించడంతోపాటు ఫీల్డ్ విజిట్‌లో పాల్గొన్నారు.

‘కిట్టు’.. పక్కదారిపై విచారణ

మానవపాడు, ధరూర్ పోలీసుస్టేషన్లకు వైద్యసిబ్బంది


ధరూర్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన వైద్యసిబ్బంది

సాక్షి, గద్వాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకం పక్కదారి పట్టడాన్ని జోగుళాంబ గద్వాల కలెక్టర్, ఎస్పీలు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ మేరకు విచారణ చేయాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. ప్రైవేటు ఆస్పత్రులలో కాన్పులు చేయించుకొని ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పులు అయినట్లుగా రికార్డులు సృష్టించి కేసీఆర్ కిట్‌ను పక్కదారి పట్టించినట్లు గురువారం వెలుగులోకి వచ్చిన విషయం విధితమే. ధరూర్ మండలంలోని ఒకరు, గద్వాలో ఒకరు, మానోపాడులో ముగ్గురు మహిళలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవించినా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు అయినట్లు రికార్డులు సృష్టించి కేసీఆర్ కిట్ తీసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ అంశంపై సీరియస్‌గా స్పందించిన కలెక్టర్ విచారణ చేయాలని ఆదేశించారు. ప్రాథమిక విచారణ అనంతరం కేసీఆర్ కిట్ పక్కదారి పట్టినట్లుగా ప్రాథమికంగా గుర్తించిన డీఎంహెచ్ఓ డాక్టర్ సునిత మానవపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎస్పీ ఆదేశాలతో మానోపాడు, ధరూర్ పోలీసు స్టేషన్లలో కేసు నమోదు చేసుకొని పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. పోలీసు స్టేషన్లకు వైద్య సిబ్బందిని పిలిపించుకొని విచారించారు. అదేవిధంగా మానోపాడులో పీహెచ్‌సీకి పోలీసు అధికారులు వెళ్లి విచారించారు. ఈ సందర్భంగా ఎస్పీ విజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. మానోపాడు, ధరూర్ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పోరాటాల ద్వారానే హక్కుల సాధన



లంబాడీల సదస్సులో మాట్లాడుతున్న దాస్‌రాంనాయక్

జడ్చర్ల టౌన్: పోరాటాల ద్వారానే హక్కులు సాదించుకుందామని.. అందుకు గిరిజనులు ఐకమత్యంగా ముందుకుసాగాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాస్‌రాం నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం బాదేపల్లి పట్టణం భవానీ ఫంక్షన్‌హాల్‌లో ఎల్‌హెచ్‌పీఎస్, గిరిజన విద్యార్థి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నెరవేర్చకుండా తాత్సారం చేస్తూ.. ఆదివాసీలతో గొడవలు పెట్టిస్తుందని, ప్రభుత్వం కుట్రలకు తలొగ్గకుండా ఐక్యంగా ముందుకుసాగుతూ 10శాతం రిజర్వేషన్ సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తండాలను ప్రత్యేక పంచాయతీలుగా మార్చుకుని నిధులు కేటాయించే వరకు ఆందోళనలు కొనసాగించాలన్నారు. ‘‘ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు’’ అనే నినాదంతో ముందుకు సాగుదామన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ అవగాహన సదస్సులు నిర్వహించుకుని ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుందామన్నారు. సదస్సులో ఎల్‌హెచ్‌పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్‌నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇందల్‌రాథోడ్, నాయకులు రమేష్, లోకేష్, గోపాల్, రఘు, శాంతిదాస్‌రాం తదితరులు పాల్గొన్నారు.



గల్ఫ్‌లో 87,64,829 మంది భారతీయులు

గల్ఫ్ దేశాల సహకారమండలిలోని (గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ –జీసీసీ) ఆరు దేశాలలో ప్రవాస భారతీయుల జనాభా 87 లక్షల 64 వేల 829కు చేరిందని లోక్ సభలో జితేంద్ర చౌదరి అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ డిసెంబరు 27న లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సౌదీ అరేబియాలో 32,53,901 మంది, యూఏఈలో 28 లక్షలు, కువైట్‌లో 9,17,970, ఒమన్‌లో 7,83,040, ఖతార్‌లో 6.97 లక్షలు, బహరేన్‌లో 3,12,918 మంది ప్రవాస భారతీయులు ఉన్నారని తెలిపారు. ఆరు గల్ఫ్ దేశాలలో 11,774 మంది భారత సంతతి ప్రజలు ఉన్నట్టు చెప్పారు. ప్రపంచంలోని 208 దేశాలలో ఎన్నారైలు, పీఐఓలు కలిపి 3 కోట్ల 12 లక్షల 33 వేల 234 మంది భారత ప్రవాసులున్నారని ప్రకటించారు. ఇందులో కోటి 33 లక్షల 27 వేల 438 మంది ప్రవాస భారతీయులు, కోటి 79లక్షల 5వేల 796 మంది భారత సంతతి ప్రజలు ఉన్నారని వివరించారు.

ప్రవాసీ భారతీయ దివస్‌కు భారత సంతతి పార్లమెంటేరియన్లు

జనవరి 9న ఢిల్లీలో నిర్వహించనున్న ప్రవాసీ భారతీయ దివస్‌కు ప్రపంచంలోని వివిధ దేశాలలో ఉన్న భారత సంతతికి చెందిన 285 మంది పార్లమెంటేరియన్లను భారత ప్రభుత్వం ఆహ్వానించింది. ఇప్పటివరకు 125 మంది పార్లమెంటేరియన్లు తమ సమ్మతిని తెలియజేశారని విదేశాంగ శాఖలోని ప్రవాసీ భారతీయ వ్యవహారాల శాఖ కార్యదర్శి జ్ఞానేశ్వర్ మూలే తెలిపారు. భారత ప్రభుత్వం దౌత్యాన్ని ప్రజాపక్షం చేసిందని, భారత సంతతితో పరస్పరం అభిప్రాయాలను పంచుకోవడం, మాతృభూమితో వారి బంధాన్ని దృఢపరచడం తమ లక్ష్యమని అయన అన్నారు. విదేశాల్లోని భారతీయుల కోసం తక్షణం స్పందించే ఆన్‌లైన్ వ్యవస్థ 'మదద్' (కాన్సులర్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్ సిస్టం) ద్వారా 26 వేల ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 21 వేలు పరిష్కరించామని వివరించారు.

ఖతార్‌లో ఎన్నారైలకు దౌత్య సేవలు

ఖతార్ దేశ రాజధాని దోహాలోని ఇండియన్ ఎంబసీ (భారత దౌత్య కార్యాలయం) అధికారులు ఈనెల 12న శుక్రవారం అల్ బనూష్ క్లబ్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కాన్సులర్ క్యాంపు (దౌత్య సేవల శిబిరం) నిర్వహిస్తారు. ఎన్నారైలు వారి పాస్‌పోర్ట్, దౌత్య సంబంధ సేవలు గురించి, వేతనాలు తదితర సమస్యల గురించి అధికారులకు దరఖాస్తులు సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు ఎంబసీ హెల్ప్‌లైన్ నంబర్ **+97455808254** ఇ–మెయిల్: labour.doha@mea.gov.inకు సంప్రదించవచ్చు.

సౌదీలో 'ప్రవాసీ ప్రజావాణి'

సౌదీ అరేబియాలోని జిద్దా ఇండియన్ కాన్సులేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న శుక్రవారం 'కాన్సులేట్ ఎట్ యువర్ డోర్' (మీ ముంగిట్లోకి దౌత్య కార్యాలయం) కార్యక్రమాన్ని భారత దౌత్య అధికారులు నిర్వహిస్తున్నారు. అభాలోని ఖమీస్ ముషాయిత్‌లో 054 6722909, మక్కాలోని ఇండియన్ హజ్ మిషన్‌లో 012 5603580, నజరాన్‌లో 017 5221949 నంబర్లలో సంప్రదించవచ్చు.

సేకరణ: మంద భీంరెడ్డి, అధ్యక్షులు, ప్రవాసీ మిత్ర

నిర్దిష్ట విధానం కావాలి

- శిక్షణ లేక కూలీలుగా వెళ్తున్న యువత
- సరైన ఉపాధి దొరకక అఘాయిత్యాలు
- కేరళ తరహా విధానం రూపొందించాలి
- వలసదారుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు

ఉపాధి వేటలో ఎడారి దేశాల బాటపడుతున్న నిరుద్యోగ యువత కొందరు నకిలీ ఏజంట్ల చేతుల్లో మోసపోయి నష్టపోతుంటే.. మరికొందరు జీతాలు సరిగా రాక.. అప్పులు తీరక.. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వలసదారుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు అన్నారు. ఇక్కడి నుంచి వెళ్లేవారికి స్కిల్ డెవలప్‌మెంట్ లేకపోవడంతో ఎక్కువ శాతం కూలీ పనులే చేస్తున్నారని అన్నారు. గల్ఫ్ బాధితుల పక్షాన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ కేంద్రంగా పోరాటాలు చేస్తున్న నర్సింహనాయుడు తన అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

– కొండవీటి సురేష్‌కుమార్, ఆర్మూర్

సాక్షి INTERVIEW

గల్ఫ్ దేశాలతో పాటు ఇరాన్, ఇరాక్, అఫ్ఘానిస్తాన్, ఇజ్రాయిల్, సింగపూర్, మలేసియా తదితర దేశాలకు తెలంగాణ నుంచి యువత ఉపాధి కోసం వెళ్తున్నారు. కానీ నిరక్షరాస్యులు, శిక్షణ లేనివారు కావడంతో 90 శాతం మంది కూలీలుగానే వెళ్తున్నారు. కేరళ రాష్ట్రీయులు మాత్రం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలు పూర్తి చేసుకొని గల్ఫ్ దేశాలకు వెళ్లడంతో మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. మనవారికి సరైన శిక్షణ లేక పనులు సరిగా దొరకడం లేదు. దీంతో చేసిన అప్పులు తీరక స్వదేశానికి వచ్చిన వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గల్ఫ్ దేశాల్లోని మృతదేహాలను స్వదేశాలకు తరలించడానికి నెలల తరబడి ఎదురు చూసే దయనీయ స్థితిని చూశాము. 2013లో వలసదారుల సంక్షేమ, హక్కుల వేదికను ఏర్పాటు చేసి కొన్ని గల్ఫ్ బాధితుల కుటుంబాలకు ప్రతి నెల 500 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశాము. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గల్ఫ్ మృతుల కుటుంబాలకు లక్ష రూపాయల పరిహారాన్ని అందజేసేవారు. టీఆర్ఎస్ పార్టీ నాయకులు పరిహారాన్ని ఐదు లక్షల రూపాయలకు పెంచు తామని ఎన్నికల సమయంలో ప్రకటించినా ఇప్పటికీ అమలు కాలేదు. అంతే కాదు.. గత



కోటపాటి నర్సింహనాయుడు

ప్రభుత్వాలు ఇచ్చిన తరహాలో లక్ష రూపాయలు కూడా ఇవ్వలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 2 జూన్ 2014 నుంచి 2 అక్టోబర్ 2017 నాటికి 431 మంది తెలంగాణ ప్రజలు గల్ఫ్‌లో మృత్యువాత పడ్డట్లు రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా ధ్రువీకరించింది. వీరిలో ఒక్క కుటుంబానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సహాయమూ అందజేయలేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కలగజేసుకొని మృతదేహాలను వెంటనే స్వగ్రామాలకు చేర్చుతున్నప్పటికీ వారి కుటుంబాలకు భరోసా కల్పించడంలో విఫలమవుతుతోంది.

కేరళ, పంజాబ్ తరహాలో..

గల్ఫ్ దేశాల్లో సంక్షోభం గురించి తెలియక ఉపాధి వేటలో ఏడారి దేశాలకు వెళ్లి కష్టాలపాలవుతున్న రాష్ట్ర నిరుద్యోగులను ఆదుకోవడానికి ఒక ప్రత్యేక విధానమంటూ లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేరళ, పంజాబ్ రాష్ట్రాల తరహాలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం, గల్ఫ్ బాధితులను ఆదుకోవడం కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం, ప్రతి ఏటా వంద కోట్ల రూపాయల నిధిని కేటాయించడం లాంటి చర్యలు తీసుకోవాలి. నకిలీ ఏజంట్లను కఠినంగా శిక్షించడంతో పాటు ప్రత్యేక వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే విదేశాల్లో ఉద్యోగావకాశాలను తెలియపరచాలి. యువతకు అందుకు తగ్గ శిక్షణ ఇచ్చి ఉపాధి కోసం విదేశాలకు పంపే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. గల్ఫ్ దేశాల్లో అనారోగ్యం, ఉద్యోగపరంగా సమస్యలతో నష్టపోయి తిరిగి స్వదేశానికి వచ్చిన వారికి పావలా వడ్డీతో రుణాలు అందజేసి స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహించి వారి జీవితాలకు భరోసా కల్పించాలి. గల్ఫ్ దేశాలలో సంపాదించి తెలంగాణ రాష్ట్రానికి మన వాళ్లు ప్రతీ నెల పంపిస్తున్న డబ్బుపై పన్నుల రూపంలో వందల కోట్ల రూపాయలను ఆర్జిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బాధితుల సంక్షేమం గురించి కూడా ఆలోచించాలి. గల్ఫ్ మృతుల కుటుంబాలకు పింఛన్‌ను అందజేయాలి.

వైద్యం అందని దైన్యం

- దుబాయ్‌లో గాయపడిన సిరిసిల్లవాసి
- అచేతనంగా స్వగ్రామానికి
- ఆదుకునే వారి కోసం ఎదురుచూపు

పాలమాకుల శేఖర్, సిరిసిల్లటౌన్:

నా పేరు చిలుముల చంద్రశేఖర్. మాది సిరిసిల్ల పట్టణం బీవైనగర్. స్వర్ణకారుడిగా పనిచేస్తూ నా భార్య అరుణ, కొడుకులు సాయికుమార్, తేజలను పోషించుకునే వాడిని. పదేళ్ల క్రితం కులవృత్తికి పనులు తక్కువయ్యాయి. పిల్లల భవిష్యత్తు కోసం దుబాయ్ పోయి సంపాదించాలనుకున్న. కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన ఓ ఏజెంటు రూ.1.30లక్షలను తీసుకుని దుబాయ్‌కి పంపిండు. అక్కడ ఆంధ్రాకు చెందిన అన్‌లైసెన్స్‌డ్ ఏజెంటు నన్ను మూడు నెలలు ఏ పనీ లేకుండా తిప్పిండు. చేతిల డబ్బుల్లేకుండా అక్కడ చాలా రోజులు పస్తులుంటూ.. తెలుగు వారి వద్ద తలదాచు కునేటోన్ని. ఆ తర్వాత ఏమైందో గానీ అతని ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఎక్కడికో పారిపోయిండు. అక్కడ మనవాళ్లు నా పరిస్థితి తెలుసుకుని ఎక్కడైనా పని ఉంటే చెప్పేటోళ్లు. లేకుంటే రూములోనే ఉండేటోన్ని. కొద్ది రోజులకు మన తెలుగోళ్ల సాయంతో ఓ కంపెనీలో చేరాను. మూడున్నర సంవత్సరాలు కార్పెంటర్ పనిచేసిన. యజమానులు జీతం సరిగా ఇవ్వక పోయేటోళ్లు. కంపెనీలో చేరేటప్పుడు నెలకు రూ.1200 దర్‌హమ్‌లు ఇస్తానన్నరు. కానీ నాలుగు నెల్లకోసారి కూడా జీతం ఇచ్చేటోళ్లు కాదు. తర్వాత ఖల్లవెళ్లి వీసాతో కార్పెంటర్ పనులే చేసేటోన్ని. నన్ను అక్కడ పనిలో పెట్టిన సబ్‌కాంట్రాక్టర్ నాకు డబ్బులు సరిగా ఇచ్చేటోడు కాదు. కచ్చితంగా జీతం ఇవ్వాలని నిలదీస్తే.. జైలుకు పంపుతానని బెదిరించిండు. ఇట్లా నేను అక్కడ ఏజెంట్ల వద్ద రూ.23వేల దర్‌హమ్స్ మునిగాను. డిసెంబర్ 5న ఓ భవనంలో సీలింగ్ పనులు చేస్తూ నిచ్చెన జారీ కిందపడి పోయాను. సబ్‌కాంట్రాక్టర్ ఆసుపత్రికి తీసుకుపోయిండు. కేవలం మందులు మాత్రమే ఇప్పించిండు. కాలి ఎముక మూడుముక్కలైందని అక్కడి డాక్టర్లు చెప్పగా.. రూ.10 వేల దర్‌హమ్స్ ఖర్చయితాయన్నరు. చేసేది లేక నా పరిస్థితిని ఇంటివాళ్లకు చెప్పుకున్నా. పొత్తూరుకు చెందిన రవీందర్‌రెడ్డికి మావాళ్లు చెబితే.. ఆయన గల్ఫ్ కార్మిక నాయకుడు అడవి పదిరకు చెందిన మహేందర్‌రెడ్డి, షార్జాలో ఉన్న ముస్తాబాద్‌కు చెందిన జనగామ శ్రీనివాస్, ఢిల్లీకి చెందిన గిరీష్‌పంత్‌కు సమాచారం ఇచ్చారు. వారి సాయంతో ఎంబసీకి పోయి నా పరిస్థితిని వివరించగా.. ఎంబసీ వారు మానవతా దృక్పథంతో ఉచిత విమాన ప్రయాణ టికెట్ ఇచ్చి పంపారు. కాలికి ఆపరేషన్ చేయించుకోవాలంటే చేతిలో చిల్లిగవ్వలేదు. మంచం పట్టిన నాకు భార్య, పిల్లలు సేవలు చేస్తున్నారు. ఇప్పుడు నేను ఎట్లా నడిచి వారిని సాదుకోవాలి. కరీంనగర్ ఆసుపత్రికి పోతే ఆరోగ్యశ్రీ ఈ ఆపరేషన్‌కు వర్తించదన్నారు. రూ.80వేలు ఖర్చవుతుందట. ప్రభుత్వం ఆదుకోవాలి.

> **ఉన్న ఊర్లో పనుల్లేక పొట్ట చేతబట్టుకుని పోయిన బడుగు జీవి అక్కడ పనికోసం ఎన్నో అవస్థలు పడ్డాడు. ఏదో ఒక పనిలో కుదిరిన ఆయనను విధి వెంటాడింది. నిచ్చెన జారి కిందపడిపోయాడు. ఆ ప్రమాదంలో కాలు విరిగితే పనిలో పెట్టుకున్న కంపెనీ కనీసం వైద్యం కూడా చేయించలేదు. దూర దేశంలో పడిన కష్టాలు ఆయన మాటల్లోనే..**



దుబాయ్‌లో చంద్రశేఖర్‌ను పరామర్శిస్తున్న జనగామ శ్రీనివాస్, గిరీష్‌పంత్



నాగర్‌కర్నూల్‌లో

రవి: ఎంసీఏ

రమణ: ఒక్కడు మిగిలాడు

రామకృష్ణ: నేను నాప్రేమ కథ



ప్రారంభమైన ముగ్గుల పోటీలు

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో శుక్రవారం ముగ్గుల పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిలింగేశ్వర ఆలయం, ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ముగ్గులు వేసి అలరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి బహుమతులు అందజేశారు. సర్పంచ్ బిరుదు సాయిలీల, ఎంపీటీసీ కువలేశ్వర్‌రెడ్డి, హన్మంతురావు, హెచ్‌ఎం వెంకటయ్య పాల్గొన్నారు.

తీరనున్న విద్యుత్ సమస్య

మండలంలో విద్యుత్ సమస్య తీరనుంది. తెలకపల్లికి విద్యుత్ సమస్య తీర్చేందుకు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కృషితో 200 విద్యుత్ స్తంభాలు మంజూరయ్యాయని, వాటికి సంబంధించిన మెటీరియల్‌తోపాటు 100కేవీట్రాన్స్‌ఫార్మర్లురెండు మం జూరైనట్లు సర్పంచ్ నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు.

వాహన చట్ట సవరణను ఆపాలని వినతి

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో ప్రవేశ పెట్టిన మోటర్ వాహన చట్టం సవరణను ఆపాలని సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా డీటీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు అయూబ్, పొదిల రామయ్యలు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కార్మికులు, వాహన చోదకులు చట్టాన్ని వ్యతిరేకించడంతో ఈబిల్లు వెనకి తగ్గిందని, కేంద్రం మళ్లీ రాజ్యసభలో బిల్లు ప్రవేశ పెట్టడం దుర్మార్గమని అన్నారు. ఈ నిర్ణయంతో వాహన డ్రైవర్లు చాలా నష్టపోతారని అన్నారు. మొత్తం రవాణ రంగానే ప్రైవేట్ చేసే దిశగా కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని అందరూ వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆటో ట్రాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, నాగరాజు, శ్రీరాం, శ్రీనివాస్ రెడ్డి, మహేష్, మల్లేష్ పాల్గొన్నారు.



డీటీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు



కందనూలు : గేట్ ధర్నా చేస్తున్న నాయకులు

కందనూలు : ఆర్టీసీని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న రోడ్డు రవాణా బిల్లు 2017ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ జిల్లా డివిజన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్టీసీ డిపో గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడం దారణమని అన్నారు. కార్యక్రమంలో టీఎంయూ డిపో అధ్యక్షుడు శ్రీనివాస్, వీరాంజనేయులు, నాగిరెడ్డి, మహలింగం, వందన, నారయణ, నర్మద, రాణి, సుమలత, శ్రీనివాసులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలి కుంటు టీకా శిబిరం

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని అవురాసు పల్లిలో శుక్రవారం పశువైద్యాధికారులు పశువులకు గాలి కుంటూ టీకా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి కల్పన పాల్గొని తెలంగాణ ప్రభుత్వం చేపటిన గొర్రెల ప్రత్యేక పంపిణీ ద్వారా గ్రామానికి మంజూరైన 12గొర్రెల యూనిట్లను పరిశీలించి ఉచిత మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా 150 పశువులకు ఉచిత గాలికుంటూ టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణయ్య, సతీష్, యాదవ సంఘం నాయకులు సత్యం పాల్గొన్నారు.

తాడూరు: పశువుల్లో సీజనల్‌గా వ్యాపించే రోగాలను నివారించేందుకు మండల పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ చికిత్స శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్య అధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అల్లాపూర్, ఏట్‌ధార్‌పల్లిలో శిబిరాలను నిర్వహించి 396 పశువులకు గాలికుంటు నివారణ టీకాలతోపాటు మందులు ఉచితంగా పంపిణీ చేశామని వైద్యాధికారి తెలిపారు. శిబిరంలో జేఈఓ రమేష్, సిబ్బంది మల్లేష్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

తిమ్మాజిపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం పశువులు, గెదేలకు గాలికుంటు నివారణ టీకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సిబ్బంది శ్రీనివాసులు, రవి, స్వామి, నరేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ఐ నీరు విడుదల

బిజినేపల్లిరూరల్: మండల కేంద్రంలోని బిజినేపల్లి చెరువు నుంచి పంట పొలాలకు శుక్రవారం నీటిని విడుదల చేశారు. నాగర్‌కర్నూల్ మార్కెట్ వైస్ చైర్మన్ కిరణ్, ఎంపీపీ రాములు చెరువు తూము నుంచి నీటి విడుదల పంపిణీని ప్రారంభించారు. చెరువు శిఖం కింద ఉన్న భూములలో రైతులు పంటలు పండించుకుని సాగు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేలా చూడాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: శీతాకాల పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టేలా చూడాలని నాగర్‌కర్నూల్ బిజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాశన్నకు శుక్రవారం ఎమ్మార్పీస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీస్ రాష్ట్ర కార్యదర్శి గూట విజయ్ మాట్లాడుతూ బిజేపీ అధికారంలోకి రాక ముందు ఎన్నికల మ్యానిపెస్టోలో అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ ప్రవేశపెట్టి అమోదింప చేస్తామని హామి ఇచ్చారని గుర్తు చేశారు. నాయకులు దేవేందర్, చందు, శ్యాంసుందర్, రామన్, పరమేశ్వర్, బాల్‌రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

తెలకపల్లి: వెనకబడిన తరగతుల వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని టీమాస్ ఫోరం జిల్లా కోకన్వీనర్ గోపాస్ లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శుక్రవారం మండల పరిధిలోని గౌరారంలో టీమాస్ ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర వెనకబడిన తరగతులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దళితులకు మూడెకరాల భూమి ఇవ్వాలని, రైతులకు మార్కెట్ సౌకర్యాలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. టీమాస్ కింద అందరూ ఏకం కావాలని, టీమాస్ కిందే ప్రభుత్వ విధానాలను ఎండగట్టవచ్చని అన్నారు. అనంతరం గ్రామ టీమాస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ చైర్మన్‌గా జూపల్లి బోయ మల్లయ్య, కన్వీనర్‌గా చింతకుంట్ల జంగయ్య, కోకన్వీనర్‌గా మేడెపు పరుశరాములు, కాశన్న, బిరుదు సాయిబాబు, మరో 18మంది స్టీరింగ్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీమాస్ మండల నాయకులు నందిపేట భాస్కర్, కురుమూర్తి, లక్ష్మయ్య, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాస్ లక్ష్మణ్

తుంపర పరికరాలపై అవగాహన

తాడూరు: మండల కేంద్రంలో శుక్రవారం జైన్‌కంపెనీ ఆధ్వర్యంలో స్ప్రింక్లర్లపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో తుంపర పరికరాలకు సంబంధించి ఏ విధంగా దరఖాస్తులు చేసుకోవాలి, దరఖాస్తు చేసుకున్న రైతులకు వచ్చేందుకు ఎంత సమయం పడుతుంది, వచ్చిన పరికరాలను ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై డీసీఓ కాశన్న వివరించారు. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీని స్పష్టంగా తెలియజేయాలన్నారు. హెచ్‌ఓ సౌమ్య, హెచ్‌ఈఓ శివలీల, శ్రీవాస్తవ్, రైతలు, టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు యార రమేష్ పాల్గొన్నారు.

స్ప్రింక్లర్ పైపుల పంపిణీ

నార్‌కర్నూల్‌రూరల్: మండలంలోని పెద్దముదునూరులో శుక్రవారం 100మంది రైతులకు ఉధ్యానవన శాఖాధికారులు స్ప్రింక్లర్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లగంటి వెంకటయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీశైలం, ఉధ్యానవన శాఖాధికారి సౌమ్య, ఎంపీటీసీ రమణరావు, సుబ్బారెడ్డి, రైతులు కురుమూర్తి, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇటీవల జాతీయస్థాయిలో ని ర్వహించిన రామానుజం గణిత పరీక్షపోటీల్లో స్థానిక ప్రీజమ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో బహుమతులు దక్కాయి. రాష్ట్రస్థాయిలో ఆరోతరగతి విద్యార్థిని వంశీ అనురూద్ మొదటి ర్యాంకు, ఎడోతరగతి విశాల్‌రెడ్డికి రెండో ర్యాంక్, సాయి చంద్రకుమూడోర్యాంకు,తొమ్మిదోతరగతి విద్యార్థి సుస్మిత్ నాలుగో ర్యాంకు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యామాన్యం అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తిమ్మాజిపేట: తెలంగాణ యూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను శుక్రవారం తహసీల్దార్ సుదార్శన్‌రెడ్డి అవిష్కరించారు. ఎంఈఓ కార్యాలయ ఆవరణలో సంఘం నాయకులు పాపయ్య, యాదగిరి, విష్ణు, సాయన్న, అభిలాష్, ఆనంద్‌లతో కలిసి క్యాలెండర్‌ను విడుదల చేశారు.



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

విద్యార్థికి ఆర్థిక సాయం

నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సంతోష్‌కుమార్ అనే విద్యార్థికి క్లాస్‌మేట్ క్లబ్ సంస్థ రూ.పదివేల రూపాయలను శుక్రవారం ఆర్థిక సహాయంగా అందజేశారు. చదువుకునేందుకు పేదరికం ఏమాత్రం అడ్డు కాదని, కటిక దరిద్రంలో ఉన్నవారు కూడా ఉన్నత శిఖరాలను తాకేందుకు కష్టపడి చదువుకోవాలని క్లాస్‌మేట్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రేయులుఅన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సంస్థ అడ్వైజర్ విశ్వనాథం, సెక్రెటరీ రాజేష్ పాల్గొన్నారు.

బయోమెట్రిక్ విధానంతో తిప్పలు

నాగర్‌కర్నూల్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వం రేషన్ సరఫరాలో ప్రవేశ పెట్టిన బయోమెట్రిక్ విధానంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని సీపీఐ నాయకులు శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

బీసీలంతా ఐక్యం కావాలి

తెలకపల్లి: బీసీలంతా ఐక్యం కావాలని బీసీ సంఘం అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బోయ రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీసీ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బీసీలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం పది గంటలకు మండల కేంద్రంలోని యోగా భవనంలో బీసీ సంక్షేమ సంఘ కమిటీ సమావేశం ఉంటుందని, బీసీ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో పని చేస్తున్న చాట కూలీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు రామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మార్కెట్‌ను సందర్శించి చాట కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న చాట కూలీలకు గుర్తింపు కార్డులు ఇవ్వక పోవడం దారుణమన్నారు. కనీస వసతులను కల్పి ంచాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు, చాట కూలీ కార్మికులు బాలమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ముగ్గుల పోటీలు

తిమ్మాజిపేట: మండలంలోని ఆర్‌సీతండా, అమ్మపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎంజెఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం కొనసాగాయి. ఆయా గ్రామాల్లో గెలుపొందిన వారికి జయలక్ష్మి, జెడ్పీటీసీ సువర్ణ, సర్పంచ్ కవిత బహుమతులను అందజేశారు. సర్పంచ్ లక్ష్మి, రుక్కమ్మ, ప్రదీప్, వెంకటేష్, రామస్వామి, ప్రకాష్, తిరుపతయ్య గౌడ్, రాజు, యాదయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంఘం కమిటీ ఎన్నిక

తిమ్మాజిపేట: మండలంలో శుక్రవారం భవన నిర్మాణ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా మల్లేష్, వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటేష్, కార్యదర్శిగా తుమ్మలకుంట వెంకటేష్, ఉస్సేన్‌ఖాన్, కో శాధికారిగాకృష్ణ, కార్యదర్శిగా శ్రీనివాసును ఎన్నుకున్నారు.

లక్ష్యాల సాధనకు దేశం అమలు చేసే నిబంధనల రాజపత్రం



బొమ్మనబోయిన శ్రీనివాస్,
సీనియర్ ఫ్యాకల్టీ, హన్మకొండ

స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణం

పరిచయం: రాజ్యం మనుగడకు ప్రధాన ఆధారం.. రాజ్యాంగం. ప్రతి ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం అత్యవసరం. ఒక దేశ ప్రభుత్వ యంత్రాంగ రథచక్రాలు సాఫీగా సాగేందుకు రాజ్యాంగ సూత్రాలు మార్గదర్శకాలుగా పనిచేస్తాయి. రాజ్యాంగం అంటే.. దేశ పాలనా స్వభావం, లక్ష్యాల సాధన కోసం దేశం అమలు చేసే నిబంధనల రాజపత్రం. ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు, ఆసక్తులు, ఆదర్శాలను రాజ్యాంగం ప్రతిబింబిస్తుంది. స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణాన్ని, రాజ్యాంగ సభ ఉద్దేశాలను, భారత రాజ్యాంగ విశిష్ట లక్షణాలను ఈ పాఠం స్థూలంగా వివరిస్తుంది. ఈ పాఠ్యాంశ అధ్యయనం ద్వారా విద్యార్థులు భారత రాజ్యాంగ ప్రాథమిక స్వరూపాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకుంటారు.

- బ్రిటీష్ సామ్రాజ్యవాద, వలసవాద పాలన నుంచి భారతదేశం 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందింది. అయితే స్వాతంత్ర్యానికి ముందే స్వతంత్ర భారత ప్రభుత్వ పాలనా విధానాల రూపకల్పన (రాజ్యాంగం) అవసరాన్ని గుర్తించారు. అందులో భాగంగా రాజ్యాంగ రచనకు 389 మంది మేధావులతో 1946, ఆగస్టులో రాజ్యాంగ సభ (పరిషత్తు) ఏర్పడింది. వీరిలో 292 మంది వివిధ రాష్ట్రాల నుంచి, 93 మంది స్వదేశీ సంస్థానాల నుంచి, 4 గురు చీఫ్ కమిషనర్ (కేంద్రపాలిత) ప్రాంతాల నుంచి ఎన్నికయ్యారు. రాజ్యాంగ సభకు ఎన్నికైన వారిలో వివిధ వర్గాలు, ప్రాంతాలు, పార్టీలకు చెందినవారు ఉన్నారు. రాజ్యాంగ సభకు ఎన్నికైన వారిలో 26 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందినవారితోపాటు 9 మంది మహిళలు కూడా ఉన్నారు. మెజార్టీ సభ్యులు మాత్రం భారత జాతీయ కాంగ్రెస్‌కు చెందినవారు కాగా, తర్వాత స్థానంలో ముస్లింలీగ్ పార్టీకి చెందినవారు ఉన్నారు. అయితే 1947, ఆగస్టు 14న దేశ విభజన జరిగి పాకిస్తాన్ ఆవిర్భవించింది. దాంతో పాకిస్తాన్‌కు చెందిన 90 మంది సభ్యులు తగ్గి, రాజ్యాంగ సభ సభ్యుల సంఖ్య 299కు చేరింది. రాజ్యాంగ సభ సభ్యులంతా ప్రజలతో ప్రత్యక్షంగా ఎన్నికవ్వలేదు. అయినప్పటికీ దేశ ప్రజలందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రాజ్యాంగాన్ని రచించారు. రాజ్యాంగ సభ అధ్యక్షుడిగా బాబూ రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు.

ముఖ్యాంశాలు


- రాజ్యాంగంలో పొందుపరచాల్సిన వివిధ అంశాల అధ్యయనానికి కొన్ని కమిటీలను ఏర్పాటు చేశారు. వాటిలో రాజ్యాంగ ముసాయిదా (డ్రాఫ్టింగ్) కమిటీ అతి ముఖ్యమైంది. దీన్ని 1947, ఆగస్టు 29న ఏర్పాటు చేశారు. డా.బి.ఆర్.అంబేద్కర్ నాయకత్వంలోని 6 గురు సభ్యులు గల ఈ కమిటీ రాజ్యాంగ సభ సమావేశాల చర్చల ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించింది. రాజ్యాంగం 1949, నవంబర్ 26న రాజ్యాంగ సభతో ఆమోదం పొంది 1950, జనవరి 26 నుంచి పూర్తిగా అమల్లోకి వచ్చింది. దీనికి గుర్తుగా ఏటా జనవరి 26న గణతంత్ర (రిపబ్లిక్) దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం.
- ముసాయిదా రాజ్యాంగంలో 315 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉండగా, రాజ్యాంగం ఆమోదం పొందే సమయానికి 395 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి. తర్వాత కాలంలో రాజ్యాంగానికి వివిధ సవరణలు చేయడంతో రాజ్యాంగ అధికరణల సంఖ్య 448కు, షెడ్యూళ్ల సంఖ్య 12కు చేరుకున్నాయి. రాజ్యాంగ రచనకు 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల సమయం పట్టింది.
- ప్రపంచంలో రెండు రకాల ప్రభుత్వాలు ఉన్నాయి. అవి.. పార్లమెంటరీ తరహా ప్రభుత్వ వ్యవస్థ, అధ్యక్ష తరహా ప్రభుత్వ వ్యవస్థ. ఇండియాలో మొదటి పద్ధతి అమల్లో ఉంది. రెండో తరహా వ్యవస్థకు అమెరికా మంచి ఉదాహరణ.
- ఏకీకృత విధానం (ఏకకేంద్ర), సమాఖ్య విధానమనే రెండు రకాల రాజ్యాంగ రూపాలు ఉన్నాయి. భారత రాజ్యాంగం.. సమాఖ్య లక్షణాలతోపాటు ఏకీకృత లక్షణాలు కూడా కలిగుంది. భారతదేశ రాజ్యాంగంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాల రాజ్యాంగాల్లో ఉన్న మంచి సమాఖ్య లక్షణాలు లేవు. అదే సమయంలో బ్రిటన్‌లో ఉన్న పూర్తి ఏకీకృత లక్షణాలు కూడా లేవు.
- భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం.
- భారత రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. సమాజంలోని అన్ని వర్గాలు సమానంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను కల్పించారు.
- పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల ప్రకారం రాజ్యాంగాన్ని సవరించొచ్చు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ ప్రవేశికలో 'సామ్యవాదం, లౌకికత్వం, సమగ్రత' పదాలను చేర్చారు. ఇది రాజ్యాంగ ప్రవేశికకు చేసిన ఏకైక సవరణ.
- కేశవానంద భారతి వర్సెస్ కేరళ (1973) కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలిక సూత్రాల గురించి ప్రస్తావించింది. వీటిని సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

4 మార్కుల ప్రశ్న

1. రాజ్యాంగంలో మౌలిక సూత్రాలుంటాయి. అయితే ప్రజలు వ్యవస్థతో తలపడినప్పుడే సామాజిక మార్పు వస్తుంది. ఈ వ్యాఖ్యతో మీరు ఏకీభవిస్తారా? మీ కారణాలను పేర్కొనండి?
(సమకాలీన అంశాలపై ప్రతిస్పందన – ప్రశ్నించడం)

జ: పై వ్యాఖ్యతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. ఏ దేశ రాజ్యాంగంలోఅయినా కొన్ని మౌలిక సూత్రాలుంటాయి. అవి.. రాజ్యాంగ స్వరూపాన్ని, ఉద్దేశాలను ప్రతిబింబిస్తాయి. రాజ్యాంగ ప్రవేశికలో పొందుపర్చిన మౌలిక సూత్రాల లక్ష్యాలకు అనుగుణంగా వ్యవస్థలో మార్పులు రావాలి. దీంతోపాటు ప్రజల ఆకాంక్షలు నెరవేరాల్సిన అవసరం కూడా ఉంది. ప్రజలు రాజ్యాంగ పద్ధతిలో వ్యవస్థతో తలపడినప్పుడే ఈ సామాజిక మార్పు సాధ్యమవుతుంది. నేను ఈ వాస్తవాలతో ఏకీభవించడానికి కారణాలు..

- దేశ సార్వభౌమాధికారం ప్రజల చేతిలో ఉంటుంది. ప్రజలే పాలకులు, ప్రజల కోసం ప్రజలే చట్టాలు చేసుకుంటారు. ప్రజలతో కూడిందే వ్యవస్థ. ఇలాంటి వ్యవస్థలో అభివృద్ధి పూర్వక మార్పులకు ప్రజలు సిద్ధపడాలి.
- లౌకిక, సామ్యవాద సూత్రాలు జాతీయ సమైక్యతను, ప్రజల సంక్షేమాన్ని పెంపొందిస్తాయి. పాలనా వ్యవస్థ వీటిని అమలు చేయాలి. ప్రజలు జాగరూకులై అభివృద్ధి ఫలాలను అందుకోవాలి. పాలనా వ్యవస్థ ప్రజల కోరికలు, ఆకాంక్షలను పట్టించుకోనప్పుడు ప్రజలే ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి.
- రాజ్యాంగ సూత్రాల ప్రకారం పౌరులందరికీ సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయాన్ని అందించాలి. అలాగే పౌరుల్లో సమానత్వం, సౌభ్రాతృత్వాలను పెంపొందించాలి. వీటి ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రజల జీవితాల్లో ఫలప్రదమైన మార్పులు సంభవిస్తాయి. తద్వారా సామాజిక మార్పును ఆశించవచ్చు.



- రాజ్యాంగ మౌలిక సూత్రాలను పాలనా వ్యవస్థ విస్మరించినప్పుడు ప్రజలు సమూహంగా ఏర్పడి సామాజిక వ్యవస్థలో మార్పు కోసం ప్రజాప్రతినిధులతో కూడిన పాలనా వ్యవస్థతో తలపడాల్సి వస్తుంది. రాజ్యాంగం కూడా దీన్నే కోరుకుంటుంది. పాలనా వ్యవస్థకు సామాజిక వ్యవస్థే ఆధారం.

2 మార్కుల ప్రశ్నలు

1. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామాలకు ఎలాంటి స్వయంప్రతిపత్తి కల్పించారో తెలపండి.
(సమాచార సేకరణ నైపుణ్యం)

జ: భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న 40వ ప్రకరణ.. పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు, గ్రామాలకు స్వయం పాలనాధికారాల గురించి ప్రస్తావించింది. దానికి అనుగుణంగా పార్లమెంట్ 1992లో 73వ రాజ్యాంగ సవరణ చేసింది. ఇది 1993, ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. 73వ రాజ్యాంగ సవరణ.. గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తిని కల్పించింది. దీంతోపాటు గ్రామ స్వయంపాలనకు అవసరమైన అధికారాలు, విధులు, బాధ్యతలను పంచాయతీ వ్యవస్థలకు కల్పించింది. వాటిలో ముఖ్యమైనవి.. గ్రామసభ ఏర్పాటు, ప్రత్యక్ష ఎన్నికలు, సీట్ల రిజర్వేషన్, మూడంచెల వ్యవస్థ, రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు, నిర్దేశిత పదవీకాలం తదితరాలు.

2. భారత్, అమెరికా సమాఖ్య వ్యవస్థల మధ్య ముఖ్య భేదాలను పేర్కొనండి. *(విషయావగాహన)*

జ: అమెరికా, ఇండియాల్లో సమాఖ్య వ్యవస్థ అమల్లో ఉంది. ఈ దేశాల్లో అనుసరిస్తున్న సమాఖ్య విధానాల్లో స్పష్టమైన తేడాలున్నాయి. అవి..

భారత సమాఖ్య వ్యవస్థ: 1. ఏక పౌరసత్వం, ద్వంద్వ ప్రభుత్వాలు, ఏక న్యాయ వ్యవస్థ, 2. సివిల్, క్రిమినల్ చట్టాల్లో సారూప్యత, ఏక విధానం, 3. అఖిల భారత సర్వీసులు.

అమెరికా సమాఖ్య వ్యవస్థ:
1. ద్వంద్వ పౌరసత్వం, ద్వంద్వ ప్రభుత్వాలు, ప్రత్యేక న్యాయ వ్యవస్థలు. 2. చట్టాల్లో సారూప్యత, ఏక విధానం లేదు 3. ప్రత్యేకంగా వేర్వేరు సర్వీసులు.

3. అధ్యక్ష తరహా, పార్లమెంటరీ తరహా వ్యవస్థల మధ్య తేడా ఏమిటి?

జ: అధ్యక్ష తరహా వ్యవస్థ: దేశ పరిపాలనాధికారాలన్నీ అధ్యక్షుడి చేతిలోనే ఉండే ప్రభుత్వ వ్యవస్థ. అధ్యక్షుణ్ని ప్రభుత్వాధినేత, దేశాధినేత అని కూడా పిలుస్తారు. అధ్యక్షుడు ప్రభుత్వ వాస్తవ కార్యనిర్వహణాధికారిగా ఉంటాడు. **ఉదా:** అమెరికా

పార్లమెంటరీ తరహా వ్యవస్థ: పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా మెజారిటీ సీట్లు పొందిన పార్టీ లేదా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాలను మంత్రిమండలి నిర్వర్తిస్తుంది. ఈ విధంగా శాసననిర్మాణ శాఖ, కార్యనిర్వాహక శాఖల అధికారాల సమన్వయంతో కూడిన వ్యవస్థను పార్లమెంటరీ తరహా ప్రభుత్వ వ్యవస్థ అంటారు. మంత్రిమండలి నాయకుడిని ప్రధానమంత్రి అంటారు. ఆయనే ప్రభుత్వాధినేతగా ఉంటారు. ఆయన సలహాలు, సూచనల మేరకే దేశాధినేత అయిన అధ్యక్షుడు (రాష్ట్రపతి) నడుచుకోవాల్సి ఉంటుంది. ఈ వ్యవస్థలో వాస్తవ కార్యనిర్వాహణాధికారి ప్రధానమంత్రి.
ఉదా: బ్రిటన్, ఇండియా

1 మార్కు ప్రశ్నలు

1. రాజ్యాంగ ముసాయిదా సంఘం అంటే ఏమిటి? దాని చైర్మన్ ఎవరు?

జ: రాజ్యాంగ సభ నియమించిన వివిధ కమిటీల నివేదికలపై రాజ్యాంగ సభ తీసుకున్న నిర్ణయాల సారాంశం ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించే మేధావుల బృందం (కమిటీ). భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ డా.బి.ఆర్. అంబేద్కర్.

2. రాజ్యాంగ ప్రవేశిక అంటే ఏమిటి?

జ: రాజ్యాంగ స్థూల స్వరూపాన్ని క్లుప్తంగా పరిచయ వాక్యాలతో చెప్పే పత్రమే రాజ్యాంగ ప్రవేశిక. ఇది రాజ్యాంగ మౌలిక సూత్రాలను తెలుపుతోంది. దీన్ని రాజ్యాంగానికి దర్పణంగా, ముందుమాటగా కూడా పేర్కొంటారు.

3. ఏకీకృత విధానం, సమాఖ్య విధానం మధ్య ప్రధానమైన తేడా ఏమిటి?

జ: ఏకీకృత విధానం: దేశ పాలనాధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉండటం. ఇది ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థ ముఖ్య లక్షణం. **ఉదా:** బ్రిటన్.
సమాఖ్య విధానం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలు స్పష్టంగా విభజితమై ఉండటం.
ఉదా: అమెరికా, ఇండియా మొదలైనవి.

4. ఉమ్మడి జాబితా అంటే ఏమిటో తెలపండి.

జ: ఉమ్మడి జాబితా: కేంద్రానికి, రాష్ట్రాలకు ఉమ్మడిగా గల అధికారాలను తెలిపే అంశాల జాబితాను ఉమ్మడి జాబితా అంటారు. సమాఖ్య వ్యవస్థలో కేంద్రం, రాష్ట్రాల మధ్య చట్టాలు చేసే అధికారాలు విభజితమై ఉంటాయి. **ఉదా:** భారత రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో 47 అంశాలను పేర్కొన్నారు.

5. రాజ్యాంగ సవరణ అంటే ఏమిటి?

జ: రాజ్యాంగబద్ధంగా దేశ మౌలిక రాజ్యాంగంలో చేసే అవసరమైన మార్పునే రాజ్యాంగ సవరణ అంటారు. సవరణ అంటే రాజ్యాంగంలో అప్పటికే ఉన్న అధికరణలను తొలగించవచ్చు లేదా మార్చవచ్చు, కొత్తవాటిని చేర్చవచ్చు. దేశాభివృద్ధికి అవసరమైన రాజ్యాంగ సవరణలను చట్టసభలు ఆమోదిస్తాయి.

'నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను'



మగ్గం వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
నాగార్జున ప్రభుత్వ డిగ్రీ
కళాశాల, నల్లగొండ



పోటీ పరీక్షల ప్రత్యేకం
వరల్డ్ హిస్టరీ

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో 'అక్షరాజ్య కూటమి'లోని దేశాలేవి?
1) నార్వే, స్వీడన్, డెన్మార్క్
2) ఇటలీ, జర్మనీ, జపాన్
3) అమెరికా, చైనా, స్పెయిన్
4) రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్

2. 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా' తొలి సమావేశం ఎక్కడ జరిగింది?
1) బీజింగ్ 2) నాన్‌కింగ్
3) షాంఘై 4) పెకింగ్

3. ఇటలీ ఏకీకరణోద్యమంలో కీలక పాత్ర పోషించిన గారీబాల్డీ ఎక్కడ జన్మించాడు?
1) నైస్ 2) టస్కనీ
3) సార్డీనియా 4) వెనిస్

4. ముస్తాఫ కెమాల్ పాషాకు ఉన్న బిరుదు అయిన 'కెమాల్' అంటే?
1) వేగు చుక్క 2) పరిపూర్ణుడు
3) రక్షకుడు 4) విమోచకుడు

5. కింది వాటిలో సరైన జత ఏది?
1) హిట్లర్ ఆత్మహత్య -1945
2) ఐక్యరాజ్య సమితి సచివాలయం – న్యూయార్క్
3) ఉదయించే సూర్యుడి భూమి – జపాన్
4) పైవన్నీ సరైనవే

6. అడాల్ఫ్ హిట్లర్ ఎవరి తత్వ సిద్ధాంతాలకు ప్రభావితుడయ్యాడు?
1) హిడెన్‌బర్గ్ 2) ముత్సుహిటో
3) జోసెఫ్ గోబెల్స్ 4) నీషి

7. కింది వాటిలో నల్లమందు యుద్ధాలు ఏయే దేశాల మధ్య జరిగాయి?
1) చైనా – బ్రిటన్
2) జర్మనీ – ఆస్ట్రియా
3) జపాన్ – అమెరికా
4) ఫ్రాన్స్ – ఇటలీ

8. 'చైనా జాతి పిత' అని ఎవరిని పిలిచారు?
1) సన్ యెట్ సేన్ 2) చౌ ఎన్ లై
3) చూటే 4) మావో సే టుంగ్

9. రెండో విక్టర్ ఇమ్మాన్యుయేల్ ఏ ప్రాంత పాలకుడిగా కీర్తిగాంచి నిజాయితీపరుడైన రాజుగా ప్రసిద్ధి చెందాడు?
1) సార్డీనియా 2) ఫ్లొరెన్స్
3) వెనిస్ 4) సెవాయ్

10. 'నల్లచేయి' అనే గుర్తు ఉన్న 'నరోరా ఒబ్రానా సంస్థ' ఏ దేశ విప్లవ సంస్థ?
1) బోస్నియా 2) సెర్బియా
3) ఆస్ట్రియా 4) మొరాకో

11. కౌంట్ కవూర్ స్థాపించిన పత్రిక ఏది?
1) పీపుల్స్ అబ్జర్వర్
2) ఇల్ రిసార్జిమెంటో
3) ఇస్క్రా 4) అవంతి

12. 'మతం లేని రాజ్యం దిక్సూచి లేని నౌక లాంటిది' అని అన్నదెవరు?
1) మెటర్నిక్ 2) ఆటోవాన్ బిస్మార్క్
3) మొదటి విలియం
4) నెపోలియన్ బోనాపార్టే

13. ఆస్ట్రియా యువరాజు 'ఆర్చ్‌డ్యూక్ ఫెర్డినాండ్'ను ఎక్కడ హత్య చేశారు?
1) సరాజెవో 2) వార్సా
3) బెర్న్ 4) జెనీవా

14. ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ బోనా పార్టే 'కంకార్డేట్' అనే మత ఒప్పందం ఎవరితో చేసుకున్నాడు?
1) పోప్ 10వ లియో
2) పోప్ 6వ అలెగ్జాండర్
3) పోప్ 7వ ఫయిస్
4) పోప్ 5వ ఫయిస్

15. వర్సయిల్స్ సంధి సమావేశంలో పాల్గొన్న ఇటలీ ప్రధాన మంత్రి ఎవరు?
1) ఆర్లాండో 2) జార్జ్ క్లెమెన్సో
3) లాయిడ్ జార్జ్ 4) ఉడ్రో విల్సన్

16. 'యుద్ధం ప్రష్యన్‌ల జాతీయ పరిశ్రమ' అని అన్నదెవరు?
1) డాంటన్ 2) మిరాబూ
3) రాబిస్పియర్ 4) లఫాయితే

17. కింది వాటిలో జోసెఫ్ మాజినీ స్థాపించిన సంస్థ?
1) ఎర్ర చొక్కాల దళం
2) నల్ల చొక్కాల దళం
3) తుంగ్ మెంగ్ హుయి విప్లవ సంస్థ
4) యంగ్ ఇటలీ సంస్థ

18. జపాన్‌లో 'షింటో' ప్రాచీన మతం. 'షింటో' అంటే?
1) విప్లవ భూమి 2) పవిత్ర భూమి
3) దేవతల మార్గం
4) దైవ శాపగ్రస్థ దేశం

19. నెపోలియన్ బోనా పార్టే ఏ తేదీన జన్మించాడు?
1) 1769 ఆగస్టు 15
2) 1779 జనవరి 26
3) 1789 మార్చి 19
4) 1766 అక్టోబర్ 14

20. 'ఆసియా ఆసియావాసులకే' అనే నినాదం ఏ దేశానిది?
1) జపాన్ 2) చైనా
3) భారత్ 4) శ్రీలంక

21. నెపోలియన్ బోనాపార్టేకి సంబంధించి కింది వాటిలో సరైంది?
1) 1804లో ఫ్రాన్స్ చక్రవర్తిగా అధికారం చేపట్టాడు
2) రెండో జస్టీయన్‌గా కీర్తి పొందాడు
3) 1815లో వాటర్లూ యుద్ధం చేశాడు
4) పైవన్నీ సరైనవే

22. వ్యాపార నిమిత్తం చైనాలో అడుగుపెట్టిన తొలి ఐరోపావాసులు ఎవరు?
1) బ్రిటిషర్లు 2) ఫ్రెంచ్‌వారు
3) పోర్చుగీస్‌వారు 4) డచ్చీవారు

23. నెపోలియన్ బోనాపార్టే 'భూఖండ విధానం' ఏ దేశానికి వ్యతిరేకంగా చేపట్టాడు?
1) ప్రష్యా 2) ఇంగ్లండ్
3) రష్యా 3) ఆస్ట్రియా

24. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో 21 డిమాండ్‌ల పత్రాన్ని జపాన్ ఏ దేశానికి పంపింది?
1) ఇంగ్లండ్ 2) రష్యా
3) ఫ్రాన్స్ 4) చైనా

25. టర్కీ.. నానాజాతి సమితిలో ఎప్పుడు సభ్యత్వం పొందింది?
1) 1932 2) 1934
3) 1936 4) 1938

26. 'బ్లడ్ అండ్ ఐరన్' పాలసీ సృష్టికర్త ఎవరు?
1) జోసెఫ్ మాజినీ
2) డాక్టర్ సన్‌యేట్‌సేన్
3) ఆటోవాన్ బిస్మార్క్
4) మూడో నెపోలియన్

27. 'స్త్రీ సంపూర్ణ వ్యక్తిత్వానికి మాతృత్వం ఎలాంటిదో, సంపూర్ణ వికాసానికి యుద్ధం అలాంటిది' అని అన్నదెవరు?
1) లెనిన్ 2) స్టాలిన్
3) అడాల్ఫ్ హిట్లర్
4) బెనిటో ముస్సోలినీ

28. నానాజాతి సమితి సచివాలయం కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
1) జెనీవా 2) న్యూయార్క్
3) బెర్లిన్ 4) మాస్కో

29. అడాల్ఫ్ హిట్లర్ స్థాపించిన 'రహస్య పోలీస్ దళం' ఏది?
1) రీచ్‌స్టాగ్ 2) థర్డ్ సెక్షన్
3) గెస్టాపో 4) ఆగ్‌పూ

30. నానాజాతి సమితిని ఎప్పుడు స్థాపించారు?
1) 1918 2) 1920
3) 1922 4) 1924

31. 'ప్రాచ్య విజ్ఞాన కోశం' అని ఏ దేశాన్ని పిలుస్తారు?
1) శ్రీలంక 2) జపాన్
3) చైనా 4) బర్మా

32. కింది వాటిలో అడాల్ఫ్ హిట్లర్ రాసిన గ్రంథం ఏది?
1) ఏప్రిల్ థీసిస్ 2) మీన్‌కాంఫ్
3) ద స్టడీ ఆఫ్ ఫిజికల్ కల్చర్
4) దాస్ కాపిటల్

33. బెనిటో ముస్సోలిని.. ఫాసిస్ట్ పార్టీని ఎక్కడ స్థాపించాడు?
1) వెనిస్ 2) మిలాన్
3) ఫ్లొరెన్స్ 4) రోమ్

34. 'కార్బోనరీ' అంటే?
1) సంగీత బృందం 2) గ్రామీణ రైతులు
3) బొగ్గును కాల్చేవారు
4) యుద్ధ ఖైదీలు

35. 'టర్కీ టర్కులకే' అనే నినాదం ఇచ్చిందెవరు?
1) ఇస్మత్ ఇనోను
2) ముస్తాఫ కెమాల్ పాషా
3) అలీ ఫతేహి ఒక్యార్
4) జెనిటో జౌరజ్

36. ఐరోపా ఖండంలో వియన్నా కాంగ్రెస్ సమావేశం ఎప్పుడు జరిగింది?
1) 1815 2) 1817
3) 1819 4) 1821

37. కింది వాటిలో సరైన జత ఏది?
1) ఫ్యూరర్ – అడాల్ఫ్ హిట్లర్
2) ఇల్‌డ్యూస్ – బెనిటో ముస్సోలిని
3) అటాటర్క్ – ముస్తాఫా కెమాల్ పాషా
4) పైవన్నీ సరైనవే

38. పెరల్ హార్బర్ సంఘటన ఏ తేదీన జరిగింది?
1) 1941 డిసెంబర్ 7
2) 1942 డిసెంబర్ 17
3) 1943 ఆగస్టు 16
4) 1944 మార్చి 19

39. ఫాసిస్ట్ పార్టీ చిహ్నాలు ఏవి?
1) సూర్యుడు, నాగలి
2) స్వస్తిక్, నక్షత్రం 3) పావురం, పులి
4) పుల్లల మోపు, గొడ్డలి

40. 'ఇటలీ జాతీయోద్యమానికి ఆత్మ' అని ఎవరిని పేర్కొంటారు?
1) మాజినీ 2) గారీబాల్డీ
3) కౌంట్‌కవూర్ 4) విన్సెంట్ జియోబర్టీ

41. చైనాలో 'బాక్సర్ తిరుగుబాటు' ఎప్పుడు జరిగింది?
1) 1900 2) 1902
3) 1904 4) 1906

42. కింది వాటిలో సరైన జత ఏది?
1) సమురాయ్ – సైన్యాధికార వర్గం (జపాన్)
2) మంచూ – చైనాను పాలించిన చివరి రాజవంశం
3) 20వ శతాబ్దపు కన్ఫ్యూషియస్ – సన్‌యెట్‌సేన్
4) పైవన్నీ సరైనవే

43. అడాల్ఫ్ హిట్లర్ తన ఆర్థికమంత్రిగా ఎవరిని నియమించాడు?
1) లియోపాల్డ్ 2) బెనెడెట్టి
3) షాట్ 4) వాన్‌రూన్

44. 'మెయిజీ' అంటే?
1) విజ్ఞతతో వ్యవహరించడం
2) నియంతృత్వ పాలన
3) పెద్ద భూస్వామ్య వర్గం
4) దైవలోక చక్రవర్తి

45. చౌఎన్‌లై ప్రధానిగా 'ప్రజా రిపబ్లిక్' ఏ దేశంలో ఏర్పడింది?
1) జపాన్ 2) చైనా
3) ఆస్ట్రియా 4) ప్రష్యా

46. ఆటోవాన్ బిస్మార్క్ ప్రష్యా చాన్స్‌లర్‌గా ఎప్పుడు పదవీ బాధ్యతలు చేపట్టాడు?
1) 1862 2) 1864
3) 1866 4) 1868

47. 'నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను' అని అన్నదెవరు?
1) మొదటి విలియం
2) 16వ లూయి 3) ముత్సుహిటో
4) నెపోలియన్ బోనాపార్టే

48. ఫ్రాంక్‌ఫర్ట్ సంధి(1871) ఏయే దేశాల మధ్య జరిగింది?
1) ఫ్రాన్స్, ప్రష్యా 2) ప్రష్యా, డెన్మార్క్
3) డెన్మార్క్, ఆస్ట్రియా
4) ఫ్రాన్స్, ఆస్ట్రియా

49. 'ఐరోపా జబ్బు మనిషి' అని ఏ దేశానికి పేరు ఉంది?
1) జర్మనీ 2) టర్కీ
3) ఇంగ్లండ్ 4) ఫ్రాన్స్

50. నెపోలియన్ బోనాపార్టే.. ప్రెస్‌బర్గ్ సంధి ఏ దేశంతో చేసుకున్నాడు?
1) పోలాండ్ 2) డెన్మార్క్
3) రష్యా 4) ఆస్ట్రియా

51. మొదటి ప్రపంచ యుద్ధం జరిగిన కాలం?
1) 1914-1918 2) 1915-1918
3) 1914-1917 4) 1914-1924

52. 'బ్యాటిల్ ఆఫ్ నేషన్స్' అని ఏ యుద్ధానికి పేరు?
1) లీప్‌జిగ్ యుద్ధం 2) వాటర్లూ యుద్ధం
3) జీనా యుద్ధం 4) ఆస్టర్లిట్జ్ యుద్ధం

53. 'పొడెస్టాస్ అనే ప్రభుత్వ ఉద్యోగుల పాలనలో స్థానిక స్వపరిపాలనా సంస్థలు ఏ దేశంలో పనిచేశాయి?
1) జర్మనీ 2) ఇటలీ
3) ఆస్ట్రియా 4) రష్యా

54. ముస్తాఫ కెమాల్ పాషా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఏ ప్రాంతంలో బ్రిటన్ దాడిని తిప్పికొట్టాడు?
1) కైరో 2) అంకారా
3) గాల్లిపోలి 4) టోక్యో

55. నెపోలియన్ బోనా పార్టే.. స్పెయిన్ పాలకుడిగా నియమించిన అతని సోదరుడు ఎవరు?
1) జెరోమ్ 2) టాలీరాండ్
3) ఆర్థర్ వెల్లస్లీ 4) జోసెఫ్

56. రష్యాలో ట్రాట్‌స్కీ, ఆయన అనుచరులు శత్రు సైన్యాలను ఏమని పిలిచేవారు?
1) తెల్ల సైన్యం 2) పచ్చ సైన్యం
3) నీలి సైన్యం 4) ఎర్ర సైన్యం


57. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో భారత్‌లో ఏ స్వాతంత్ర్యోద్యమం కీర్తిగాంచింది?
1) శాసనోల్లంఘనోద్యమం
2) సహాయ నిరాకరణోద్యమం
3) సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం
4) క్విట్ ఇండియా ఉద్యమం

58. చైనాను పాలించిన మంచూ రాజవంశ ఆఖరి చక్రవర్తి ఎవరు?
1) పూయీ 2) షియోవాంగ్టీ
3) యువాన్ 4) ముత్సుహిటో

59. జపాన్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకుని, (1945) మిత్ర రాజ్యాల సైన్యానికి నాయకత్వం వహించింది ఎవరు?
1) జార్జి వాషింగ్టన్ 2) ట్రూమన్
3) జనరల్ మెకార్థర్
4) ఐసన్ హోవర్

సమాధానాలు

1) 2	2) 3	3) 1	4) 2	5) 4
6) 4	7) 1	8) 1	9) 1	10) 2
11) 2	12) 4	13) 1	14) 3	15) 1
16) 2	17) 4	18) 3	19) 1	20) 1
21) 4	22) 3	23) 2	24) 4	25) 1
26) 3	27) 4	28) 1	29) 3	30) 2
31) 3	32) 2	33) 2	34) 3	35) 2
36) 1	37) 4	38) 1	39) 4	40) 1
41) 1	42) 4	43) 3	44) 1	45) 2
46) 1	47) 4	48) 1	49) 2	50) 4
51) 1	52) 1	53) 2	54) 3	55) 4
56) 1	57) 4	58) 1	59) 3	



నాన్నా చెప్పవా

బుల్లెట్ ప్రూఫ్ రహస్యం ఏమిటి?



బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ దూసుకుపోకుండా ఒక రకమైన ప్లాస్టిక్ నిరోధిస్తుంది. దానిని లామినేట్ అంటారు. మొదట గాజు, ఆ తరువాత ప్లాస్టిక్, మళ్ళీ గాజు ఇలా బుల్లెట్ ప్రూఫ్ అమరిక ఉంటుంది. ఇది మామూలు అద్దం కంటే మందంగా ఉంటుంది. ఇందులో మధ్యలో వాడే లామినేట్ ప్లాస్టిక్ పాలీ కార్బనేట్ పదార్థం. ఇది చాలా దృఢమైనదే కాక పారదర్శకంగానూ ఉంటుంది. కవచం వంటి ఈ బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ (తూటా) దూసుకు రాలేదు. మొదటి పొర అయిన గాజు లోంచి చొచ్చుకుపోయినా ఆ తర్వాత పొర అయిన పాలీ కార్బనేట్ లామినేట్ బుల్లెట్‌కు గల దూసుకుపోయే శక్తిని అడ్డుకుంటుంది. దీంతో బుల్లెట్ లోనికి చొచ్చుకు పోలేదు.

గాలితో పని లేని జీవులున్నాయా?



ఉన్నాయనే అంటున్నారు పరిశోధకులు. మధ్యధరా సముద్ర గర్భంలో ఏ మాత్రమూ ప్రాణ వాయువు జాడ లేని ప్రాంతంలో కొత్త జీవరాశిని పరిశోధకులు కనుగొన్నట్టు సైన్సు డైలీ ప్రకటించింది. చుట్టూ విషపూరిత సల్ఫైడ్‌లు కలిగిన వాతావరణంలో సముద్రగర్భంలో ఉన్న ఆ జీవులను లోరిసీఫెరా వర్గంలో చేర్చారు. ఈ జీవుల్లో జీవక్రియలు బాగానే సాగుతున్నాయని, అంతే కాకుండా ఏ మాత్రమూ ప్రాణ వాయువు లేని ప్రాంతంలో పునరుత్పత్తి ప్రక్రియ కూడా ఈ జీవుల్లో సహజంగా సాగుతోందని గుర్తించారు. ప్రస్తుతం వీటిపై పరిశోధన కొనసాగుతోంది.


రంగులు వేద్దాం








పైన ఉన్న వింత మనిషి కింద ఉన్న పండు దగ్గరికి రావాలి. దారి చూపండి.



పైన ఉన్న రెండు బొమ్మల మధ్య 15 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.

పూరించండి




పూరించండి – జవాబు
Vampire Bat

కింది పజిల్‌లో పక్కన ఉన్న బొమ్మల పేర్లు అడ్డం, నిలువులుగా ఎక్కడ ఉన్నాయో గుర్తించండి.

toy	b	o	a	t	p	p
boat	x	y	b	c	e	o
star	f	s	e	m	a	t
potty	s	t	a	o	c	t
peach	y	a	c	s	h	y
beach	p	r	h	y	o	t

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున బొమ్మ గీయండి



నాగర్‌కర్నూల్ | శనివారం
జనవరి | 6 | 2018
సాక్షి

చదువుతోనే సంస్కారం

- మనిషి తలచుకుంటే ఏదైనా సాధ్యమే
- చదువు ఎన్నో అవకాశాలకు మార్గం
- విద్యా ప్రేరణ సదస్సులో మంత్రి జూపల్లి
- విజయానికి తొలి అడుగు పదో తరగతే: కలెక్టర్ శ్రీధర్



విద్యార్థులకు ప్రేరణ కల్పిస్తున్న సైకాలజిస్ట్ లక్ష్మణ్

కొల్లాపూర్ రూరల్: చదువు ఉంటే మనిషి తనను తాను సంస్కరించుకోవచ్చని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం కొల్లాపూర్‌లోని రాజావారి బంగ్లా సమీపంలో విద్యాప్రేరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి తలచుకుంటే ప్రపంచంలో ఏదైన సాధించగలుగుతాడని చెప్పారు. చదువు ఉద్యోగాల కోసం కాదని, ఎన్నో అవకాశాలకు నిలయంగా ఉంటుందని అన్నారు. కష్టపడి చదివితే అన్నీ వాటంతట అవే వస్తాయన్నారు. పదో తరగతి నుంచి విద్యార్థుల దశాదిశ మారుతుందన్నారు. ప్రతి ఇంట్లో పేపర్, డిక్షనరీ, వారపత్రికలు ఉండాలన్నారు. ఈ రోజుల్లో సైన్స్ చాలా అభివృద్ధి చెందిందని, అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే చదువులో ముందుకు సాగాలన్నారు. తెలంగాణ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటాన్ని సాగించారని, లక్ష్యంతో ప్రత్యేక రాష్ట్రం సాధించారని గుర్తు చేశారు. ప్రస్తుతం సైన్స్ అభివృద్ధి చెంది గ్రహాలపై ఎందరో కాలుమోపి వస్తున్నారని అన్నారు. మనదేశానికంటే తర్వాత స్వాతంత్ర్యం వచ్చిన దేశాలు చాలా ముందుకు పోయాయని, మనం ఇంకా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు గడుస్తున్నా చదువు ఏ స్థాయిలో



ప్రేరణ తరగతులకు హాజరైన విద్యార్థులు

ఉండాలో ఆ స్థాయికి నేటికీ రాలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 62 శాతం యువత ఉందని, అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చేందుకు యువత ముందుకు రావాలన్నారు. విద్యార్థులు పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు నెలకోసారి తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రేరణా తరగతులు నిర్వహించాలని సూచించారు.

ప్రేరణ తరగతులు నిర్వహించాలి..

పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించాలని స్థానిక విద్యాధికారులకు కలెక్టర్ సూచించారు. జీవితంలో విజయం సాధించేందుకు తొలి అడుగు పదో తరగతి నుంచే మొదలవుతుందని అన్నారు. నేర్చుకున్నది చెప్పినప్పుడే పరీక్షలో రాయడానికి వస్తుందని పిల్లలకు సూచించారు. చదువుకున్న విషయాన్ని సాధన చేయాలన్నారు. ప్రతి రోజూ ఆరు నుంచి ఎనిమిది గంటలు వరకు పడుకోవాలని, గంటపాటు వ్యాయామం చేయాలని, పది గంటలు చదవాలని సూచిం చారు. మెదడు ప్రశాంతంగా ఉండాలంటే నచ్చిన పని చేయాలన్నారు. అవకాశాలు అన్నిసార్లు రావని, వచ్చిన సందర్భాల్లో అందిపుచ్చుకుంటేనే రాణిస్తారని అన్నారు. అనంతరం సైకాలజిస్ట్ లక్ష్మణ్ విద్యార్థులకు దిశా నిర్దేశానికి సంబంధించిన ప్రేరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ జనార్దన్‌రావు అధ్యక్షత వహించగా, ఇంటర్ నోడల్ అధికారి వెంకటరమణ, పీఓ వెంకటయ్య, జెడ్పీటీసీ హన్మంతునాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ సరస్వతి, నగర కమిషనర్ రామలింగం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ ఎక్బాల్, ఫాదర్ అలెక్స్, ఆయా గ్రామాల్లోని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామపంచాయతీని తనిఖీ చేయాలి



ఈఓపీఆర్డీలతో మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వర్‌రావు

నాగర్‌కర్నూల్ టౌన్: జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీని ఆయా మండలాల ఈఓపీఆర్డీలు ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు తనిఖీ చేయాలని, అది ఫిబ్రవరి చివరికల్లా పూర్తి కావాలని డీపీఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఈఓపీఆర్డీలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈఓపీఆర్డీలు ప్రతి గ్రామ పంచాయతీని తనిఖీ చేసి ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు తగిన సూచనలు అందించాలన్నారు. ఫిబ్రవరి చివరి నాటికి జిల్లాలో వందశాతం పన్ను వసూళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సంక్రాంతి పండుగ తర్వాత వరుసగా జాతరలు జరగనున్నందున ఆయా గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీలు, జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల్లో ఆత్మస్థైర్యం నింపుతున్న ప్రభుత్వం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల్లో ఆత్మస్థైర్యం నింపుతోందని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మాజీ మంత్రి పి.రాములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారీ వ్యవస్థను ప్రోత్సహించేది లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దళారీ వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. రైతుల పక్షపాతిగా సీఎం కేసీఆర్ నిలిచారని, ఎకరాకు రూ.8వేలు, 24గంటల విద్యు త్ సరఫరా చేస్తూ మేలు చేస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్వింటాల్‌కు రూ.5,450 ప్రభు త్వం మద్దతు ఇస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు.

రేపు అచ్చంపేటకు డిప్యూటీ సీఎం రాక

అచ్చంపేట, అమ్రాబాద్ మండలంలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఈనెల 7న ఆదివారం అచ్చంపేటకు రానున్నారని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు అమ్రాబాద్, 2 గంటలకు అచ్చంపేటకు, సాయంత్రం పట్టణంలోని అంగిరేకుల శేఖరయ్య ఫంక్షన్ హాలులో కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పోశం జయంతి గణేష్, నగరపంచాయతీ చైర్మన్ తులసీరాం, నాయకులు మనోహర్, నర్సింహగౌడ్, వెంకట్‌రెడ్డి, అమీనుద్దీన్, శివ, మార్కెట్ సెక్రటరీ రామావత్ సరోజ, పీఏసీఎస్ సీఈఓ ఎల్లయ్య, సిబ్బంది మల్లేష్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయంతోనే సమగ్రాభివృద్ధి

లింగాల: రాష్ట్రంలో సామాజిక న్యాయం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమని టీమాస్ జిల్లా కన్వీనర్ దేశ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ధారారంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జనాభాలో 93శాతం మంది ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఎంబీసీ, మైనార్టీ వర్గాల వారు ఉన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే కొన్ని పథకాలు, కొంత ఆర్థిక సహాయం చేస్తే సరిపోదని అన్నారు. జనాభాకు అనుగుణంగా ప్రతి దానిలో వాటా ఉండాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడానికి ప్రతి పల్లెకు టీమాస్ కార్యక్తలు వస్తున్నారని, వారికి సహకరించాలని కోరారు. ఈ నెల 10వరకు సర్వే పూర్తి అవుతుందని, 11, 12 తేదీలలో అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం, 16 నుంచి 19వరకు మండల కేంద్రాలలో రిలే దీక్షలు, 22న కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీమాస్ కమిటీలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు అరుణ్‌కుమార్, బోట్కరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌లెన్సీ అవార్డుకు రాములు ఎంపిక



కందనూలు/నాగర్‌కర్నూల్ టౌన్: స్వామి వివేకానంద 155 జయంతి సందర్భంగా జిల్లాకేంద్రానికి చెందిన జాతీయ రంగస్థల కళాకారుడు డి.రాములును ఎక్స్‌లెన్సీ అవార్డుకు ఎంపిక చేసినట్లు కవి, రంగస్థల సీనియర్ కళాకారుడు, నటుడు బి.నర్సింహారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కీర్తి ఆర్ట్స్ అకాడమీ కల్చరర్, ఈవెంట్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రవీంద్రభారతిలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

కన్నీళ్లు మాకు.. నీళ్లు నల్లగొండకా?

- భూములను ముంచి అన్యాయం చేస్తే సహించేది లేదు
- మల్లన్నసాగర్ తరహాలోనే పరిహారం ఇవ్వాలి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచారి



ధర్నాలో మాట్లాడుతున్న ఆచారి

కల్వకుర్తి రూరల్: పాలమూరు భూములను ముంచి అక్రమంగా కల్వకుర్తి జలాలను నల్లగొండకు తరలిస్తే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి హెచ్చరించారు. నీళ్లు నల్లగొండకు.. కన్నీళ్లు మాకా? అని ప్రశ్నించారు. 30ఏళ్లుగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కోసం ఉద్యమిస్తుంటే ఈ ప్రాంతానికి సరైన న్యాయం చేయకుండానే జిల్లా భూములను ముంచి నల్లగొండకు నీళ్లు తీసుకెళ్లడం దారుణమన్నారు. శుక్రవారం డిండికి నీటి తరలింపులో భాగంగా భూములు కోల్పోతున్న ఎర్రవెల్లి, అజిలాపూర్, బైరాపూర్, గోకారం తదితర ముంపు గ్రామాల రైతులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్రభుత్వం స్థిరీకరించిన ఆయకట్టుకు నీరు అందించాకా నల్లగొండకు తరలిస్తే తమకేమీ ఇబ్బంది ఉండదన్నారు. ఇక్కడి పనులు పూర్తి కాకుండానే డిండి ప్రాజెక్టు పనులు వేగంగా జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పాలమూరు భూములను ముంచి నీరును తీసుకెళ్తున్నారని మండిపడ్డారు.

మల్లన్నసాగర్ పరిహారం చెల్లించాలి

మల్లన్న సాగర్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు ఏ విధమైన నష్టపరిహారం చెల్లించారో ఇక్కడా అదే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం రూ.4.5లక్షల పరిహారం చెల్లించడం తగదన్నారు. మల్లన్న సాగర్‌లో రైతులకు ఇచ్చినట్లే ఎకరాకు రూ.12లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. ఎర్రవెల్లి, గోకారం మధ్యలో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టవద్దని, ఈ రిజర్వాయర్ వల్ల ఈ ప్రాంత ప్రజల భూములు మునగడమే గానీ మేలు జరగదన్నారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్నం శేఖర్‌రెడ్డి, ఆమనగల్లు జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, బాలస్వామి, శేఖర్ రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, సంతుయాదవ్, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాసులు, ఆయకట్టు రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హలో సాక్షి..
అచ్చంపేట : 9440032423,
అచ్చంపేట రూరల్ : 9440821061
పదర : 9010719443,
లింగాల : 9951584583
ఉప్పునుంతల : 9441302253
బల్మూర్ : 9490142765
మన్ననూర్ : 9505507685,
అమ్రాబాద్ : 9490046935
దోమలపెంట : 9441759312



బోరు వేశారు.. వదిలేశారు..



నిరుపయోగంగా మారిన బోరు

అమ్రాబాద్: స్థానిక ఎస్సీ కాలనీలో తాగునీటి బోరువేసిన అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. మూడు నెలలు కావస్తున్నా మోటర్, చేతి పంపు బిగించలేదు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్ : 9440032423

మసక చీకటిలో ఇసుక దందా

- మామూళ్ల మత్తులో అధికారులు?
- ఇసుక ట్రాక్టర్ల అతివేగం
- భయాందోళనలో ప్రజలు



రాత్రిపూట అనుమతి లేకుండా ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్

అమ్రాబాద్: మసక చీకట్లో అక్రమంగా ఇసుక దందా జోరుగా సాగుతోంది. అధికారులు పట్టించుకోక పోవడంతో అడ్డు అదుపూ లేకుండా కొనసాగుతోంది. అచ్చంపేట మండలం దుందుభీ వాగు, బొమ్మన్‌పల్లి, సిద్దాపూర్ ప్రాంతాల నుంచి ఇసుకను డంప్ చేసుకొని రాత్రి వేళ్లలో ట్రాక్టర్ల ద్వారా అమ్రాబాద్, పదర మండలాలకు తరలిస్తున్నారు. ఇలా చాలా మంది అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు.

చెంచుల ఇండ్ల నిర్మాణం పేరుతో అనుమతి

నిత్యం 16నుంచి 20 ట్రాక్టర్ల ఇసుక ట్రాక్టర్లు యధేచ్ఛగా తిరుగుతున్నాయి, రాత్రి, తెల్లవారుజామున ఇసుక ట్రాక్టర్లను తరలిస్తారు. ఆర్‌డీటీ వారు చెంచులకు నిర్మిస్తున్న ఇండ్ల నిర్మాణం పేరుతో కొంత మంది ఫర్మిషన్లు తీసుకున్నప్పటికీ అధికంగా అక్రమంగానే ఇసుకను తరలిస్తూ లబ్ధి పొందుతున్నారు. ఆర్‌డీటీ పేరుతో ఫర్మిషన్‌లు తీసుకున్న వారు కూడా ఇతరులకు అక్రమంగా ఇసుకను అమ్ముతున్నారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.4000 నుంచి రూ.4500 వరకు అమ్ముతున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు?

అక్రమంగా ఇసుక దందా నడుస్తున్నా అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఎవరైనా ప్రజలు ట్రాక్టర్ల ను ఆపితే సంబంధిత అధికారులకు మామూళ్లు ఇస్తున్నామని చెప్పి తప్పించుకుంటున్నారు. ముఖ్యంగా ఇసుకను తరలించే ట్రాక్టర్లలో కొన్నింటికి కనీసం నంబర్లు కూడా లేవు. మన్ననూర్ చెక్ పోస్టు వద్ద ఇసుక ట్రాక్టర్లను కనీసం తనఖీ చేయరు. దీన్ని బట్టి చూస్తే మామూళ్ల బాగోతంపై అనుమాలు బలపడుతున్నాయి.

అతివేగంతో ప్రజల్లో ఆందోళన

అక్రమంగా ఇసుకను తరలించే ట్రాక్టర్లను అతివేగంతో నడుపుతున్నారు. డ్రైవర్లలో కొంత మంది మద్యంమత్తులో కనిపిస్తుంటారు. వాటి వేగానికి రోడ్డు ఒక్కోసారి పక్కకు జరిగి నిలువు కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాహనదారులు, ప్రయానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి..



చిన్న చిన్న అవసరాలకు ఇసుక అవసరముంటే అధికంగా నష్ట పోతున్నాం. అక్ర మ వ్యాపారులనే నమ్ముకోవాల్సి వస్తుంది. అలాగాకుండా ఎంతో రుసుము తీసుకొని లబ్ధిదారులకు ఇసుక అందేవిధంగా చూడాలి. – శివలింగం, తిర్మలాపూర్ (బీకే)

చర్యలు తీసుకుంటాం..

అక్రమంగా ఇసుక ను తరలిస్తే చర్య లు తీసుకుంటా ము. అమ్రాబా ద్, పదర మండలాల్లో ఇసుక వాగులు లేవు. అనుమతి లేకుండా కింది నుంచి ఇసుకను తెస్తే చర్యలు తీసుకుంటాం

– కృష్ణయ్య, తహసీల్దార్, అమ్రాబాద్

న్యూస్ బాక్స్

బాణాలలో 'టీమాస్' ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టీమాస్ ప్రతినిధులు

బల్మూర్: తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక 'టీమాస్' అధ్యయన యాత్ర శుక్రవారం మండలంలోని బాణాలలో నిర్వహించారు. ఈసందర్భంగా టీమాస్ మండల అధ్యక్షుడు శ్రావన్‌కుమార్ మాట్లాడారు. సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రజాసంఘాలు ఏకమై ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో టీమాస్ నాయకులు లాల్‌అహ్మద్, మహేందర్, శేఖర్, శ్రీను, వివిధ ప్రజాసంఘా నాయకులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో ఆకస్మిక సోదాలు



పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు స్టేజీ వద్ద శ్రీశైలం–హైదరాబాద్ రహదారి పక్కన ఉన్న శ్రీనివాస ట్రేడర్స్ రైస్‌మిల్లులో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా సోదాలు చేశారు. మిల్లులో ఉన్న బియ్యం, వరి ధాన్యం స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి వివరాలు సేకరించారు. పీడీఎస్ బియ్యం ఏమైనా ఉన్నాయా.. అనే కోణంలో సోదాలు నిర్వహించారు. స్టేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు రాజేశం. ప్రభాకర్‌రెడ్డి, వీఆర్వో భాస్కర్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ పర్వతాలు

అచ్చంపేట రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ పర్వతాలు కోరారు. శుక్రవారం పట్టణంలోని అభ్యుదయ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చందునాయక్, హెచ్ ఎం రామచంద్రయ్య, ఉపాధ్యాయులు సోమ సాయిబాబు, సురేష్, శంకర్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత



విద్యార్థులతో దాత భాస్కర్‌రావు

లింగాల: మండల పరిధిలోని అవుసలికుంట ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రావు శుక్రవారం విద్యార్థులకు చేయూత అందించారు. పాఠశాలలో 100కు పైగా విద్యార్థులు ఉండగా అభ్యసన సామాగ్రి, వివిధ రకాల చార్ట్‌లను ఉచితంగా అందజేశారు.ఇప్పటికే దాత పాఠశాల అభివృద్ధికి నిరంతరంగా సహాయం చేస్తూ ఉండడం పట్ల హెచ్‌ఎం. విజయలక్ష్మి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

టీఆర్‌ఎస్‌కు మాజీ అధ్యక్షుడి రాజీనామా



రాజీనామా చేసిన రాంమోహన్‌రావు

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేట గ్రామానికి చెందిన టీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు డీ.రాంమోహన్‌రావు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం విలేకర్లతో తెలిపారు. అధికారంలో లేని సమయంలో మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆయన వాపోయారు. దీంతో పాటు తన వ్యక్తి గత కారణలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన రాజీనామా లేఖను మండల పార్టీ అధ్యక్షుడికి పంపించనున్నట్లు ఆయన తెలిపారు.

లోకల్ వాయిస్

రుణాలు మాఫీ చేయాలి



అమ్రాబాద్: అన్నివర్గాల ప్రజలకోసం వివిధ పథకాలు ప్రవేశ పడుతున్న ప్రభుత్వంమహిళల కో సం మహిళాసంఘాల రుణాలు మాఫీ చేయాలి. సంసారంలో, కుటుంబ వ్యవహారాల్లో సగభాగాన ఉన్న మహిళలకు ప్రభుత్వం ఎంతో మేలు చేసినటకలవుతుంది.

– పాతిమా, మహిళాసంఘం, అమ్రాబాద్

సీసీరోడ్డు వేయించాలి..



మా కాలనీలో అంతర్గత రోడ్డుకు సీసీ లేక పోవడంతో ఇబ్బందిగా ఉంది. ముఖ్యంగా పరిసర ఇండ్లల్లో నుంచి వస్తున్న వృధా నీరు మా ఇంటి సమీపంలో చేరి ధోమలకు నిలయంగా మారుతుంది. అధికారులు అంతర్గత రోడ్డుకు సీసీ వేయించిడ్రైనేజీ నిర్మించాలి

– కల్మల ఆంజనేయులు, కల్మలోనిపల్లి

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో



వెండితెర



అచ్చంపేటలో

సాయిరాం: ఎంసీఏ
సత్యలక్ష్మి: ఒక్క క్షణం
లక్ష్మి: 2 కంట్రీస్

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

బల్మూర్: అచ్చంపేట ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) శీతాకాల శిబిరంలో భాగంగా మూడవ రోజు మండలంలోని ఇప్పకుంట గ్రామంలో యూనిట్–2 వలంటీర్లు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. యూనిట్–1 వలంటీర్లు గట్టుతుమ్మెన్‌లోని పంచాయతీ పరిసరాలను శుభ్రం చేశారు. పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కలిప్ంచారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు రవిందర్‌గౌడ్, భాస్కర్, అధ్యాపకులు విష్ణు, లక్‌పతి, శ్రీనివాస్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈ- పాస్ ద్వారా రేషన్ పంపిణీ



ఉప్పునుంతల: మండలంలో శుక్రవారం రేషన్ షాపుల్లో ఈ- పాస్ మిషన్ ద్వార వినియోగదారులకు సరకులను పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభించారు. రేషన్ కార్డులో ఉన్న వినియోగదారుని వేలిముద్రతో బయోమెట్రిక్ విధానం ద్వార సరకులను పంపిణీ చేశారు. మండలంలోని 23 రేషన్ షాపుల డీలర్లకు ఈపాస్ మిషన్లు అందజేశారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ సరకుల పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

రజకుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- ఘనంగా మడేలయ్య బ్రహ్మోత్సవాలు



కలశ ఊరేగింపులో నాయకులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

అచ్చంపేట రూరల్: రజకుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మాజీ మంత్రి రాములు అన్నారు. పట్టణంలోని మడేలయస్వామి ఆలయంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక ఉట్లకోనేరు ఆలయం నుండి స్వామిని, కలశాన్ని ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు రజక సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్మన్ తులసీరాం, జెడ్పీటీసీ రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ సుంకరి నిర్మల బాల్‌రాజు, టీఆర్ఎస్ నాయకులు మనోహర్, నర్సింహగౌడ్, కోట కిషోర్, సుంకరి బాల్‌రాజు, రజక సేవా సంఘం నాయకులు కేతేపల్లి పర్వతాలు, లింగం శ్రీనివాసులు, అశోక్, రమణయ్య, శ్రీనివాస్, నరేష్, టైలర్ శ్రీను, కాకునూరి రవి, తిర్పతిరాజు తదితరులు పాల్గొన్నారు.

Zone Guide

8నుంచి క్రికెట్ టోర్నీ

అచ్చంపేట రూరల్: మండల పరిధిలోని ఐనోల్‌లో ఈనెల 8నుంచి కొర్రతండా ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకాష్, వంశీనాయక్, కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విన్నర్ జట్టుకు రూ. 10వేల 116లు సీఎం రెడ్డి, రన్నర్ జట్టుకు రూ. 5వేల 116 ప్రకాష్‌నాయక్ ఇవ్వనున్నారని తెలిపారు. ఆసక్తిగల జట్లు ఎంట్రీ ఫీజు రూ. 799లు చెల్లించి ఈనెల 7 వరకు పేర్లు నమోదు చేసువాలని, సెల్‌నెంబర్లు 8501940670, 8464821823లను సంప్రదించాలని వారు కోరారు.

16న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

అమ్రాబాద్: ఈనెల 16న మండలంలోని లక్ష్మాపూర్(బీకే)లో అంబేద్కర్ విగ్రహ అవిష్కరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం అమ్రాబాద్‌లో అవిష్కరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజనసంఘం మండల అధ్యక్షుడు బాలకిష్టయ్య, ముత్యాలు, విజయమోహన్, నిరంజన్, బాలయ్య,వెంకటయ్య, వీరబద్రి ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

బల్మూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ప్రార్థనా సమయంలో ఎంఈఓ రామారావు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. అనంతరం పాఠశాల మధ్యాహ్న భోజన పథకం రికార్డులు, తరగతులను ఆయన పరిశీలించారు. సీసీఈ, ఎల్ఈపీ ఆంశలపై ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. ప్రార్థన సమయానికి ఉపాధ్యాయులు ఖచ్చితంగా హాజరు కావాలని ఆయన సూచించారు. పాఠశాల హెచ్ఎం ఇంద్రారెడ్డి, సీఆర్పీలు, ఐఈపీలు పాల్గొన్నారు.

అర్హులందరికీ మూడెకరాల భూమి

అచ్చంపేట రూరల్: అర్హులైన దళితులందరికీ మూడెకరాల భూమిని అందిస్తామని ఎస్సీ కార్పోరేషన్ ఎండీ లచ్చిరాం భూక్య చెప్పారు. డీఆర్ఓ మధుసూదన్‌నాయక్‌తో కలిసి ఆయన శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని చౌటపల్లి దళితులకు పంపిణీ చేసే భూమిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరలోనే అర్హులైన దళితులందరికీ మూడెకరాల భూమిని పంపిణీ చేస్తామన్నారు. ఎంతమంది అర్హులు ఉన్నా భూమిని ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది, సర్పంచ్ రఘుపతి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామానికి చెందిన 40 మంది టీడీపీ, టీఆర్ఎస్ కార్యకర్తలు శుక్రవారం కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ సర్పంచ్ సర్యానాయక్, చంద్రమౌళి, పరమేష్ నాయకత్వంలో నాలుగు వాహనాల్లో హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. 2019 ఎన్నికల్లో అన్ని స్థాయిల్లో కాంగ్రెస్ పార్టీని బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తామని అన్నారు. పార్టీలో చేరినవారిలో టీడీపీ వార్డు సభ్యురాలు శాంతిబాయి, కర్నాటి శ్రీనివాస్, శ్రీశైలం, విష్ణు, నంద, శ్రీను, గోపి, కుమార్, భరత్, నాసరయ్య, ఉసేన్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై అధ్యయనం



మామిళ్లపల్లిలో సర్వే చేస్తున్న నాయకులు

ఉప్పునుంతల: టీ–మాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తాడూరు, లక్ష్మాపూర్, మామిళ్లపల్లి, దాసర్లపల్లి గ్రామాల్లో టీ–మాస్ ఫోరం నాయకులు ప్రజాసమస్యలపై అధ్యయనం చేశారు. ఆయా గ్రామాల్లో పింఛన్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఎంతవరకు అందుతున్నాయి? తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీ–మాస్ ఫోరం నాయకులు చింతల నాగరాజు, శ్రీరాములు మాట్లాడారు. సామాజిక న్యాయం ద్వారనే సమగ్రాభివృద్ధి అనే లక్ష్యంతో 281 సంఘాలతో టీ–మాస్ ఏర్పాటైందన్నారు. ఈనెల 10 వరకు అధ్యయనం చేసి పరిష్కారం కోసం ప్రభుత్వం ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఈనెల 11, 12న అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు. ఈనెల 16 నుంచి 19 వరకు మండల కేంద్రంలో రిలే దీక్షలు, 22న కలెక్టరేట్ ముందు ధర్నా ఉంటుందని తెలిపారు. సర్వే కార్యక్రమంలో టీ–మాస్ ఫోరం నాయకులు నాగరాజు, శ్రీరాములు, సైదులు, కృష్ణ, రాజు, శ్రీనివాసులు, పరమేష్, జంగయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

అమ్రాబాద్: పాఠశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని పాఠశాల పూర్వ విద్యార్థి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచించారు. స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న నిర్వహించే పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనంపై ఉపాధ్యాయులు, కొంత మంది పూర్వ విద్యార్థులతోకలిసి మాజీఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హెచ్ఎం పాండు, ఉపసర్పంచ్ జహంగీర్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతిరావు సిఫార్సులను తిరస్కరించాలి

అచ్చంపేట: ఆచార్య తిరుపతిరావు కమిటీ సిపార్సులను తిరస్కరించాలని ప్రైవేట్ పాఠశాలలో రుసుముల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టం తేవాలని టీమాస్ ఫోరం అచ్చంపేట మండల చైర్మన్ ఎంఎం గౌడ్ శుక్రవారం అన్నారు. రుసుములను మూడేళ్లకోసారి పెంచాలని ఏటా 10శాతం వరకు పెంచుకోవచ్చని సిపార్సు రుసుం అమోదించవద్దని కోరారు. పాఠశాలల రుసుముల నియంత్రణ కమిటీ నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీశైలం, మల్లేష్, అంజనేయులు, పర్వతాలు, నిర్మల, గోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా బిల్లును రద్దు చేయాలి

అచ్చంపేట రూరల్: రోడ్డు భద్రతా రవాణా బిల్లును వెంటనే రద్దు చేయాలని టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌లాల్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో గేటు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు ఎజేరెడ్డి, పర్వతాలు, చంద్రయ్య, వెంకటయ్య, చంద్రమౌళి, నారాయణ, ఏకే గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపముఖ్యమంత్రిని అడ్డుకుంటాం’

అచ్చంపేట: ఎస్సీ వర్గీకరణకై ఈనెల 7వరకు తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీకి అఖిల పక్షం తీసుకెళ్లకపోతే అమ్రాబాద్‌కు వచ్చే ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిని అడ్డుకుంటామని ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మాచారం విష్ణు తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే కడియం శ్రీహరి అఖిల పక్షం తీసికెళ్లాలని కోరారు.

వృద్ధులకు రగ్గులు పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న దివ్యవాణి

అచ్చంపేట రూరల్: మండల పరిధిలోని బొల్గట్‌పల్లి స్టేజీ సమీపంలో ఉన్న లెనిటీ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో అచ్చంపేటకు చెందిన ఎన్ఆర్ఐ మామిళ్లపల్లి దివ్యవాణి శుక్రవారం వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. వృద్ధాశ్రమానికి తన వంతుగా ఆర్థికసాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యవాణి భర్త శ్రావణ్‌కుమార్, తల్లి పద్మజ ఉన్నారు.

పాఠశాలకు నీటిశుద్ధి ప్లాంట్ వితరణ

అమ్రాబాద్: స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు 1985–86 పదవతరగతి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం రూ. 60 వేల విలువ గల నీటిశుద్ధి ప్లాంట్‌ను అందజేశారు. అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పోషం జయంతిగణేష్ చేతుల మీదుగా పాఠశాల ప్రదానోపాధ్యాయులు పాండుకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రాంచందర్, ప్రభాకర్, గణేష్, వెంకటయ్య ఉన్నారు.

హలో సాక్షి..
కొల్లాపూర్ : 9705347090, 9492279709,
కొల్లాపూర్ రూరల్ : 9494271940,
పెద్దకొత్తపల్లి : 9948539858
కోడేరు : 9000917982
పెంట్లవెల్లి : 9553196005,

దిష్టిబొమ్మల్లా మారాయ్!

- గ్రామాల్లో నిరుపయోగంగా మారిన ట్యాంకులు, చేతిపంపులు
- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు.. పాలకులు



పెంట్లవెల్లిలో వృథాగా ఉన్న ట్యాంకు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని కొండూరు, గోప్లాపూర్, మంచాలకట్ట, మల్లేశ్వరం, పెంట్లవెల్లి గ్రామాల్లో వాటర్ ట్యాంకులు, చేతిపంపులు కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. పలు గ్రామాల్లో తాగడానికి నీరు లేక ఎంతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తే గ్రామాల్లో నీరు తాగేందుకు సులువుగా ఉంటుంది. మాధవస్వామినగర్, మల్లేశ్వరం గ్రామాలలో కరెంట్ లేకపోతే 2 కిలోమీటర్ల దూరం వెళ్లి బావిలో, రైతుల పొలాల్లో నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తుంది. కరెంట్ లేకపోతే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. వాటర్ ట్యాంకులకు చిన్న చిన్న మరమ్మతులు చేపడితే తాగడానికైనా ఉపయోగ పడతాయని గ్రామ ప్రజలు కోరుతున్నారు. సంవత్సరాల నుంచి వేచి చూస్తున్నా చేతిపంపులు బాగు చేయడం లేదని, ట్యాంకు చుట్టూ చెత్త పెరుగుతుంది కానీ అధికారులు, సర్పంచ్‌లు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పంచాయతీ సెక్రటరీ, అధికారులు చర్యలు తీసుకుని చేతిపంపులు, వాటర్ ట్యాంక్‌లను బాగుచేయించాలని కోరుతున్నారు.





మంచాలకట్టలో వృథాగా మారిన వాటర్ ట్యాంకు

మల్లేశ్వరంలో పాడైపోయిన చేతిపంపు

మరమ్మతు చేయండి



మండల పరిధిలోని ఎంగంపల్లిలో 20వేల నీటి సామర్థ్యం గల ట్యాంకు గత కొన్ని సంవత్సరాలుగా వృథాగా పడి ఉంది. ట్యాంకుకు చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తే ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉంటుంది. – లక్ష్మయ్య, ఎంగంపల్లి

తాగునీరు అందించాలి..



మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కొన్ని నెలల నుంచి చేతిపంపులు వృథాగా పడి ఉన్నాయి. కాలం గడిచిపోతున్నా మరమ్మతులు మాత్రం చేయడం లేదు. ఇప్పటికైనా స్పందించి తాగునీరు అందించాలి.

– ఎస్‌కే. ఖాజా, జటప్రోల్

ప్రమాదకరంగా మలుపు



పెంట్లవెల్లి: జటప్రోల్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో మలుపు ప్రమాదకరంగా ఉంది. మలుపు వద్ద సూచిక బోర్డు లేకపోవడంతో వచ్చి పోయే వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9492279709

న్యూస్ బాక్స్

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని దేవల్‌తిర్మలాపూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ రాంమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. అలాగే దేవల్‌తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి స్వచ్ఛభారత్ కింద మంజూరైన చెక్కులను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యం, సీనియర్ అసిస్టెంట్ గణపతి, ఈసీ సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్ దేవేందర్ తదితరులు ఉన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొల్లాపూర్: కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హర్షవర్ధన్ రెడ్డి తయారుచేయించిన కొత్త సంవత్సర క్యాలెండర్లను శుక్రవారం సింగోటంలో ఆవిష్కరించారు. ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌నాయక్ క్యాలెండర్లను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్లను నియోజకవర్గవ్యాప్తంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధ్యానాలపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రాఘవేంద్ర, పవన్, స్వామి, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభం



మరుగుదొడ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇస్తున్న అధికారులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిర్మలాపూర్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో స్వచ్ఛభారత్ కింద రూ.2లక్షల10వేలతో మరుగుదొడ్ల నిర్మాణాలకు ఎంపీడీఓ రాంమోహన్ శుక్రవారం మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుందని, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు వాటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలను కల్పించాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో దేవల్‌తిర్మలాపూర్ సర్పంచ్ సత్యం, ఈసీ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ గణపతి, గ్రామస్తులు శ్రీనివాసులు, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో పూజలు



సోమేశ్వరున్ని దర్శించుకుంటున్న లచ్చిరాం

కొల్లాపూర్: ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం మండలంలోని లలితాంబికా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సోమశిలకు వచ్చి సోమేశ్వరున్ని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయకమిటీ సభ్యుడు ఆయనను శాల్వ, పూలమాలలతో సత్కరించారు. అనంతరం కృష్ణానదిలో సోమేశ్వర లాంచీలో విహరించారు. లాంచీ ప్రయాణంలో నదీ అందాలను తిలకించారు. సోమశిలలోని పర్యాటక అందాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఆయనతోపాటు డీఆర్‌ఓ మధుసూదన్‌నాయక్, వీఆర్‌ఓ గోవిందరెడ్డి తదితరులు ఉన్నారు.

లోకల్ వాయిస్

మినీ లిఫ్ట్ ఇరిగేషన్‌ను మరమ్మతు చేయండి



పెంట్లవెల్లి: మండలం లోని ఎంగంపల్లి మినీ లిఫ్ట్ ఇరిగేషన్‌ను మొదలు పెట్టి వృథాగా వదిలేశారు. దాన్ని మరమ్మతు చేస్తే పంట పొలాలకు ఉపయోగ పడేలా ఉంటుంది. అధికారులు స్పందించి వెంటనే బాగు చేయాలి.

– బాలీశ్వర్, ఎంగంపల్లి తండా

పందుల బెడద తీర్చాలి..



మండల కేంద్రంలో కొన్ని నెలల నుంచి పందుల బెడద ఉంది. ప్రజావాణిలో పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. కాలనీలో విచ్చలవిడిగా పందులు తిరుగుతున్నాయి. పందుల బెడద నివారించాలని అధికారులను కోరుతున్నాం.

– జనార్దన్, పెంట్లవెల్లి

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

సాక్షి

మన కొల్లాపూర్

నాగర్‌కర్నూల్

శనివారం | జనవరి | 6 | 2018



వెండితెర



కొల్లాపూర్‌లో

వెంకటేశ్వర: ఎంసీఏ

సత్యసాయి: ఒక్క క్షణం

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పాన్‌గల్: గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన పాలకులు వాటిని విస్మరించారన్నారు. భూ నిర్వాసితులకు పరిహారం, జీఓ 98, 68 అమలు, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడురూం ఇళ్ల నిర్మాణం వంటి హామీలు అమలు కాలేదన్నారు. హామీల అమలు కోసం ప్రజలతో కలిసి పోరాటాలు చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. నాయకులు శ్రీరామ్, బాలస్వామి, చంద్రకాంత్, నర్సింహ్మ పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన



ప్రదర్శన ఇస్తున్న జేవీవీ సభ్యుడు

కొల్లాపూర్: గ్రామీణ ప్రాంతాల్లోని మూఢనమ్మకాలను పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి జితేందర్, రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ సూచించారు. మండలంలోని రామాపురంలో ప్రభుత్వ పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు మూడో రోజు కొనసాగాయి. గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మూఢనమ్మకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాత్రి గ్రామంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జితేందర్, వెంకటరమణతో పాటు, జేవీవీ సభ్యులు నాగేశ్వర సదస్సులో మాట్లాడారు. మంత్రాలు, మ్యాజిక్కులు, వాటి వెనక ఉన్న జిమిక్కిలను వివరించారు. అనవసరంగా మంత్రాలు, తంత్రాలు నమ్మవద్దని వారు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బచ్చలకూర బాలరాజు, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ వెంకటేశం, ఎంఎస్‌డబ్ల్యూహెచ్‌ఓడీ దేవరాజ్ పాల్గొన్నారు.

టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాన్‌గల్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల కావరణలోతెలంగాణటీచర్స్ యూనియన్ క్యాలెండర్‌ను శుక్రవారం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్‌రూల్స్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేస్తూ బదిలీలు, పదోన్నతులు సంకాంత్రి సెలవుల్లో చేపట్టాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

వీపనగండ్ల: పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అమలు చేసి అర్హత ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు వరప్రసాద్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ జంగిరెడ్డితో కలిసి ఆయన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మహిళా ఉపాధ్యాయయులకు రెండేళ్ల ప్రసూతి సెలవులు మంజూరు , పండిట్ పోస్టులు అప్‌గ్రేడ్, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, చిన్నయ్య, శివనాయక్, జీహెచ్ఎంలు రమాకాంత్, శైలజ, నాగేశ్వరమ్మ, వెంకట్రామ్‌రెడ్డి, సుజాత పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

వీపనగండ్ల: ఇంటి, నల్లా బిలుల్లు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఇన్‌చార్జి ఈఓఆర్డీ బద్రినాథ్ కోరారు. శుక్రవారం మండలంలో ఇంటింటికి తిరుగుతూ ఆయన ఇంటి పన్నులు వసూలు చేశారు.గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పన్నులుచెల్లించాలని సూచించారు.

స్ప్రింక్లర్లు పంపిణీ చేయాలి

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు స్ప్రింక్లర్లను అందజేయలేదని, వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి ఏ రైతులకు అవసరమున్నాయో గుర్తించి, దరఖాస్తు చేసుకున్న వారికి అందజేయాలని సీపీఎం మండల కార్యదర్శి కుర్మయ్య కోరారు. కార్యక్రమంలో రామస్వామి, లక్ష్మీదేవమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు తప్పించేందుకు క్రాస్‌రోడ్డు ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మండలంలో బస్టాండ్ కూడలిలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రోడ్డుపై డ్రమ్ములు పెట్టి రోడ్డు క్రాస్‌ను ఏర్పాటు చేయడంతో వాహనాల వేగం తగ్గిపోయింది. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించినప్పుడు మండలంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు డ్రమ్ములతో రోడ్డు క్రాస్ ఏర్పాటు చేయాలని సూచించడంతో ఎస్ఐ నరేష్ ఇటీవలే డ్రమ్ములు వేశారు. దీంతో వాహనాల వేగం తగ్గిపోవడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన

పాన్‌గల్: మండలంలోని కొత్తపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై ఏఓ హరిత రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ విత్తనోత్పత్తిలో భాగంగా ఎంటీయూ 1010 రకం విత్తనాలు రైతులకు సరఫరా చేశామన్నారు. వీటి ద్వారా వచ్చే పంటను వచ్చే సంవత్సరం విత్తనాల కోసం వినియోగించుకోవచ్చన్నారు. గ్రామ స్థాయిలో కల్తీ లేని నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. గొర్రెల పెంపకందార్ల సంఘం మండల డైరక్టర్ తిరుమల్‌యాదవ్ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ హరిత

భవిష్యత్‌కు ఇంటర్ పునాది

పాన్‌గల్: విద్యార్థి భవిష్యత్‌కు ఇంటర్ విద్య పునాదిలాంటిదని డీఐఈఓ సింహయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్యసాధన కోసం కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రైవేటుకు దీటుగా విద్య అందుతుందన్నారు. ఫిబ్రవరి 2 నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయని పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. పబ్లిక్ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి అధ్యాపకులకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక విన్యాసాలను తిలకించారు. పదవీవిరమణ పొందుతున్న జూనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్యను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ ప్రకాష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐఈఓ సింహయ్య

'ప్రాజెక్టుల పేరుతో దోపిడి'

పాన్‌గల్:రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో ఇష్టారాజ్యంగా దోపిడిచేస్తుందని, వీటిని ప్రశ్నిస్తే ప్రతిపక్షాలు ప్రాజెక్టులకు అడ్డుతగులుతున్నారనితప్పుడు ప్రచారం చేస్తున్నారనికాంగ్రెస్ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశానికి హాజరైన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మూ డున్నరేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు.వెంకటయ్యానాయుడు, తిరుపతయ్యానాయుడు, రాముయాదవ్, చంద్రయ్య, సర్పంచు నర్సింహ్మ, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్చాలి

వీపనగండ్ల: ఆర్థికంగా వెనకబడిన వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని మండలంలోని గోవర్ధనగిరిలో తీర్మానం చేశారు. మాజీ సర్పంచ్ బాబు నాయక్, నాయకులు శేఖర్, వెంకటయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులాల్లో చిచ్చు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయే తప్పా న్యాయం చేయలేదన్నారు. వాల్మీకి బోయలు సంఘటితమై పోరాటాలు నిర్వహించాలని వారు కోరా రు. సమా వేశంలో నర్సింహ, గురుమూర్తి, రాజయ్య, ఈశ్వర్, బాలకిష్టి, మౌలాలి, వెంకటేష్ పాల్గొన్నారు.



ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతున్న బోయలు

Zone Guide

నేడు జటప్రోల్‌లో స్వచ్ఛ భారత్

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో శనివారం సాక్షర భారత్ కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో మదన గోపాలస్వామి ఆలయం, హరిత హోటల్ తదితర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ నిర్వహిస్తామని కో ఆర్డినేటర్ చందన్‌గౌడ్ తెలిపారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల మంజూరు

పెంట్లవెల్లి: మండలంతోపాటు జటప్రోల్, మంచాలకట్ట గ్రామాల్లో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మిలకు సంబంధించిన చెక్కులు 13మందికి మంజూరైనట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. ఈ చెక్కులు త్వరలో మంత్రి జూపల్లి కృష్ణారావు చేత పెంట్లవెల్లిలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన వారికి త్వరలో మంజూరవుతాయని అన్నారు.

ఇంటర్వ్యూ

స్వచ్ఛ మండలమే ధ్యేయం

- చిన్న నిరంజన్‌రావు, ఎంపీపీ



కొల్లాపూర్‌రూరల్: కొల్లాపూర్ ఉమ్మడి మండలాన్ని స్వచ్ఛ మండలంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ఎంపీపీ చిన్న నిరంజన్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని పంచాయతీలు ఉన్నాయి?

జ: కొల్లాపూర్ ఉమ్మడి మండలంలో 15 పంచాయతీలు, అనుబంధ గ్రామాలు ఉన్నాయి.

ప్రశ్న: స్వచ్ఛ మండలంగా మార్చేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: అన్ని పంచాయతీలలో మరుగుదొడ్ల నిర్మాణాలు ముమ్మరం చేశాం. 70శాతం నిర్మాణాలు అన్ని గ్రామాల్లో పూర్తయ్యాయి.

ప్రశ్న: పారిశుద్ధ్య పనులకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చక్కబెట్టడానికి ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, వీఆర్వోలు గ్రామస్థాయిలో ఉన్న అన్నిశాఖల సిబ్బందిని సమాయత్తం చేస్తున్నాం. నిరంతరం గ్రామ శుభ్రతకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: మరుగుదొడ్ల నిర్మాణానికి బిల్లులు రాలేదని ప్రజలు అంటున్నారు. మీ స్పందన ఏంటి?

జ: ప్రతి గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణానికి స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా మంత్రి జూపల్లి కృషితో ముందుగానే గ్రామ పంచాయతీ అకౌంట్లో డబ్బులు వేయడం జరిగింది.

ప్రశ్న: ఏయే గ్రామాల్లో వైకుంఠ గ్రామాలు నిర్మించారు?

జ: మండలంలోని ఎన్మన్‌బెట్ల, కుడికిళ్ల, మల్లేశ్వరం, ముకిడిగుండం, మొలచింతలపల్లిలో వైకుంఠ గ్రామాల కోసం ఒక్కో గ్రామానికి మంత్రి జూపల్లి రూ.10లక్షలు మంజూరు చేశారు. ఆ పనులు పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయి.

ప్రశ్న: డంప్ యార్డుల నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ప్రతి గ్రామంలో ఊరి చివరన డంప్‌యార్డు కోసం ప్రభుత్వ స్థలం గుర్తించేందుకు గ్రామస్థాయి అధికారులకు బాధ్యత అప్పగించాం.కొన్నిగ్రామాల్లో స్థలాలు గుర్తించిపనులు జరుగుతున్నాయి.

చెత్త తొలగించాలి..



మురికి కాలువల వద్ద పందుల సంచారం

చారకొండ: మండల కేంద్రంలోని 3వ వార్డులో మురుగునీరు రోడ్లపై పారుతుంది. పందులు వీరవిహారం చేస్తుంన్నాయి. ఈగలు దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలభారిన పడుతున్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్ : 9440032423

హుండీ చోరీలు!

- పత్తాలేని దొంగల జాడ
- ఆలయాలకు భద్రత కరువు
- ఆందోళనలో భక్తులు, ఆలయ సిబ్బంది

చారకొండ: మండల పరిధిలోని ప్రముఖ ఆలయాల హుండీలు వరుసగా చోరీలకు గురవుతున్నాయి. గత మూడు నెలల నుంచి ఈ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో భక్తులు, ఆలయాల సిబ్బంది ఆందోళనలకు గురవుతున్నారు.

ఇవీ ఘటనలు..

మండల పరిధిలోని సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిధిలోని మైసమ్మ ఆలయం, గోకారం శివారులో సారగట్లమైసమ్మ దేవాలయం, జూపల్లిగ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయాల హుండీలు చోరీలకు గురయ్యాయి. గత మూడు నెలల వ్యవధిలో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. హుండీలను ప్రతి మూడు నెలలకోసారి లెక్కిస్తుంటారు. సిరుసన దేవాలయానికి సంవత్సరానికి 8నుండి10 లక్షల ఆదాయం వస్తుంది,సారగట్ల మైసమ్మ దేవాలయానికి 50వేల నుండి 2 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

పత్తాలేని జాడ..

ఈ ప్రముఖ ఆలయాల్లో హుండీలను దొంగిలించిన దొంగల జాడ మాత్రం నేటికీ లభించలేదు. చోరీల ఉదంతం ఎవరికీ అంతుపట్టడం లేదు. చిల్లరదొంగలా లేక గజ దొంగలా తెలియడం లేదు. చోరీ జరిగినప్పుడు ఆలయాల సిబ్బంది ఫిర్యాదుల మేరకు పోలీసులు పరిశీలించి వెళ్తున్నారు. కాని ఇంత వరకు నిందితులను గుర్తించలేదు.



హుండీని పరిశీలిస్తున్న వంగూరు ఎస్ఐ వీరబాబు(ఫైల్)

ఆందోళన చెందుతున్నాం

దేవాలయాల వద్ద జరుగుతున్న చోరీలు చూసి ఆందోళనకు గురౌతున్నాం. చోరీలు రాత్రిపూట అధికంగా జరుగుతున్నాయి. చిల్లరదొంగలు దేవాలయాల మీద మాటు వేసి వరుస చోరీలకు పాల్పడుతున్నారు. దేవాలయాల హుండీ చోరీలతో ఆదాయం తగ్గుతుంది. దీంతో దేవాలయాలకు వచ్చే భక్తులకు మౌళిక సదుపాయాలు కల్పించడానికి ఇబ్బందిగా ఉంది. *– నిరంజన్,* ఆలయ మేనేజర్, సిరుసనగండ్ల

చర్యలు తీసుకుంటాం

చారకొండ మండలంలో ముఖ్య ఆలయాల్లో హుండీ చోరీలు అధికంగా జరుగుతున్నాయి. నిందితుల కోసం గాలిస్తున్నాం. దుండగులు ఎంతటి వారైనా వదిలేదులేదు. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. దేవాలయాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం. *– గిరికుమార్ కల్కోట,* సీఐ, వెల్దండ

న్యూస్ బాక్స్

వాసవీక్లబ్ రీజియన్ కార్యదర్శిగా రమేశ్



నియామక పత్రం అందుకుంటున్న రమేశ్

కల్వకుర్తి రూరల్: వాసవీక్లబ్ వీ–102ఎ రీజియన్ కార్యదర్శిగా కల్వకుర్తి కి చెందిన కల్మిచర్ల రమేశ్, సెక్రటరీగా శ్రంతిలను నియమించారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో జిల్లా గవర్నర్ ఎర్రమల్ల శ్రావణ్‌కుమార్ వీరికి నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు గంప నాగేశ్వర్‌రావు, విజయ్ కుమార్, ఇంటర్నేషనల్ డైరెక్టర్ రమేశ్ బాబు తదితరులు ఉన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



విద్యార్థులతో మాట్లాడుతున్న భీముడు నాయక్

చారకొండ: విద్యతోనే సమాజంలో గర్తింపు ఉంటుందని జెడ్పీటీసీ భీముడునాయక్ అన్నారు. శుక్రవారం చారకొండ మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ విద్యార్థులతో మాట్లాడారు. కేజీబీవీ పాఠశాలలు బీదవిద్యార్థులకు ఆధునిక దేవాలయాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గురుకుల, కేజీబీవీ పాఠశాలలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. నాణ్యమైన విద్య, వసతులు సక్రమంగా కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌నాయక్, ప్రిన్సిపల్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతికి కారకులను శిక్షించాలి



వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఓలు

వెల్దండ: వీఆర్‌ఏ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్న శుక్రవారం వెల్దండ మండల వీఆర్‌ఓల, వీఆర్‌ఏల సంఘాల ఆధ్వర్యంలో డీటీ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారేగాం వీఆర్‌ఏ బోయిని సాయిలును ఇసుక మాఫియాకు చెందిన వారే హత్య చేశారన్నారు. దోషులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రాష్ట్ర సంఘాల పిలుపు మెరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాఘవేందర్‌రావు, వీఆర్‌ఓలు శంకరయ్య, శ్రీనాథ్, సైదులు, జ్యోతి, ముత్తమ్మ, శోభ, వీఆర్‌ఏలు సత్తయ్య, వెంకటయ్య, గణేష్, బంగారు తదితరులు ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

వెల్దండ: గ్రామీణ ప్రాంత పేదల సంక్షేమ కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ట్రేడర్‌సెల్ రాష్ట్ర కోకన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిరుపేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పేదలకు అండగా ఉన్న బీజేపీని విమర్శించిడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 60ఏళ్లుగా దేశాన్ని పాలిన చరిత్ర ఉన్న పేదలకు చేసింది ఏమీలేదన్నారు. హత్యరాజకీయాలు, అవినీతి రాజకీయం చేసి దేశాన్ని చిన్నాభిన్నం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన ఆరోపించారు. దళితున్ని రాష్ట్ర పతిని చేసిన ఘనత బీజేపీదే అన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శివప్రసాద్, శ్రీనివాస్‌గౌడు, రామకృష్ణ, అంజి, మహేష్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఒకరోజు వేతనం కట్

కల్వకుర్తి టౌన్‌: కల్వకుర్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమయానికి ఉపాధ్యాయులు హాజరుకానందుకు వారికి ఒకరోజు వేతనం నిలిపివేయాలని డీఈఓ జనార్ధన్ రావు ఆదేశించారు. శక్రవారం ప్రార్ధనా సమయానికి హాజరుకాలేదని ప్రధానోపాధ్యాయురాలు శివకుమారి చరవాణిలో డీఈఓకు సమాచారం ఇవ్వడంతో హాజరుకాని ఉపాధ్యాయులకు ఒకరోజు వేతనం నిలిపివేయాలని డీఈఓ ఆదేశాలు అందినట్లు ప్రధానోపాధ్యాయురాలు శివకుమారి తెలిపారు. సమయ పాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

లోకల్ వాయిస్

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి



చారకొండ: నాయీ బ్రహ్మణులకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలను ఇవ్వాలి. అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారు. హెయిర్‌కటింగ్ షాపులను ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీతో కూడిన వడ్డి లేని రుణాలివ్వాలి. నాయీబ్రహ్మణుల సంక్షేమానికి కృషిచేస్తామని ఎన్నికలప్పుడు హామీలిచ్చిన నాయకులు ఆ తరువాత మరిచిపోతున్నారు. *– యాదయ్యనాయీ,* జూపల్లి

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



చారకొండ: టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. దళితులకు 3 ఎకరాల వ్యవసాయ భూమి, డబల్‌బెడ్‌రూం ఇండ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చి మాటనిలబెట్టుకోవాలి. నిరుద్యోగులు ఉద్యోగాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ వస్తే చదువుకున్న నిరుద్యోగులందరికి ఉద్యోగాలు వస్తాయని ఆశపడిన వారికి నిరాశే మిగిలింది. *– బాల్‌రాజు,* జూపల్లి

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో



కల్వకుర్తిలో..
పార్థసారథి : ఆక్సిజన్
అశోక : ఇంద్రసేన
నేషనల్ : జవాన్

సాక్షి మన కల్వకుర్తి
నాగర్‌కర్నూల్
శనివారం | జనవరి | 6 | 2018



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

చారకొండ: తుర్కలపల్లి సర్పంచ్ రాంకొండ శుక్రవారం బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు.సైదమ్మకు రూ.11 వేలు, విజయకు రూ.11వేలు, హైమావతికి రూ.14వేల చెక్కులను అందజేశారు. నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములమ్మ, టీఆర్ఎస్ నాయకులు శ్రీను, రమేష్, సలీం, జగన్ పాల్గొన్నారు.

రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీ

వంగూరు: మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామ సమీపంలో ఉన్న శ్రీసాయి వెంకటేశ్వర రైస్‌మిల్‌లో శుక్రవారం రాష్ట్ర విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మిల్లులో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం వచ్చిందని అందులో భాగంగానే తనిఖీలు నిర్వహించినట్లు విజిలెన్స్ అధికారులు విశ్వనాథం, రాజేష్ తెలిపారు. ఎలాంటి బియ్యం దొరకలేదని పేర్కొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

- 'భోజనం' ఖర్చు ప్రతి విద్యార్థికి రూ.12 చెల్లించాలి
- టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నయ్య




క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చారకొండ: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2018 క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవలసిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వహించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు.

ప్రతి విద్యార్థికి రూ.12 కేటాయించాలి..

మధ్యాహ్న భోజనానికి సంబంధించి ప్రతి విద్యార్థికి 12 రూపాయలు ప్రభుత్వం కేటాయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీస్‌రూల్స్‌ను రూపొందించి పదోన్నతులు కల్పించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని గజ్వేల్‌లో నిర్వహిస్తున్న దీక్షకు టీఎస్‌యూటీఎఫ్ సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌నాయక్, జెడ్పీటీసీ భీముడునాయక్, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిహెచ్‌ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు వెంకటేష్‌గౌడ్, తిరుపతి, మహిపాల్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, గోపాలాచారి, వెంకటేశం, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాధవి, జోత్స్న, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మెమోలు జారీ



కల్వకుర్తిరూరల్: మండలంలోని వెంకటాపూర్ పాఠశాల ఉపాధ్యాయుడు శివకుమార్ అనుమతి లేకుండా సెలవుపై వెళ్లినందుకు మెమో జారీ చేసినట్లు ఎంఈఓ బాసునాయక్ శుక్రవారం విలేకర్లకు తెలిపారు. రికార్డుల పర్యవేక్షణ సరిగ్గా నిర్వహించని కుర్మిద్ద పాఠశాలకు చెందిన వనిత, దేవిలాల్‌కు మెమోలు జారీ చేసినట్లు చెప్పారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హెచ్చరించారు.

Zone Guide

నేడు సీడ్ కార్పొరేషన్ చైర్మన్ రాక

వంగూరు: తెలంగాణ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ కోటేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ జగన్మోహన్, సీడ్ సర్టిఫికేషన్ అధికారి కేశవులు వస్తున్నట్లు సహకార సంఘం నిర్వాహకులు అల్వాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని తిరుమలగిరిలో నేడు సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.

'ఆచారి అరెస్టు అక్రమం'

కల్వకుర్తిరూరల్: రైతులకు న్యాయం చేయాలని,సాగునీరు అందించాలని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచారిని అరెస్టుచెయడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా కార్యదర్శి రాఘవేందర్ గౌడ్ శుక్రవారం విలేఖర్ల సమాశంలో అన్నారు. అరెస్టును తీవ్రంగా ఖండించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ నిర్భందాన్ని అందరూ ఖండించాలని కోరారు.

పాఠశాల స్వీపర్ మృతి

వంగూరు: మండల పరిధిలోని నిజాంబాద గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న లక్ష్మయ్య(55) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. స్వీపర్ల డివిజన్ సంఘం అధ్యక్షులు కేశవులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

ఆర్మీ జవాన్‌కు గ్రామస్తుల సన్మానం



సురేందర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

వంగూరు: వంగూరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన సురేందర్ పదిహేడేళ్ల పాటు సైన్యంలో పనిచేసి గత ఏడాది డిసెంబర్ 31న పదవీ విరమణ పొందాడు. ఆయనను శుక్రవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, యువకులు ఘనంగా సన్మానించారు. దేశరక్షణ కోసం పనిచేయడం గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాసులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

సకాలంలో బ్యాంక్ రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న అల్వాల్‌రెడ్డి

చారకొండ: హహిళాసంఘాలు బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ యెన్నం అల్వాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోకారం గ్రామంలో సంఘదర్శిని కార్యక్రమం జరిగింది. ఈ సంధర్భంగా మహిళలకు అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలను ప్రతినెలా 15 తేదీలోపు చెల్లించి పావలా వడ్డి పొందాలన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. వ్యవసామేతర పరిశ్రమలు పాడి, గొర్రెలపెంపకం, తదితర వాటిపై దృష్టి సరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నర్సయ్యగౌడ్, సీసీ కిష్టమ్మ, బ్యాంకు సిబ్బంది రాధాకృష్ణ, ఖాదర్ పాష, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా డివిజన్‌స్థాయి క్రీడలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీఈటీలు



పోటీల్లో తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో శుక్రవారం డివిజన్‌స్థాయి క్రీడాపోటీలు ఉత్సహంగా ప్రారంభమైన్నాయి. స్వామి వివేకనంద 155వ జయంతి వేడుకలను పురస్కరించుకోని ఎబివిపి ఆధ్వర్యంలో ఈపోటీలు నిర్వహించారు.ఈపోటీలలో డివిజన్ పరిధిలోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.కబడ్డి,కోకో తోపాటు పలు పోటీలు నిర్వహించారు. మొదట వివేకనంద, సర్వస్వతి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ప్రకాశ్, క్ష్మికాంత్, లాలూ ప్రసాద్, శ్రీకాంత్, పీఈటీలు శారదబాయి, వరలక్ష్మి, రమేష్, మోహన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల గేట్ ధర్నా



ధర్నాలో పాల్గొన్న టీఎంయూ నాయకులు

కల్వకుర్తిరూరల్: కార్మికుల న్యాయమైన డిమాండ్ వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో గేట్ ఎదుట టీఎంయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టీసీ కార్మిక నాయకుడు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హమీలను నెరవేర్చాలన్నారు. కొత్త పీఆర్‌సీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం రూపొందించిన వాహన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ ధార్నాలో నాయకులు రవీందర్, వీఎస్ రెడ్డి, చారి, భక్తిరాం, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

'శాలివాహన' క్యాలెండర్ ఆవిష్కరణ



కల్వకుర్తి రూరల్/ కల్వకుర్తిటౌన్: పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో శుక్రవారం శాలివాహన సంఘం 2018 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నగర పంచాయతీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, సంఘం జిల్లా అధ్యక్షుడు శంకరయ్య, మాజీ ఎంపీటీసీ ఎడ్మ సత్యం , కౌన్సిలర్ రామరాజు హాజరయ్యారు.

మిడ్జిల్ తరలిన టీఆర్ఎస్ కార్యకర్తలు

ఊర్కొండ: మిడ్జిల్ మండల కేంద్రంలో టీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. అన్ని గ్రామాల నుంచి బైక్ ర్యాలీగా ఊర్కొండ గేటు వద్దకు చేరుకొని టపాకాయలు కాల్చారు. ఎంపీపీ దీపగోపాల్ రెడ్డి జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. దాదాపు 500 బైక్‌లు మండలం నుంచి మిడ్జిల్‌కు తరలివెళ్లినట్లు టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిరినాయక్ తెలిపారు. ఊర్కొండ సర్పంచ్ శ్రీనివాసులు, నాయకులు చంద్రకాంత్ తదితరులున్నారు.

మంద కృష్ణ మాదిగ అరెస్ట్‌కు ఖండన

వంగూరు: సీఎం కేసీఆర్ నియంతను తలపిస్తున్నారని కాంగ్రెస్ మీడియా సెల్ కన్వీనర్ జైపాల్‌రెడ్డి, మండల నాయకులు చంద్రమౌళి, నందు విమర్శించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై పోరాటం చేస్తున్న మందకృష్ణమాదిగను రెండోసారి అరెస్టు చేయడం తగదన్నారు. తక్షణమే విడుదల చేయాలన్నారు.

జ్ఞాన కేంద్రాలు

- వనపర్తి జిల్లాలో 10అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు
- 'స్వేరోస్' ఆధ్వర్యాన ఏర్పాటు
- కేంద్రాల ద్వారా విజ్ఞానం, విద్య, ఆరోగ్యం

గోపాల్‌పేట(వనపర్తి): ఎక్కడ విజ్ఞానం వెల్లి విరుస్తుందో అక్కడ ప్రజల ఆలోచనలు, ఆచరణ, ఆశయాలు గొప్పగా ఉంటాయి. సమాజ పరిణామం కూడా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది. అనుభవ జ్ఞానంతో పాటు పుస్తక పఠనం మనిషిని మానసిక వికాసం వైపు నడిపిస్తుంది. అందుకు అనువైన స్థలాలు గ్రంథాలయాలు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు(ఏవీఎం) పేరుతో వనపర్తి జిల్లాలో మొత్తం 10మందిరాలను ప్రారంభించారు. వీటి ద్వారా నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంచడమే కాకుండా విద్యార్థులకు పరీక్షల సమయంలో ప్రత్యేక తరగతులు, కరాటే వంటి శిక్షణ ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



పాల్కెపహాడ్‌లో అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో పుస్తకాలను పరిశీలిస్తున్న గురుకులాల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

లక్ష్యం

ప్రతి విజ్ఞాన మందిరంలో ఉదయం వేళ స్వేరో ఆంథమ్ పాడటం ద్వారా తమ కార్యక్రమాలను ప్రారంభిస్తారు. మహనీయుల త్యాగాలను స్మరిస్తూ భవిష్యత్‌లో జ్ఞానం యొక్క ప్రాధాన్యతను వివరించే ఈ పాట విద్యార్థులలో నూతనోత్తేజాన్ని కలిగిస్తుంది.

నిత్య నియమావళి

ప్రతి విజ్ఞాన మందిరంలో స్వేరోస్ నిత్య నియామవళి(10 కమాండ్‌మెంట్స్) బ్యానర్ ప్రదర్శించబడి ఉంటుంది. ప్రతి నియమం కూడా విద్యార్థులను లక్ష్యం వైపు సాగే విధంగా ఉంటుంది. ప్రతిరోజూ కమాండ్‌మెంట్స్ చదవడం ద్వారా ఏదైనా సాధించగలమన్న విశ్వాసం ఇక్కడి పిల్లలలో పెంపొందుతుంది. మొత్తం తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు 235అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు ప్రారంభించారు. అంబేద్కర్ విజ్ఞాన మందిరం లేని చోట కూడా స్వేరోస్ సర్కిల్ కేంద్రాన్ని ప్రారంభించి విద్యార్థులకు శారీరక వ్యాయామం, చదువుపై ఆసక్తి కలిగిస్తున్నారు.

యువత కోసం..

2012లో స్వేరోస్ ఇంటర్నేషనల్ పేరుతో పూర్వ విద్యార్థులు నెట్‌వర్క్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు, యువత చెడు ప్రభావాల వైపునకు లోనుకాకుండా ఉండేందుకు నెట్‌వర్క్ తీసుకుంటున్న కార్యక్రమాల్లో భాగంగా అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు ఏర్పాటుచేస్తున్నారు. ప్రతి విజ్ఞాన మందిరాన్ని స్వేరోస్ సర్కిల్‌గా మార్చారు. ప్రతి సర్కిల్‌లో కమాండర్ పేరు మీద ఒక ఇన్‌చార్జ్‌ని నియమించారు. ఉదయం, సాయంత్రం విజ్ఞాన మందిరం తెరవడం పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంచడం, రికార్డు నిర్వహించడం మొదలైన పనులను చూస్తారు. వీటితో పాటుగా ఉదయం 6 నుంచి 7గంటల వరకు వ్యాయామం, యోగా, కరాటే వంటివి శారీరక దారుఢ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు నిత్యం ఓ సబ్జెక్టుపై(ఆంగ్లం, గణితము, సైన్స్) తరగతులు నిర్వహిస్తారు. అలాగే, ప్రతి ఆదివారం వివిధ అంశాలపై ఆటల పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం జరుగుతుంది. గ్రామంలోని బడి ఈడు పిల్లలంతా ఉత్సాహంగా స్వేరోస్ సర్కిల్‌లో పాల్గొంటుండటంతో తల్లిదండ్రులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడెక్కడ..

గోపాల్‌పేట మండలంలోని పాల్కెపహాడ్, చెన్నూరు, తాడిపర్తి, నర్సింగాయపల్లి, రేవల్లి మండలంలోని తల్పునూరు, చెన్నారం, పెద్దమందడి మండల కేంద్రం, పాన్‌గల్ మండలంలోని కొత్తపేట, వనపర్తి పట్టణం, బుద్దారం గురుకుల పాఠశాలలో ఈ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో 8అంబేద్కర్ విజ్ఞాన మందిరాలను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గురుకులాల కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించగా, వనపర్తి గ్రంథాలయాన్ని కలెక్టర్ శ్వేతామహంతి ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో సుమారు రూ.10వేల విలువైన పుస్తకాలతో పాటు తెలుగు, ఇంగ్లిష్ దినపత్రికలు రెండే కాకుండా మాసపత్రికలు కూడా అందుబాటులో ఉంటాయి.



వనపర్తిలో అంబేద్కర్ విజ్ఞాన మందిరాన్ని ప్రారంభించాక రికార్డులో సంతకం చేస్తున్న కలెక్టర్ శ్వేతామహంతి (ఫైల్)

నిత్యం విజ్ఞాన మందిరానికి వెళ్తా..



అంబేద్కర్ విజ్ఞాన మందిరానికి ప్రతిరోజు రావడం వల్ల పఠన శక్తి బాగా పెరిగింది. మహనీయుల చరిత్రలు చదవడం వల్ల వారి నుంచి స్ఫూర్తిని పొందడం జరిగింది. స్వేరో 10 కమాండ్‌మెట్స్ నాకు మంచి ప్రేరణను కలిగించాయి. – పార్వతయ్య, నర్సింగాయపల్లి, గోపాల్‌పేట మండలం

మహనీయుల చరిత్ర తెలుసుకున్నా..



అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు చక్కని జ్ఞాన సంపదకు నిలయాలు. ఇందులో నేను అంబేద్కర్, రమాబాయి, జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే జీవిత చరిత్రలు చదివి స్ఫూర్తిని పొందతున్నాను. రోజు విజ్ఞాన మందిరానికి వెళ్లి కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నాను. – ఆర్.మహేష్, తాడిపర్తి, గోపాల్‌పేట మండలం




నర్సింగాయపల్లి కేంద్రం వద్ద కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

విజ్ఞాన మందిరాలది కీలకపాత్ర



జ్ఞానవంతమైన సమాజ నిర్మాణంలో అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు కీలక పాత్ర పోషిస్తాయి. గ్రామాలలో విద్యా ప్రాధాన్యత తెలియక సమయాన్ని వృథా చేసుకుంటున్న యువతకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజకరంగా ఉన్నాయి. ప్రారంభంలో వీటిపై అవగాహన లేకపోయినా సర్కిల్స్ ప్రారంభించాక నిత్యం కనీసం 30మంది విద్యార్థులు ప్రతి విజ్ఞాన మందిరంలో పాలు పంచుకుంటున్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా కమాండర్స్ రోజుకు రెండు పూటల తమ సేవలను వినియోగిస్తున్నారు. రాబోయే తరాలకు అత్యున్నతమైన విద్యను అందించడమే విజ్ఞాన మందిరాల ప్రధాన లక్ష్యం.
– సి.కిరణ్‌కుమార్, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు

ఆధునిక టెక్నాలజీకి హబ్ వంటివి



అంబేద్కర్ విజ్ఞాన మందిరాలు ఆధునిక టెక్నాలజీకి హబ్ వంటివి. భవిష్యత్ సమాజం మొత్తం సాంకేతిక పరిజ్ఞానం మీద ఆధారపడే మనుగడ సాగిస్తుంది. మాతృభాష మీద మమకారం కొనసాగిస్తునే ప్రపంచ భాషను రాబోయే తరం పిల్లలకు అందించడం కూడా అంబేద్కర్ విజ్ఞాన మందిరాల ప్రధాన లక్ష్యం. పిల్లలకు చరిత్రను పరిచయం చేస్తూనే భవిష్యత్‌పై నమ్మకం, విశ్వాసం కల్పించడం ఈ మందిరాల ఏర్పాటులో మరో ముఖ్య ఉద్దేశం. ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన వల్ల భవిష్యత్ స్వేరోస్ సర్కిల్స్ అన్ని గ్రామాలలో ఏర్పాటు చేస్తాం.
– డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ గురుకులాల కార్యదర్శి



రగ్బీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు (ఫైల్)

- రగ్బీలో రాణిస్తున్న ఆత్మకూర్ ఆణిముత్యాలు
- ఉమ్మడి జిల్లాల బాలురు, బాలికల జట్లలో ఇక్కడివారే..
- జాతీయస్థాయిలో సత్తా చాటుతున్న క్రీడాకారులు



ఆత్మకూర్(కొత్తకోట): పంతం నీదా నాదా సై.. సొంతం నీకా నాకా సై.. భగభగా మరిగిన రక్తం మాదే మాదే సై.. తెగతెగ పైకెగిరిన పందెం మాదే మాదే సై.. లేపేస్తాం బంతి చూపిస్తాం సత్తా పోటాపోటీ నిలిచామంటే బాడీ ఫట్ ఫట్ ఫట్ సై..సై. అంటు మేము సైతం సిద్ధం అంటు రాజమౌళి తీసిన సై చిత్రాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు గ్రామీణ క్రీడా కారులు.

యూరప్ దేశాలకే పరిమితమైన రగ్బీ క్రీడకు ఇటీవల కాలంలో గ్రామస్థాయిలోనూ ప్రత్యేక ఆదరణ లభిస్తుంది. ఆత్మకూర్ మండలంలోని తిప్డంపల్లి, కురుమూర్తి, పిన్నంచర్ల, ఆత్మకూర్‌కు చెందిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ ప్రతిభను చాటుకుంటున్నారు. తిప్డంపల్లికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పరమేష్, రవికుమార్ ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉమ్మడి జిల్లాలకు బాలురు, బాలికల జట్లను సిద్ధం చేసి జాతీయస్థాయిలో సైతం ఆడుతూ ఆత్మకూర్ ఆణిముత్యాలుగా నిలుస్తున్నారు. అండర్–17, అండర్–19 రగ్బీ పోటీలకు గాను ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి మూడేళ్లుగా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

ఆత్మకూర్ నుంచే జిల్లా జట్టు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రగ్బీ పోటీలకు జట్లు లేకపోవడంతో ఆత్మకూర్‌కు చెందిన జట్లనే జిల్లా జట్లుగా ఎంపికచేసి 2015లో కరీంనగర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీపోటీలకు వెళ్లడం జరిగింది. అక్కడ సత్తా చాటి రాష్ట్రస్థాయిలో అండర్–17లో ప్రథమ బహుమతి, అండర్ –19లో ద్వితీయ బహుమతి సాధించి ఆదర్శంగా నిలిచారు.

- 2016 జనవరిలో అదిలాబాద్ జిల్లాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో అండర్ –19 మొదటి బహుమతి, అండర్ –17లో రెండో బహుమతిని కైవసం చేసుకున్నారు.
- 2016 నవంబర్‌లో రంగారెడ్డిలో రాష్ట్రస్థాయి పోటీల్లో మెదటి స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీల ఎంపికలో అండర్ –17జట్టులో ఐదుగురు, అండర్ –19జట్టులో ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు.
- గతేడాది చివరిలో ఒడిస్సాలోని భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. అదేవిధంగా 18 డిసెంబర్ 2017న హైదరాబాద్‌లోని దోమలగూడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో బహుమతిని సాధించారు. ఈ క్రీడాకారులంతా పేదింటికి చెందిన వారే కావడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం రగ్బీ క్రీడను ప్రోత్సహించి ఆదరిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తామని కోచ్‌లు, విద్యార్థులు అంటున్నారు.





జాతీయక్రీడల్లో రాష్ట్ర బాలికల జట్టు, ఎస్‌జీఎఫ్ స్టేట్ సెక్రటరీ రాంరెడ్డి చేతులమీదుగా ట్రోఫీ అందుకుంటున్న చాంపియన్లు (ఫైల్)



జాతీయక్రీడల్లో పాల్గొన్న అండర్-19 రాష్ట్ర జట్టు (ఫైల్)

మొదట్లో భయపడ్డా..



రగ్బీ కోచ్ పరమేష్ ఆటపట్ల నాతోపాటు తోటి విద్యార్థులకు వివరించడంతో మొదట్లో చాలా భయపడ్డాం. ఎలాగైనా సరే ఆడితీరాలని నిర్ణయించుకొని శారీరకంగా సిద్ధమై ఆటలపోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడి నేనేమిటో నిరూపించుకున్నాను.
– నందిని, విద్యార్థిని, ఆత్మకూర్

కఠోర సాధనతో వెళ్లాను



గతంలో పాఠశాలస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్నప్పటికీ రగ్బీ క్రీడపై ఎలాంటి అవగాహన లేదు. ప్రస్తుతం కఠోర సాధనతో జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభను చాటుతున్నాను. జాతీయస్థాయి రగ్బీలో అందివచ్చే అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లున్నాను. అంతర్జాతీయ రగ్బీ పోటీల్లో పాల్గొనే లక్ష్యం ఉంది.
– ప్రవీణ్, అండర్–17, రాష్ట్రజట్టు కెప్టెన్, ఆత్మకూర్

అంతర్జాతీయ స్థాయి పోటీలే లక్ష్యం



తెలంగాణ రాష్ట్రం నుంచి అంతర్జాతీయ రగ్బీ క్రీడాకారులను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. దీనికిగాను అమేచ్యూర్ రగ్బీ అసోసియేషన్ వారితో సంప్రదించి వారి సహకారంతో గ్రామీణ ప్రాంతంలోని బాలబాలికలకు ఉచితంగా శిక్షణలు ఇచ్చి క్రీడాకారులను ఎంపిక చేసుకొని శిక్షణలు ఇచ్చి సత్ఫలితాలు పొందుతున్నాం.
– పరమేష్, రాష్ట్ర జట్టు కోచ్, ఆత్మకూర్

రగ్బీని ప్రోత్సహించాలి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమెచ్యూర్ రగ్బీ ఆటను ప్రోత్సహించాలి. నాలాంటి క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఆడి తెలంగాణ సత్తాను చాటుతాం. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టి సారించాలి.
– భానుప్రకాష్, అండర్–19, రాష్ట్ర జట్టు కెప్టెన్, ఆత్మకూర్

సంతోషానికి అవధుల్లేవ్



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూర్ నుంచి అండర్–17, అండర్–19 రగ్బీ జట్లను ఏర్పాటు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాం. ప్రతిఒక్కరూ అభినందనలతో ముంచెత్తుతున్నారు. బాలబాలికలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారు.
– రవికుమార్, జిల్లా కోచ్, ఆత్మకూర్

శ్రమకు ఫలితం



రగ్బీ శిక్షణ కాలంలో పడ్డ శ్రమకు జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించడంతో ఫలితం దక్కడం సంతోషం కలిగించింది. రగ్బీ సాదన సందర్భంగా అనేకసార్లు బాధపడ్డాం. చికిత్స పొందుతూనే పట్టుదలతో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నాం.
– నిఖిత, విద్యార్థిని, ఆత్మకూర్

ఆధ్యాత్మికతతోనే జన్మ సార్థకం

- హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి
- మక్తల్‌లో అయ్యప్ప మహాపడిపూజ

మక్తల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ఉన్నప్పుడే జన్మసార్థకం అవుతుందని జగద్గురు హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి అన్నారు. మక్తల్‌లో శుక్రవారం జరిగిన 35వ అయ్యప్పస్వామి మహాపూజ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అబిషేకం, పాలాభిషేకం, హోమం చేశారు. అంతకుముందు పట్టణంలో ఉమామహేశ్వర ఆలయం నుంచి అయ్యప్పస్వామిని భక్తులు ఊరేగింపుతో ఆలయం వరకు చేరుకున్నారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. దైవభక్తి అలవర్చుకుంటే మనిషి సన్మార్గంలో పయనిస్తాడన్నారు. మంచి కోరే భక్తులకు దేవుడు మంచే చేస్తాడన్నారు. ఆలయ నిర్మాణానికి నగదు, విగ్రహాలు అందజేసిన దాతలను సన్మానించారు. అయ్యప్ప పూజా కార్యక్రమంలో అయ్యప్ప కనకవర్షంలో రూ.లక్ష విరాళంగా మార్కెట్ చైర్మన్ నర్సింహ అందజేయగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నేరడ్గం పీఠాధిపతి పంచమ సిద్దిలింగ మహాస్వామి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కె.దయాకర్‌రెడ్డి, సీతమ్మ, ఎమ్మెల్యే సతీమణి సుచరిత, జెడ్పీటీసీ వి.శ్రీహరితో పాటు శ్రీనివాస్, కొండయ్య, వర్కటం జగన్నాథ్‌రెడ్డి, ఓంప్రకాష్, వెంకట్, వెంకటేశ్వర్లు, బాల్చేడ్ మల్లికార్జున్, మక్తల్ కట్ట సురేష్‌కుమార్, చంద్రకాంత్, రాజేష్ పాండే, నర్సింహరెడ్డి, రాజుల ఆశిరెడ్డి, గోపాల్‌రెడ్డి, గురుస్వాములు అశోక్, అనిల్‌కుమార్, గణేష్, శ్రీధర్‌గౌడ్, లక్ష్మణ్, విష్ణువర్ధన్‌రెడ్డి, నిరంజన్, జగదీష్, ఆనంద్, భీంరెడ్డి, గొవర్ధన్‌రెడ్డి, భాగ్యమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి



అయ్యప్పస్వామి విగ్రహానికి పాలాభిషేకం





పూజకు హాజరైన భక్తులు , అయ్యప్పస్వామి ఊరేగింపులో భజన చేస్తున్న భక్తలు



మార్కెట్ చైర్మన్ నర్సింహగౌడ్‌కు సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు